రజని గేయములు

Ci

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

20
11

శేషపత్రసుందరి

గేయసంపుటి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11106

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11106

బాలాంత్రపు రజనీకాంతరావు, బి. ఏ., ఆనర్సు.

ముఖపత్రచిత్రరచన :
విశ్వాత్ముల నరసింహమూర్తి.
దళక రామలింగేశ్వరరావు.

ముద్రణము
వావిళ్ల ప్రెస్
చెన్నపురి-21

894.8271
RAJ

ప్రకాశకులు :
వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
490, తిరువొత్తియూర్ హైరోడ్డు,
చాకలపేట, మద్రాసు-21.
1954.

MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
ACC. NO.
B

మొదటికూర్పు :
1000.

మూల్యం :
మూడు రూపాయలు

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి.

విజ్ఞప్తి

పేరునకు శతపత్రసుందరియైనా దీనిలోని పాటల రేకులు రెండువందలకు మించాయి. దాదాపు 17 ఏళ్లనుంచి రచించి పాడుకొంటూవచ్చిన ముక్తకములవంటి ఏకగేయాత్మక ఖండ కావ్యములు, కొన్ని నాటకములలోని ఆయా రసవత్సన్నివేశములలోని గేయములు అన్నీ కలిసి 260 వరకు ఈసంపుటముగా పేర్చి కూర్చాము. లోపలి రసభావవిన్యాసముల ననుసరించి ఈ గేయపురేకులను స్థూలముగా చాలమట్టుకు వసంతపత్రావళీత్యాదిగా వరుసగా ఆరు ఋతువులను సూచించే ఆరుగుత్తులలోనికిని, కొన్ని జాతీయగీతములను, మరికొన్ని నూతనగీతములను నవవసంతపత్రావళి అను ఏడవగుత్తిలోనికిని చేర్చాము. వీనిలో 20 మాత్రము రవీంద్రునిగీతములకును, ఇతర సంస్కృతాంగ్లాదికవులరచనలకు పరిమళమాత్రానువాదములు. మిగిలినవన్నీ స్వతంత్రరచనలే.

ప్రకాశకులు.

৫ ঘন ৫

ওজনের একক হচ্ছে কিলোগ্রাম। কিন্তু ছোট ওজন মাপার জন্য গ্রাম ব্যবহার করা হয়। ১ কিলোগ্রাম = ১০০০ গ্রাম। ওজন মাপার যন্ত্র হচ্ছে দাঁড়িপাল্লা। দাঁড়িপাল্লার একটি দণ্ডের দুই প্রান্তে দুটি পাল্লা থাকে। একটি পাল্লায় বাটখারা বা ওজনের বাটখারা রাখা হয় এবং অন্য পাল্লায় ওজন করার জিনিস রাখা হয়। দণ্ডের মাঝখানে একটি হাতল থাকে। হাতল ধরে দাঁড়িপাল্লা ঝুলিয়ে ওজন করা হয়। দাঁড়িপাল্লার দণ্ডের গায়ে দাগ কাটা থাকে। দাগ দেখে ওজন নির্ণয় করা হয়। ওজন করার সময় দণ্ড যাতে আনুভূমিক থাকে সেদিকে লক্ষ্য রাখতে হয়।

٤٠



పూజ్యులు, పితృపాదులు కవికులాలంకారులు, కవిరాజహంసలు

శ్రీ వేంకటపార్వతీశ్వరకవులకు

భక్తివినయపురస్సరముగా అంకితము

"నా న్నా! మా మ య్యా!"

మా నాన్నా! మా మామయ్యా!
నే విన్నా మీ సన్నిధినే!
కడిచినయుంగముల మహాకవివరుల
కవితారీతుల ఘనతలనూ, ఈ
నవయుగమున కాది ఘనత నందిన
కవిభావుక నవఫణితులను
గంగాయమునాసంగమంబుగా
కలిసికొనిన మీకవనములోనే
నే విన్నా మీసన్నిధినే!
మా నాన్నా! మామయ్యా!!

*

సమితుల చేరని కవితలు చదవక
వలపక్షమ్ముల మనసులతో
నవయుగకర్తలు వా రని వీ రని
ఎవ రే మన్నా ఒకటి నిజం!
ఆ యుంగకర్తల శైశవమందే
మీ యువలేఖిని వ్రాసినకైతలు
కావ్యకుసుమశంఖారావముగా
నవ్యయుగపు వైతాళికరుతిగా
నే విన్నా మీ సన్నిధినే!
మా నాన్నా! మా మామయ్యా!!

*

లేదు నిదురలో లేదు సుగతి యని
చూడు కనువిచ్చి జగతి యని
గోవర్ధన మే మాతృదేశ మని
గోపకులంతా దేశప్రజ యని
దేశనేత గోకులకృష్ణుం డని
దేవేంద్రుండే శ్వేతప్రభు వని
ఏతత్పూజల నేల మాన రని
జాతిని మేల్కొలిపే మీ గీతులు
నే విన్నా మీ సన్నిధినే!
మా నాన్నా! మా మామయ్యా!!

*

తేటగీతముల తెన్నులలో
మేటిసీసముల వన్నెలలో
బహుళవృత్త నవభంగులలో
ఆంధ్రభారతి వెలుంగులలో
ప్రకృతిసౌందర్య యవనికలూ
వికృతివివేక కనీనికలూ
శ్రీసూక్తి నవసుధానిధిలో
భావసంకీర్తనాంబుధిలో
రమణు నేకాంతసేవనము
రమ్య మధుర బృందావనము

*

నే విన్నా మీ సన్నిధినే !
మా నాన్నా ! మా మామయ్యా !!

* * *

బడికి పోకయే పొత్తము పట్టకె
గిరగిర తిరుగుచు వ్రాయగ నేర్చిన
బాలగీతముల బొంగరమట్టుల
బాల్యమునందే మీ యొడులందే
పడుకొని కైతలు విని విని వెంటనె
కాకిమీదనో ఆవుమీదనో
ఆకసమ్ములో అంచలపైనో
నా కేరింతలు, మీ యూరింతలు
నే విన్నా మీ సన్నిధినే !
మా నాన్నా ! మా మామయ్యా !!

٥٥٥
١١١

శ్రీ పింగళి లక్ష్మీకాంతకవిగారు

(ఆశీస్సు)

ఆశీస్సు

"శతపత్ర సుందరీ! ఓహో శతపత్రసుందరీ!"
"మ్రోయింపు జయభేరి
వాయింపుము నగారా!"
"మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్రజాతి!"

ఇత్యాది ఆబాలగోపాలపరిచితములైన కీర్తనలలో ఏదేని ఏ సందర్భముననేని పాడుటకు ఉపక్రమింపబడినప్పుడు "అదిగో రజనీకాంతరావు పాట" అని హర్షవికసితములైన మోములతో శ్రోతృజనము తదేకాయత్తచిత్తమై ఆగేయమును మధురరసమునువలె తనివితీర గ్రోలి, అర్థనిమీలితనేత్ర పారవశ్యసుఖ మనుభవించుట నేను అనేకపర్యాయములు అనేక సభలలో ప్రత్యక్షముగా విలోకించి, నాశిష్యుడు ఆర్జించుకొన్న యశమునకును ఆతనియెడ సమస్తాంధ్రప్రజకు గల అనురంజనమునకును లోలో మురియుచుందును.

రజనీకాంతరావునకు నాగురుత్వమువలన నీమైన కొంత వ్యుత్పత్తియు కొంతసంస్కృతియు కలిగియుండవచ్చునేమో

కాని, కవిత్వముమాత్రము నావలన అలవడినదికాదు. ఆగురుత్వము ఆతని జనకునిది.

శ్రీవేంకటపార్వతీశ్వరకవులు జగమెరిగిన జంటకవులు. ఆ జంటలో శ్రీవేంకటరావుగారు ఇతని తండ్రిగారు. ఈకుమారుడు "బడికిపోయి పొత్తము పట్టని" బాల్యమునందే తండ్రి యొడిలో పరుండి, ఆయన లాలించుచు వినిపించిన కవితాగాన ఫణితులను వినివిని కడుపార పాలుత్రావిన శిశువు త్రేన్చినట్లు "కాకిమీదనో ఆవుమీదనో ఆకసమ్ములో అంచలపైనో" కేరింతలు కొట్టుచు చిటిపొటిపాటలు అల్లుట, ఈ కవితోద్యానమునకు మొదటి అంకురములు.

ఆ యుద్యానలతలు గోముగా నలుదెసల ప్రాకి, పరిమళకుసుమభరితములై, జగదాహ్లాదన మొనర్చునట్లుగా వర్ధిల్లుటకు వలసిన దోహద మంతయు రజనీకాంతరావు స్వయంకృషి వలననే జరిగినది. ఈ తండ్రికొడుకులవిషయముననే కాదు; లోకములో ఇతర గురుశిష్యులవిషయము నందైనను కవితాసంప్రదాయము ఈరీతిగానే ప్రవర్తిల్లును: గురూపదేశము శిష్యునిహృదయమున నిగూఢమై అణగియున్న కవితాబీజమును ఉద్భిన్న మొనర్చు జలకణసేచనము. అంకురించుట మొదలుగా ఆ లతకు నానాదోహదము లొనర్చి, ఏమరుపాటులేని శ్రద్ధతో కాపాడి పుష్పఫలసమృద్ధ మొనర్చుకొనుట శిష్యుని కృషి.

గురువు ఉపదేశదక్షుడు కాడేని శిష్యునిలో బీజ ముండియు అంకురింపదు. శిష్యుడు దోహదకుశలుడు కాడేని మొలకెత్తియు అంకురము వర్ధిల్లదు. ఈ రెండువ్యాపారములును సముచితముగా సంఘటిల్లుట ఈశ్వరానుగ్రహము. అట్టి యీశ్వరానుగ్రహము కలిమి రజనీకాంతరావు నేటికవులలో అందును గేయకవులలో అందును వాగ్గేయకారులలో ఉత్తమస్థానమును డక్కగొనగలిగెను.

మనభాష సహజముగా గేయరచనానుకూల మైనదే యయ్యు కొన్ని కారణములచే మన గేయవాఙ్మయశాఖ పూర్వకాలమున తగిన మన్నన పొందలేదు. ఆ వాఙ్మయనిర్మాతలలో ప్రథమబ్రహ్మ యని పేర్కొనదగిన తాళ్లపాక అన్నమాచార్యుని పేరైనను నిన్నమొన్నటివరకు ఆంధ్రులు వినియెఱుగరు. ఆంధ్రజయదేవు డనదగిన క్షేత్రయ్యపదములు తెనుగుదేశమునుండియు సాహితీక్షేత్రమునుండియు తరిమివేయబడినవి. త్యాగబ్రహ్మనామము విస్మృతముకాకుండుటకు గాయకులు మాత్రమే కారణముగాని సాహితీపరులు కాదు. గేయకవితాపుంభావసరస్వతు లనదగిన పైని పేర్కొన్న ముప్వురి చరిత్రయే ఇటులుండగా తక్కిన చిల్లరమల్లరకీర్తనలు వ్రాసినవారి సంగతి తడవనేల? గేయకవిత్వములో ఒక నిసర్గలోప మున్నది. అది పాటవలనగాక పఠనమువలన వ్యాప్తికి రాదు. పాడగలవారు కొరవడినంతనే పాటవలన వచ్చిన వ్యాప్తియు మరుగుపడిపోవును. కాని గేయములో గానాంశను వదలి కవిత్వాంశను

పరిశీలనజేసి ఆ పదార్థము సుసంపన్నముగా నున్నయెడ సాహితీ విమర్శకులు దానిని వాఙ్మయకక్ష్యకు స్వీకరించుట ధర్మము. ఇది వాఙ్మయచరిత్రకారులయు విమర్శకులయు విధి.

మన ప్రాచీనగేయకవితాశాఖను గూర్చి సవిమర్శ వాఙ్మయచరిత్ర రచింపవలసిన ఆవశ్యకత యెంతేని కలదు. ఆ శాఖలో ప్రబంధకవులకుగూడ వరవడి పెట్టిన భావసంపదయు నుడికారముపొంకమును మెండుకొనియున్నవి.

అట్టి భావసంపన్నతను అట్టి నుడికారపుసొగసులను ప్రదర్శించి ఉత్తమకవులుగా పరిగణింపబడిన గేయరచయితలు ఈనాడును కొందరు కలరు. వారిలో ఈ రజనీకాంతరావు ఒకడు. ఇతడు ఉత్తమశ్రేణికి చెందిన గేయకవి. శాస్త్రీయమైన రాగ తాళ జ్ఞానముతో స్వయముగా పాడనేర్చిన గానకళా నిపుణు డగుటనుబట్టి వాగ్గేయకారు డనిపించుకొనిన విశేష ప్రజ్ఞాశాలి.

పూర్వులు ఒక్కొక్క కీర్తనసంపుటికి శృంగారపదము లనియు, భక్తికీర్తన లనియు, తత్త్వము లనియు, తత్తత్కీర్తన సముదాయములోని గుణప్రాధాన్యమునుబట్టి స్థూలముగా నామనిర్దేశము చేయుచుండెడివారు. ఆ సంప్రదాయమునే పాటించి ఈ 'శతపత్రసుందరి'కి ప్రణయకీర్తన లని నామకరణ మొనర్చుట సముచిత మని నా ఉద్దేశము. ఇందు దేశభక్తి ప్రబోధకములు, దేశమాతృస్తవములు, దేశనాయకప్రశంసలు

మొదలైన రాజకీయకీర్తనలును మరి యితరములును కొన్ని యున్నను తక్కిన అనేకములు వ్యస్తములును నాటికాగీతములునుగూడ ప్రణయభావపూరితము లగుటచేత నేను ఈ సంపుటికి ఆ వ్యపదేశము బాగని తలంచితిని.

ప్రణయము శృంగారముకంటె కొంత భిన్నము. ఆలంకారికసిద్ధాంతమునుబట్టి శృంగారమునకు 'రతి' స్థాయి యగును. ప్రణయమునకు ప్రేమ స్థాయి. దీనిని ప్రేయస్సు అనియు చెప్పవచ్చును.

ఈ "ప్రేమ లేకున్న లోకాన ఏమున్నది?" అని యీ కవి ప్రశ్న. నిజమే ప్రేమలేని ప్రపంచము శూన్యమే నని నా యొప్పుదల. మరియు,

"ప్రేమ నాలో పెరిగి పెద్దదౌతుంటేను
నేను భగవంతునికి చేరువౌతుంటాను"

అని ఇతని స్వానుభవప్రవచనము. (చూ. 3 0 F పుట.) ఇది ఆధ్యాత్మికసత్యములలో ఒకటి. హృదయము ప్రేమావిష్టమైనప్పుడే ఆత్మ భగవంతుని పాదసన్నిధానమున వ్రాలు నని భక్తియోగు లుపదేశించు తత్వము.

ఈ ప్రేయస్సు అనునది శృంగారములో అంతర్భాగమే అని వాదించెడి ఒక ఆలంకారికమతము కలదు. అందు కొంత సత్యము లేకపోలేదు. కాని శృంగార మనగా నాయికానాయక

ఆలంబనసముత్పన్నము మాత్రమే యని అంగీకరింతుమేని ప్రణయము దానికంటె భిన్నమని వెంటనే అంగీకరింపవలెను. ఈ ప్రేయస్సునకు ఆలంబనము నాయికానాయకరూప స్త్రీపురుషులే కా నక్కరలేదు. పరస్పర భావానుబంధముగల యే రెండుజీవులైనను కావచ్చును. ఆత్మయొక్క సర్వగతత్వమును అంగీకరింతుమేని అచేతనములైన ఏ రెండు మూర్తులైనను ఈ ప్రేయస్సునకు ఆలంబనము కావచ్చును.

మబ్బు యువతిగా మలయపవనుడు యువకుడుగా పరస్పరానురాగబద్ధచేతసములై వలపుసొలపుల తీయదనములు కలసి ఆరగింపవచ్చును. ప్రేమికుడౌ చంద్రుడు, ప్రేయసియౌ తారకు చేసన్న చేసి చంద్రనౌకలో ఎక్కించుకొని వెన్నెలవెల్లువలో విహరింపవచ్చును. (చూ. ౧౭౦, ౧౭౩. పుటలు.)

ప్రకృతికి ప్రసవధర్మిణి యనెడి ఇంకొక పేరు గలదు. విశ్వలీల ప్రణయమూలకము అను న్యాయమునుబట్టియే ఆ పేరు సమర్థింపబడును. విశ్వప్రవృత్తి ప్రణయ లీల యగుచో చేతనాచేతనపదార్థజాత మంతయు మాధుర్యప్రవాహమగ్నమే. ఆ దర్శనము లభించిన కవికి 'అంధకారప్రభలు మందువైపులను' 'వల్లకాటిదయ్యాల చెరలాటలోను' అన్నివైపులగూడ ఊరకే మాధురులు ఊరిపోవుచుంటవి. (చూ. పుట. ౨౦.)

సుఖదుఃఖమయమైన ప్రాపంచికజీవితసముద్రమున పొడమెడి అమృతమునేకాక విషమునుగూడ మధురముగానే

భావింపగల జీవికి వేరే యోగసాధనాదుల యక్కర యుండదు. ఈకవి లోకమునకు చేయు ప్రబోధము "ఎల్లెడల మాధురులు గ్రోలుడు" అని. అసలు నే నెరిగినంతవరకు ఇతని చిత్తవృత్తియే మాధురీభరితము, కటుత్వాపారుష్యాదు లిత డెఱుగడు. అట్టి చిత్తమున మొలకెత్తిన మధురభావములే యీ గేయార్థములు.

రజనీకాంతరావు పద్యకవిత్వము వ్రాయలేనికవి కాడు. ఇతడు రచించిన పద్యకవిత్వము ఇందు ప్రకటింపబడకపోయినను బహుళముగా కలదు. ఆ పద్యములలో ఈతని గీతపద్యపునడక ఇతని తండ్రిగారి గీతపద్యమునే అనుసరించి సాగుచుండు నని నా ఊహ. ఇందలి నాందీముఖములోని,

"జగతి రంగస్థలమ్ముగా సకలజీవ
తతులు పాత్రలుగాగ గాథలను గూర్చి
వెలుగునీడల తెరవెన్క నిలుచు నటన
సూత్రధారుండు మమ్ము బ్రోచుత సతమ్ము"

అనెడి గీతపద్యము నాచిన్ననాడు చదివిన వేంకటపార్వతీశ్వరుల గీతపద్యములను జ్ఞప్తికి తెచ్చినది.

ఇట్టి నానాసాధనసామగ్రి గల యీ నా శిష్యుడు ఒక పద్యప్రబంధమునుగూడ రచించి ఆంధ్రుల కర్పించుగాక!

ఇతని కవితాయశము దినదినప్రవర్ధమానమై అజరామరముగా వెలుగొందుగాక.

"పసిడి మెరుంగుల తళతళలు" అనెడి తెలుగుతల్లి గేయము (చూ. ౭.) ఆంధ్ర రాష్ట్రావతరణముహూర్తమున ఆంధ్రమాతకు మన మర్పించు ఆవాహనోపచారమై మన జాతీయగీతముగా స్థిరపడుగాక!

తుది రెండు గేయములలోని మంగళము (చూ. ౩౭౭.) తెలుగుతల్లికి మనము చేయు నిత్యపూజలో నీరాజనోపచార మగుగాక!

మకాం: మద్రాస్
ది. ౨౭-3-౫3.

పింగళి లక్ష్మీకాంతం.

MEMORIAL
V.R NARLA
D.P.R.I.
Acc. No.
V.R. NARLA LIBRARY

XII



ధన్యవాదము - విజయవాడ. 14-12-1953.

ధన్యవాదము

(14-12-53 తేదీన విజయవాడలో జరిగిన
తెలుగుభాషాసమితివారి
బహుమతి ప్రదానోత్సవసమయమున పాడినగేయము.)

నే మాటకారిని గాను సభలను
మరియు నేరనివాడనై,
నా పాటలలే ప్రజకె బహు
మాన మందినవాడనై

నే పాడుదును గళమెత్తి, స్థాయులు
మూడు పైపై హెచ్చుగా
రాగమ్ము తీగలుసాగ, శ్రోతలు
బాగు బాగని మెచ్చుగా!! నేపాడుదును!

కవిరాజహంసగురుప్రసాదము
కవనమై ఫలియించగా,
ఆకాశవాణీసేవలో నా
గానధోరణి మించగా! నేపాడుదును!

శతపత్ర సుందర కావ్యకన్యక
సమితిమున్నన లందగా,
సహజన్మి మాన్యుల సత్కృతుల సహ
సన్నుతుల నే పొందగా!! నేపాడుదును!

స్వాతంత్ర్యవిభవామోదమోహిత
తల్లి భారతి పొంగులో,
అభ్యుదిత రాష్ట్రానందవర్ధిత
అమ్మ ఆంధ్రివెలుంగులో!! నేపాడుదును!

సన్మానములు సద్యత్నముల ప్రో
త్సాహకములని తెలియగా
ఉత్సవసమాగత జనశుభాశీ
రక్షయాక్షత లొలయగా!! నేపాడుదును!

నే పాడుదును గళమెత్తి స్థాయులు
మూడు పైపై హెచ్చగా,
రాగమ్ము తీగలుసాగ, శ్రోతలు
బాగుబాగని మెచ్చగా!! నేపాడుదును!!

విషయసూచిక

వసంతపత్రావళి

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౧ ఉగాది	...	ఆలయమున ౧౯౩౭	3
౨ నాందీముఖము	...	జీవితమ్మను ౧౯౩౬	4
౩ నాదేవుఁడు	...	నాదేవుని ౧౯౩౬	5
౪ తెలుగుతల్లీ	...	పసిడిమెఱుంగుల ౧౯౩౯	7
౫ శతపత్రసుందరి	...	శతపత్రసుందరి ౧౯౪౧	9
౬ విశ్వవీణ	...	విశ్వవీణారవ ౧౯౩౭	11
౭ కోయిలా	...	పాడవేకోయిలా ౧౯౩౮	13
౮ చిన్నిపూవు	...	చేరొనవె ౧౯౩౮	15
౯ మధుపాయి	...	మధుపాయి ౧౯౩౮	17
౧౦ మాధురులు	...	ఊరకేమాధురులు ౧౯౩౮	20
౧౧ ఒక్కపువ్వే	...	ఒక్కపువ్వెటు ౧౯౩౮	23
౧౨ చండీదాసుప్రేమగీతి	...	అతిదీనకామిని ౧౯౩౮	26
౧౩. కన్నెకాకిబావ	...	కాకిచూపుల ౧౯౩౮	28
౧౪ ప్రధానం	...	ఎన్నితీయనికలలు ౧౯౩౮	30
౧౫ మనప్రేమ	...	మనప్రేమ ౧౯౩౮	32
౧౬ వలపులో	...	వలపులో ౧౯౩౮	34

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౧౭ వసంతోత్సవము	...	పులుగు నెచ్చెలులార ౧౯౪౧	35
౧౮ మధువనస్వప్నగీతం	...	మధువనీలతాంత ౧౯౪౪	37
౧౯ మలయానిలుడు ౧	...	రావోయీ ౧౯౪౪	,,
౨౦ మలయానిలుఁడు ౨	...	ఏతెంచెనదె ౧౯౪౪	38
౨౧ మరులుమాతంగి ౧	...	చరచరచర ౧౯౪౪	38
౨౨ ,, ,, ౨	...	మరులుమాతంగిపూదేనె ౧౯౪౪	39
౨౩ జోల	...	జోజో జోజో ౧౯౪౪	,,
౨౪ మాయాజాలం	...	రేగనీ ౧౯౪౪	40
౨౫ మధువనస్వప్నసీమ	...	,, ౧౯౪౪	,,
౨౬ వెలుగు	...	వెలుగు ౧౯౪౫	41
౨౭ పెళ్లికాకముందు	...	ఏమని ౧౯౪౭	42
౨౮ పెళ్లయాక	...	చిన్ననాటి ౧౯౪౭	43
౨౯ ఇంట ఊయల	...	ఊయలఊపనా ౧౯౪౭	44
౩౦ ఆరుఋతువులఊయెల	...	జీవితమయ్యాలగా ౧౯౪౭	45
౩౧ పూలచెండు	...	అందుకోండి ౧౯౪౧	48
౩౨ మేలుకొలుపు	...	మేలుకొలిపెగా ౧౯౫౧	49
౩౩ మలయానిలుడు-దిరిసెన	...	ఓ మలయపవనమా ౧౯౫౧	50
౩౪ స్వభాను	...	రావేరావే ౧౯౪౩	52
౩౫ మధుఋతువు	...	వెలసెనహో ౧౯౪౫	53
౩౬ చెల్లికి	...	మెరసె మెరసె ౧౯౩౮	54
౩౭ వసంతము	...	జగతికి వసంతమా ౧౯౪౮	55

గ్రీష్మ పత్రావళి

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౩౮ అందవు	...	అందవు అందవు ౧౯౪౦	59
౩౯ గతాగతం	...	చూచిన కొలంది ౧౯౪౧	60
౪౦ వికృతహాసం	...	హృదిపొంగే ౧౯౪౧	61
౪౧ కజేల్	...	హాయిలో ౧౯౪౫	62
౪౨ విరహిణి	...	విరహానలంపుబాధ ౧౯౩౯	63

గ్రీష్మనాటికాగీతాలు

౪౩ స్వాగతము	...	సంధ్యారుణిమా ౧౯౪౮	64
౪౪ గ్రీష్మజృంభణము ౧	...	నడిమింట ౧౯౪౧	65
౪౫ " " ౨	...	ఈరేడుజగాలు ౧౯౪౧	"
౪౬ " " ౩	...	ఎండకారు ౧౯౪౧	66
౪౭ తోటమాలి ౧	...	తోటమాలీ ౧౯౪౧	67
౪౮ " ౨	...	ఓసారిలెమ్ము ౧౯౪౧	68
౪౯ " ౩	...	తోటమాలిజోలి ౧౯౪౧	69
౫౦ చలిపందిరి	...	విరిచెలువలార ౧౯౪౧	70
౫౧ వీడోర్కులు	...	తీయమావిచివుళ్ల ౧౯౪౧	72
౫౨ ఆశాగీత	...	కనవో ౧౯౪౧	74
౫౩ గ్రీష్మసంధ్య	...	మెరసినవి వినువీథి ౧౯౪౧	75
౫౪ యక్షుని గ్రీష్మము	...	నీకుమాత్రము ౧౯౪౧	76
౫౫ ఏలో ఏలేలే	...	ఏలో కోయిల ౧౯౫౦	77

వర్షపత్రావళి

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౧౬ కొత్తపొంగు	...	మొయిలు నడకల ౧౯౩౯	81
౧౭ శుక్తివిరహము	...	ఈవిదాహమెటు ౧౯౪౨	84
౧౮ శుక్తిముక్తాఫలము	...	మెరపుతీవలవిగో ౧౯౪౨	86
౧౯ నెమలి	...	ఆడుతోంది నెమలి ౧౯౪౨	87
౨౦ హరివిల్లు	...	అదిగోలేచెను ౧౯౪౨	88
౨౧ చినుకుపాట	...	చినుకు కన్నియల ,,	90
౨౨ శ్రావణలక్ష్మి	...	శ్రావణలక్ష్మి ,,	91
౨౩ ములగసిర	...	వొచ్చిందా తిరిగి ,,	93
౨౪ చాతకీ	...	నీదుపాటవిందుర్ ,,	94
౨౫ వానకోయిల	...	చిటపట ,,	95
౨౬ మయూరీ	...	నటనమాడవే ౧౯౫౨	96
౨౭ ఇంద్రధనుస్సు	...	నింగి నేలకు ౧౯౫౦	98
౨౮ అభిసారిక	...	గాలివానరేయి ౧౯౪౨	99
౨౯ జలదాగమనం	...	మురళీధరుని ౧౯౪౧	100
౩౦ మేఘమా	...	మేఘమా ౧౯౪౨	102
౩౧ దిగకోయీ	...	మెరిసేమబ్బుల ౧౯౪౧	103
౩౨ ఉజ్జయిని పిలుపు	...	రమ్మోయిజలధరా ౧౯౪౧	104
౩౩ అలకానగరి	...	ప్రణయజీవనపు ౧౯౪౧	105
౩౪ మేఘరంజని ౧	...	ఘనాఘనా ౧౯౪౫	107
౩౫ ... ౨	...	హృదయాంభోధరా ౧౯౪౮	109
౩౬ వరలక్ష్మి	...	స్వాగతమమ్మా ౧౯౪౪	110
౩౭ వొల	...	యెయ్యరా వొల ౧౯౪౨	111

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౭౮ అభిసరణ	...	సఖునిగాంతునే	౧౯౪౬ 112
౭౯ కృష్ణజననము	...	భువనసేత	౧౯౪౫ 113
౮౦ అవతారము	...	అలవైకుంఠపురం	౧౯౫౧ 115

దివ్యజ్యోతి నాటకగీతాలు

౮౧ వైతాళికగీతులు	...	మేలుకో	౧౯౪౦ 119
౮౨ మాయాదేవిస్వప్నం ౧	...	నిద్రాముద్రితవు	" 120
౮౩ " " ౨	...	విహరింపవె	" "
౮౪ " " ౩	...	చైత్రజీవ	" 122
౮౫ " " ౪	...	మెరయుదిశాముఖ	" 123
౮౬ గౌతమబుద్ధునిజననం	...	ప్రమదావని	" 124
౮౭ అసితముని ఆవేదన	...	అసదృశతేజోవర్తి	" 126
౮౮ ఏనాడో యేనాడో	...	ఈనాడెకాదు	" 127
౮౯ స్వయంవరం	...	కామదేవు కొలువు	" 128
౯౦ సోమరి పాట	...	అమనిపొంగులో	" 129
౯౧ భ్రమరప్రబోధం	...	భ్రమరా భ్రమరా	" 131
౯౨ చితిజ్వాల	...	రగిలిమండెను	౧౯౪౧ 133
౯౩ ఉజ్జ్వలప్రభాతము	...	అమలహృదయ	" 134
౯౪ ప్రస్థానము	...	ఈయిరులు	" 135
౯౫ వియోగిని	...	హృదయేశ్వరుడు	" 137
౯౬ వైతాళికగీతి	...	పాలపుంత	" 138
౯౭ విరాగగీతము ౧	...	శ్రుతులు సమముగా	" 139
౯౮ విరాగగీతము ౨	...	గడ్డిపువ్వుసుఖము	" 140

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౯౯ బోధిమహీజము	...	ఆశాంతర	౧౯౪౧ 141
౧౦౦ ఒక్కడవే	...	ఒకరయినా	౧౯౪౨ 142

శరత్పత్రావళి

౧౦౧ పరిక్రమణ	...	చల్లగాలిలో	౧౯౪౧ 147
౧౦౨ విభావరి	...	ఓ విభావరి	౧౯౪౨ 148
౧౦౩ నళిని - పవనుడు	...	కుంజవని	౧౯౪౨ 149
౧౦౪ శరద్గీతి	...	పసిడిమబ్బుల	౧౯౪౨ 150
౧౦౫ సంధ్యాదీపకళిక	...	స్వామినీయాలయమున	౧౯౪౧ 151
౧౦౬ స్వప్నజగతి	...	స్వప్నజగతిలో	౧౯౫౧ 153
౧౦౭ జాజి - తుమ్మెద	...	చల్లగాలిలో పూల —తోటలో	౧౯౪౨ 154

శతపత్రసుందరినాటికాగేయాలు

౧౦౮ ఆశ్వసనము	...	శతపత్రసుందరీ	౧౯౪౨ 155
౧౦౯ అస్తమయము	...	ఇనుడుకొండదిగెనా	౯౦౪౨ 156
౧౧౦ కీచురాలు	...	హాయి హాయి	౧౯౪౨ 157
౧౧౧ విరహిణి	...	తిరిగి తిరిగి తిరిగి	౧౯౪౨ 158
౧౧౨ చంద్రోదయము	...	జాబిల్లివస్తున్నాడు	౧౯౪౨ 159
౧౧౩ జోల	...	జోజో సఖి	౧౯౪౨ 160
౧౧౪ స్వప్నలోకము	...	స్వప్నలోకము	౧౯౪౨ 161
౧౧౫ గగనయానము	...	సరసిఁడిచి	౧౯౪౨ 162
౧౧౬ మేలుకొనవె	...	మేలుకొనవెశతపత్రా	౧౯౪౨ 163

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౧౧౭ రొద	...	రొదసేయకె ౧౯౪౨	164
౧౧౮ కొండకోన	...	కొండకోనలో „	165
౧౧౯ సెలయేరు	...	రా సెలయేరా „	166
౧౨౦ ప్రతిశ్రుతి	...	ఓహో ప్రతిశ్రుతీ „	167
౧౨౧ బృందావనము	...	కోపమేలరాధా ౧౯౪౧	168
౧౨౨ వెన్నెలరేయి	...	కన్నులకింపా ౧౯౪౧	170
౧౨౩ మబ్బుకన్నె— మలయానిలుడు	...	మలయపవన ౧౯౪౧	173
౧౨౪ దినాంతము	...	దినాంతమ్ము ౧౯౪౨	176
౧౨౫ అన్వేషణ	...	యమునాతీర ౧౯౪౨	177
౧౨౬ మనమిద్దరమే	...	ఇద్దరమే ౧౯౫౧	178
౧౨౭ ఎందుకో	...	ఎందుకో వున్నమ ౧౯౪౪	180
౧౨౮ మెట్లవరుసలు	...	మెట్లవరుసలు ౧౯౪౪	182
౧౨౯ జ్వాలాతోరణం	...	జ్వాలాతోరణం ౧౯౪౩	183
౧౩౦ దిబ్బాదిబ్బా	...	దిబ్బా దిబ్బా ౧౯౪౩	183
౧౩౧ కనుడదే	...	కనుడదే ౧౯౪౩	„
౧౩౨ జైత్రయాత్ర	...	కేలకేలగోగు ౧౯౪౩	185
౧౩౩ ప్రతిజ్ఞ	...	ప్రతిహస్తము ౧౯౫౧	187
౧౩౩ దీపావళి	...	ఇంటింటి ముంగిటా ౧౯౫౧	188

అవంతిసుందరి నాటికాగేయాలు

౧౩౫ మన్మథోత్సవం	...	అంజలిదే ౧౯౪౫	189
౧౩౬ రాజహంసమా	...	రావో రాజహంసమా ౧౯౪౫	190
౧౩౭ ఇంద్రజాలము ౧	...	రావోయివైనతేయా ౧౯౪౫	191
౧౩౮ ఇంద్రజాలము ౨	...	దిగుదిగుమహేంద్రజాలీ ౧౯౪౫	„

కడలిదరి పాటలు

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౧౩౯ రమ్యాణిపీక్ష్య	...	స్మరియింతురుగా ౧౯౫౫	192
౧౪౦ తొలిపిలుపు	...	ఎవరుపిలిచినారో ౧౯౫౧	193
౧౪౧ ప్రియోక్తి	...	సడలనీకు ౧౯౫౧	194
౧౪౨ చెలివలపు	...	తీయతీయగా ౧౯౫౧	195
౧౪౩ చెలిసాగసు, వలపు	...	తెలియునా ౧౯౫౧	196
౧౪౪ వాగ్భంగము	...	ఇటులౌనని ౧౯౫౧	197
౧౪౫ కావేరి	...	కావేరి ఓ కావేరి ౧౯౫౧	198

మాళవిక పాటలు

౧౪౬ సుమసౌరభము	...	ఈసుమసౌరభము ౧౯౫౬	200
౧౪౭ ఏకాంత జీవిక	...	ఎదగాయపడి ౧౯౩౮	201
౧౪౮ నాట్యపరీక్ష	...	నర్తించునవె ౧౯౫౬	202
౧౪౯ ఎందుకో	...	ఎందుకోహృదయమా ౧౯౫౬	203
౧౫౦ లాక్షాచిత్రణ	...	కదలకుమా ౧౯౫౬	204
౧౫౧ దోహదము	...	పరపుము ౧౯౫౬	205
౧౫౨ ఎడబాపు	...	మనోరమణుడె ౧౯౫౬	206
౧౫౩ అశోకదోహదము	...	ఎత్తైనదే మాళవిక ౧౯౫౬	207
౧౫౪ కుసుమితాశోకము	...	విరహాశిశిరమరిగె ౧౯౫౬	208
౧౫౫ ఓ శశీ	...	ఓ శశీ ౧౯౫౬	209
౧౫౬ కలువా	...	కలువా ౧౯౫౬	210
౧౫౭ ఆనందప్రకృతి	...	ఆకుపచ్చని ఆకు ౧౯౫౫	211
౧౫౮ స్వేచ్ఛ	...	పాటతెలిసిన ౧౯౫౧	212
౧౫౯ శరదభిసారిక	...	మధువనికానరావో ౧౯౫౧	214

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౧౬౦ హృదయనావ	...	చిన్నదోయీ ౧౯౪౧	216
౧౬౧ గులాబి	...	సంజనీరెండ ౧౯౪౬	217
౧౬౨ చిత్రార్జునులు	...	ఎవరో నీవెవరో ౧౯౪౪	218
౧౬౩ పరిష్వంగము	...	హాయిగ నాడుదుదా ౧౯౪౧	219
౧౬౪ నిదురపో	...	నిదురపో ౧౯౫౧	220
౧౬౫ మెల్లమెల్లగా	...	మెల్లమెల్లగా ౧౯౫౧	221
౧౬౬ మధురయామిని	...	మధురయామిని ౧౯౪౪	222
హేమంతపత్రావళి			
౧౬౭ చలికారు	...	చలికారు కౌగిలించె ౧౯౪౭	225
విషవృక్షగీతాలు			
౧౬౮ హరిదాసికీర్తన	...	తన అధరసీమపై ౧౯౫౨	226
౧౯౯ జూదరివేదాంతము ౧	...	వేరేజూదమెందుకు ,,	223
౧౭౦ జూదరివేదాంతము ౨	...	చూపుదూరమెందుకు ౧౯౫౨	230
౧౭౧ కాలసర్పి	...	ఆడుదంటే ౧౯౫౨	232
ఉమర్ ఖైయామ్ పాటలు			
౧౭౨ అనుభవ భావము	...	ఎన్నో ఎన్నో ఫలాల్ ౧౯౪౬	233
౧౭౩ ఖైయాముతత్వం	...	ఖైయాముతో కలసి ,,	235
౧౭౪ హేమంతగానము	...	మట్టిబొమ్మలను ,,	236
౧౭౫ కారవాన్	...	సాకియా నే సాకీ ,,	237
౧౭౬ కలలబేహారి ౧	...	కలలూబేహారీ ,,	239
౧౭౭ ,, ౨	...	కలలు కొంటూ ,,	240
౧౭౮ మధుమాయ	...	మోరియామే మధురురళి ౧౯౪౨	242

V. R. NARLA MEMORIAL LIBRARY
NARLA
P.R.R.I.
Acc. No.

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౧౭౯ మంచుతెరల ఆసలు	...	నునుమంచుసోనలో ౧౯౪౯	243
౧౮౦ లోకాలోకం	...	ఏలోకానికి ఆలోకం ౧౯౪౮	244
౧౮౧ ప్రబోధం	...	మేలుకొనవో ౧౯౪౩	246
౧౮౨ నవోదయాశ	...	నవోదయమెపుడో ౧౯౪౩	248
౧౮౩ శాంతిశోధ	...	నడవనిచోటెల్ల ౧౯౪౧	250
౧౮౪ అన్వేషణ	...	దారిచూపువాడె ౧౯౪౩	257
౧౮౫ ఊరడింపు	...	ఊరడిలవె నళిని ౧౯౪౩	253
౧౮౬ దిగు దిగు	...	దిగుదిగునాగా ౧౯౫౦	254
౧౮౭ హింసాయ్ ఉన్మత్త	...	ధరాతలము ౧౯౪౮	256
౧౮౮ అమరగాయకుడు	...	వృథా వ్యథిత ౧౯౪౧	259
౧౮౯ స్మృతిసీమల్లో సైగల్	...	గేయకారులెవరైనా ౧౯౪౭	261
౧౯౦ భగ్నప్రతిమ	...	ఎచట ఎచట ౧౯౪౭	265
౧౯౧ యశోధర వ్యాకులత	...	ఉషస్సులశాక్యపురి ౧౯౪౭	267
౧౯౨ పురప్రవేశము	...	నేడే వచ్చు ౧౯౪౭	268
౧౯౩ మాంచాలాబాలచంద్రులు ౧		ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు	,, 269
౧౯౪ ,, ,, ౨		ఎదలో కదలు	,, ,,
౧౯౫ రుచిదేవి	...	కృష్ణ నృపతి ౧౯౪౩	271
౧౯౬ ధరిత్రీమాత	...	ఓర్మితాల్తుల ౧౯౪౧	273
౧౯౭ రావమ్మ	...	రావమ్మ మా తెలుగుతల్లీ ౧౯౫౧	276

శిశిరపత్రావళి

౧౯౮ తృష్ణ	...	కొండవాలులో ౧౯౪౧	279
౧౯౯ నావికా	...	ఏ తీరమనిచేరెదో ౧౯౪౯	281

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౨౦౦ పోయినస్వర్గము	...	పోయినది ౧౯౩౮	283
౨౦౧ రిక్కపాటు	...	విస్తృతాకాశ ౧౯౩౭	286
౨౦౨ కలకోసం	...	నేనే ఆశాలేశం ౧౯౪౧	288
౨౦౩ రతీవిలాపం	...	హే ప్రాణపతీ ౧౯౪౧	289
౨౦౪ చెలిమికతలు	...	మరపుతెరల ౧౯౩౮	290

దేవదాస్ నాటికాగీతాలు

౨౦౫ భగ్నహృది	...	ఎవరోహో ౧౯౪౦	291
౨౦౬ జానపదం	...	సేతులార ౧౯౪౦	292
౨౦౭ నృత్యగీతి	...	సఖీ సఖీ ౧౯౪౦	293
౨౦౮ పదవోయి	...	పదవోయి ౧౯౪౦	294
౨౦౯ దప్పి	...	నీటితో ఆరేది ౧౯౪౦	295
౨౧౦ మరునిముసము	...	మరునిముసము ౧౯౪౦	296
౨౧౧ జీవితము	...	జీవితము దుఃఖ ౧౯౪౦	297
౨౧౨ ఏలరాడు	...	నీలమేఘశ్యాము ౧౯౪౦	298
౨౧౩ చరమగీతి	...	మృత్యువెల్లెత్తి ౧౯౪౦	299

బేహులనాటికాగీతాలు

౨౧౪ బృందగానము	...	శంకరపద ౧౯౪౪	300
౨౧౫ యుగళగీతి	...	ఇటుతిరుగవో ౧౯౪౪	301
౨౧౬ కాలనాగినీ	...	రావే కాలనాగినీ ౧౯౪౪	302
౨౧౭ వియోగగీతి	...	వినవోచనా ౧౯౪౪	303
౨౧౮ నృత్యగీతి	...	విన్తింతునే ౧౯౪౪	304

లైలామజ్నూన్ గీతాలు

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౨౧౯ నిశ్చలప్రేమ	...	కఠినమోయి ౧౯౪౬	305
౨౨౦ మహల్	...	మామహల్ ,,	306
౨౨౧ పూలబిచ్చం	...	మంచుతెరలో ,,	307
౨౨౨ ప్రేమ తప్పా	...	ప్రేమయే అపరాధమా	309
౨౨౩ లైలా వీడ్కోలు	...	సెలవింక సెలవూ ,,	311
౨౨౪ మజ్నూన్ విలాపము	...	గుడారమెత్తివేశారు	312
౨౨౫ బృందగీతి	...	పదిలమోహో ,,	313
౨౨౬ లైలా విశ్వరూపము	...	ఎందుచూచిన ,,	314
౨౨౭ తుదిపాట	...	ఎవ్వనికలియగోరుదువో	315
౨౨౮ సతీపరాభవం	...	రుద్రదేవా ౧౯౪౨	316
౨౨౯ అన్నపూర్ణ	...	అన్నపూర్ణా ౧౯౪౨	317
౨౩౦ హింసామత్త	...	హింసామత్తపృథివీ ౧౯౪౨	319

ధర్మచక్రనాటక గీతాలు

౨౩౧ ధర్మచక్రావేదన	...	ఆర్తయయ్యెనే ౧౯౪౭	321
౨౩౨ రాజ్యశ్రీశోకగీతి	...	జ్వాలాకీలలోరాలి ౧౯౪౭	324
౨౩౩ ప్రబోధగీతి	...	మూతపడిన ౧౯౪౭	325
౨౩౪ పాపీ	...	పాపీ ఓహో పాపీ ౧౯౪౭	326
౨౩౫ ధర్మ చక్రము	...	సాగునదే, ౧౯౪౭	328
౨౩౬ గీతాంజలి	...	ఓయిమహాత్యాగీ ౧౯౪౮	329

గేయము.		తొలిపంక్తి - రచనాశాలము.	పుట.
౨౩౭ జోత	...	ఇదెజోతా ౧౯౪౮	331
౨౩౮ పుజాశిరీషములు	...	పూజాశిరీషములు ౧౯౪౯	333
౨౩౯ పృథ్వీ ప్రశంస	...	పృథులక్ష్మశాలినీ ౧౯౫౧	335
౨౪౦ లలితాస్తుతి	...	మాహేశ్వరీ మహాకాళీ ౧౯౫౨	336

నవవసంతపత్రావళి

౨౪౧ మహోదయం	...	మహోదయమాయె ౧౯౫౩	341
౨౪౨ స్వాతంత్ర్యస్వప్నం	...	విధురహేమంత ౧౯౫౪	343
౨౪౩ స్వతంత్రభేరి	...	మ్రోయింపుజయభేరి ౧౯౫౫	346
౨౪౪ బౌద్ధభారతవసంతము	...	నవవసంతము ౧౯౫౬	348
౨౪౫ వాగమృతద	...	అగణితశుభ ౧౯౫౩	350
౨౪౬ 'ద్వారం'వారికి ఆశీసుమగీలి		నీ యాశీ సుమరాశి ౧౯౫౪	351
౨౪౭ యుగకర్తా	...	కందుకూరి వీరేశలింగం ౧౯౫౬	353
౨౪౮ మాతృభూమి	...	హేభువనమనో మోహినీ ౧౯౫౩	357
౨౪౯ సరోజిని	...	అందుకొనుమ ౧౯౫౪	358
౨౫౦ అంజలి	...	అంజలిదే ౧౯౫౪	360
౨౫౧ శాంతిదూత	...	జయజయ ౧౯౫౦	362
౨౫౨ సర్వోదయం	...	ఓ బాపూ ,,	363
౨౫౩ ఉగాది	...	స్వతంత్రభారత ౧౯౫౬	365
౨౫౪ స్వాతంత్ర్యఘంట	...	స్వాతంత్ర్యశుభోదయం ౧౯౫౪	367

గేయము.		తొలిపంక్తి - రచనాకాలము.	పుట.
౨౫౫ నవభారతసందేశము	...	అహోనవప్రభాతము ౧౯౪౮	370
౨౫౬ స్వతంత్రదేశము	...	మాదీస్వతంత్రదేశం ౧౯౪౮	371
౨౫౭ ప్రబోధము	...	జైహిందని ౧౯౫౦	373
౨౫౮ అభినందనము	...	అభినందన చందన ౧౯౪౮	375
౨౫౯ తెలుగుతల్లి	...	తెలుగుతల్లీయశః కల్పవల్లీ ౧౯౪౬	376
౨౬౦ మంగళం	...	మంగళమ్మమ్మ ఆంధ్రావనీ ౧౯౪౩	377

వసంతపత్రావళి

ఇదే త్రిదేవుండదే

2

ఉగాది

ఆలయమున వినబడు నదిగో!
ఆకసమున కనబడు నదిగో!
నవవర్షపు ఘంటానినదం
నవ్యాశాజ్యోతి!
ప్రాతయేటి పెను తమస్సులు
పాపకలితములు మనస్సులు
పటాపంచలే!
క్షుభితహృదయములపై విరిసి
విభునికరుణ జడులై కురిసె
నవవసంతమై!
శుభోదయోత్సవసమయమున
ప్రభూ యనుచు మధురరవమున
కీర్తించుదమా!

నాందీముఖం

జీవితమను పాలకడలిని
తేలు నమృతవిషాలు క్రోలుచు
పాటగాపాడుదురు కవు లిల
యందె స్వర్గము నిల్పగా!

జీవితమ్మను పాలకడలిని
తరచి తేట గ్రహించి సిద్ధాం
తములు గూర్తురు తత్వవిదు లిల
యందె స్వర్గము నిల్పగా!

జగతి రంగస్థలమ్ముగా సకలజీవ
తతులు పాత్రలుగాఁగ గాథలనుగూర్చి
వెలుగునీడల తెరవెన్క నిలుచు నటన
సూత్రధారుండు మమ్ము బ్రోచుత సతమ్ము!

నాదేవుడు

(వచనగీతం)

నాదేవుని గనులతో వనులతో నిండిన
కొండగాజేసికొని కొలుచుకొనవలె నని నాకోరిక !
కాని నాదేవుడు పాషాణమాత్రుడేనా ?

నాదేవుని పూలతో ఆకులతో కాయలతో నిండిన
చెట్టుగాజేసికొని సేవించుకొనవలె నని నాయభిలాష !
కాని నాదేవుడు పాదపమాత్రుడేనా ?

నాదేవునికి ఱెక్కను ముక్కును పెట్టి
పక్షిగాజేసికొని పలికించుకొనవలె నని నాయూహ !
కాని నాదేవుడు ఖగమాత్రుడేనా ?

నాదేవునికి జూలును గీలును పెట్టి
హర్యక్షముగాజేసికొని ఆరాధించుకొనవలె నని నాయాస!
కాని నాదేవుడు మృగమాత్రుడేనా ?

నాదేవునికి కాళ్లు, వ్రేళ్లు, తోకయు గీకయు పెట్టి
కోతిగాజేసికొని వినోదింత మని నాతలంపు !

కాని నాదేవుడు వానరమాత్రుడేనా ?
నాదేవునికి ముక్కూ మొగమూ పెట్టి విద్యాబుద్ధి యిచ్చి
మనుష్యునిగా జేసికొని చీనిచీనాంబరాలతో
స్వర్ణాలంకారాలతో మణికిరీటంతో
అలంకరించి అర్చించుకొనవలె నని నా అపేక్ష !
కాని నాదేవుడు నరమాత్రుడేనా ?
నాదేవుని పురుషు డని పూజింతునా ? స్త్రీ యని సేవింతునా?
సూర్యు డని చూచికొందునా? చంద్రు డని సంతోషింతునా?
నాదేవుడు నీరా ? నిప్పా ? గాలియా ? గగనమా ?

అన్నిటను అడగియున్న నాదేవుని,
అన్నిటను నిండియున్న నాదేవుని,
అన్నిపక్షములను వహించిన నాదేవుని,
అన్నిటను తిరుగాడుచున్న నాదేవుని,
అన్నిచేష్టలు చేయుచున్న నాదేవుని,
అన్నివేషములు వేయుచున్న నాదేవుని,
అన్నిటికిని అధిదేవతయైన నాదేవుని,
అన్నిటికిని అతీతుడైన నాదేవుని,
నే నేవిధంగా ఆరాధించుకొందునో !

తెలుగు తల్లీ!

పసిడి మెఱుంగుల తళతళలు
పసిమి వెలుంగుల మిలమిలలు
గౌతమి కృష్ణల గలగలలు
గుడి జేగంటల గణగణలు

మెఱసి, మొరసి మించిన శుభసమయము తల్లీ!
తరళ యశోవతి! అనుపమితరాగవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగుతల్లీ!

కవిపికముల సల్లాపములు
గాయక బర్హ్యాలాపములు
లాస్యత్తగ విన్యాసములు
భాస్వత్పటహ నినాదములు

విరిసి, మ్రోగి, పఱచిన శుభసమయము తల్లీ!
సరళోక్తి మధురసవతీ! కోమలవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగుతల్లీ!

హాలికజన కలహాసములు
శ్రామికజన మధుహాసములు
దాస్యవిముక్త నివాసములు
స్వతంత్రప్రభావికాసములు

ఒలసి, మెలసి, చెలగిన శుభసమయము తల్లీ!
చరణార్పిత కోటిత్రయహృత్సుమవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగు తల్లీ!

శతపత్రసుందరి

శతపత్రసుందరీ, ఓహో శతపత్రసుందరీ !

సురభిళ భ్రాంతిలో

సుందర

నయనదళకాంతిలో

ఈ ఉదయ సాంధ్యవేళ మెరసెలే

ఈ ఉదయ సాంధ్యవేళ

నాహృదయభావ వేల విరిసెలే

నాహృదయ భావవేల

ఓ శతపత్రసుందరీ, ఓహో శతపత్రసుందరీ !

అరుణదరహాసమో

చందన

మరున్నిశ్వాసమో

నీమృదులదళశతమ్ము తెరచెలే

నీమృదులదళశతమ్ము !

నీహృదిని మధురసమ్ము పరచెలె

నీహృదిని మధురసమ్ము

శతపత్రసుందరీ, ఓహో శతపత్రసుందరీ !

అనంగవాద్యములో

యౌవన

తరంగలాస్యములో

నీమధువు మధుకరాళి మరగెలే

నీమధువు మధుకరాళి !

నీవలపు లినకరాళి కరగెలే

నీవలపు లినకరాళి !

ఓ శతపత్రసుందరీ, ఓహో శతపత్రసుందరీ!

విశ్వవీణ

విశ్వవీణారవ విస్తృతమాధురులు
వినువీథుల ప్రసరించెన్ !
విశ్వజీవజాల మ్మావేళను
విమోహిత మ్మనిపించెన్ !

స్థలమున జలమున సమీరణమ్మున
అనలాకాశము లందే
సదా ధ్వనించుచుఁ గదలుచు ప్రాకెను
విశ్వవీణామధురవము !

నిభృతాకాశగభీరమద్దళపు
నీలిచర్మ మదె పల్లవించెను !
వారిదఘోషను భైరవితానము !
వాతోన్మాదారభటినసావరి !

అంధకార భీకరరాత్రమ్మున
నవ్యభంగిమంబుల నర్తించుచు

అదిగో! ఉన్మాదిని! సౌదామిని ! !

... ...

విశ్వమోహిని! విశ్వనటి! దేవి !
విలయంకరి! అదిగో !
విపరీతావేశ నృత్తములతో
వికృతయై ప్రకృతి వెనుక నటింపగ
విపంచీ గలితగీత పరంపర
వెఱ్ఱిగా అభినయించుచున్నదో !

... ...

అనంతమగు నావీణారవమున
అఖండమగు నామృదంగజవమున
నవ్యరుచుల వర్ణము లుదయించెను
నవ్యగతుల తాళము లలరించెను !
నవ్యాశలు వికసనము చెందెను
నవ్యతేజమూ నవనవసృష్టి
నవోత్సాహ ముద్భవ మందెడినదె !

రవీంద్రకవి వాణిని అనుసరించి.

కోయిలా!

పాడవే కోయిలా
పంచమస్వర మెత్తి
పాడవే కోయిలా!

బయల పచ్చని మ్రాకు
పాటాలకించేని!
చలన రహిత నదాన
శశియు తిలకించేని!
పాడవే పాడు
మవ్యక్తమధురరవాన
పాడవే!!

రిక్కలనె మైకాన
చొక్కించు నీపాట
రేయి హృదయము వెడలి
హాయిగా జాలిగా
చేల గట్టులు దాటి

చిని చిన్ని తెరలుగా
పాడవే కోయిలా

నాకలల పూదేని
త్రాగు తేటివి కాదో
నాకవీథుల జనుచు
నన వలపులను గొనుచు
ఆకలిగ నిప్పువలె
అంతలో మంచువలె
పాడవే కోయిలా!

పంచమస్వర మెత్తి
పాడవే కోయిలా!

చిన్నిపూవు

చేకొనవె చేకొనవె
చిన్నిపూవో నాథ!
కన్ను విప్పేవేళ
వన్నె లొప్పేవేళ
వలపులో తలపులో
వచ్చి దరిసెన మిచ్చి
చేకొనవె!

కమ్మపుప్పొడి చింద
కనువిందు కాదేమొ
పసిమి చిందకమున్నె
మిసిమి కందకమున్నె
చేకొనవె!

తావి బరువగునేమొ
తళుకు కరువగునేమొ,

మరులు గ్రమ్మకమున్నె
ఇరులు జిమ్మకమున్నె
చేకొనవె !

అలరుదోయిలిలోన
తొలకుతేనియసోన
అరగాడ్పు కోనలో
ఆరునో జారునో !
చేకొనవె చేకొనవె
చిన్నిపూవో నాథ !

రవీంద్రుని గీతి ననుసరించి.

మధుపాయి

మధుపాయి విరి జీల్చి
మధువు త్రాగకుమోయి!
కలుగగల మధురతల
కలవరింతల కలుగు
ఆశానిరాశల, అ
నారతము చిక్కువడి,
కూర్చునెగులునఁ దగిలి
కుందుటే కోరుమోయ్!
మధుపాయి!!

తీయమంటలయేట
దిక్కెఱుఁగకుండఁగా
తెఱచాపయే లేక
త్రిప్పు మాలిమి లేక
పరువంపు టోడపై

పయనంబె వలచుమోయ్!
మధుపాయి !!

అంద మక్క అలేద!
హాయిఁ గనఁగారాద!
అనువు దొరకమిఁ గలుగు
ఆర్తిసౌఖ్యముచేద?
ప్రేమ ఫలియించుటకు
ఏమార్గ మున్నదోయ్?
మధుపాయి !!

నలిగి రాలిన తేకు
వలపు గోలోవ్వదా?
ఎండిపోయిన యకరు
వేమి దాహము తీర్చు?
కలలబాధల కపుడు
కలుగునే మధురతలు?
మధుపాయి !!

వలపు విరిగొలనిపై
వలిగాలి యలలపై

వెలిజిందు తేనెసో
నల ముగ్గి తేలుమోయ్!
కలనాద మెత్తి, కా
కలిపాట పాడుమోయ్!
మధుపాయి, విరి జీల్చి
మధువు త్రాగకుమోయి!

మా ధు రు లు

ఊరకే మాధురులు
ఊరిపోతున్నాయి!
ఆవైపు ఈవైపు
అని కాదు, అలముకొను
అందమే వెలుగైన
అన్నివైపులగూడ
అంధకార ప్రభలు
మండు వైపులఁగూడ!
ఊరకే మాధురులు!!
వలపుటామనిలోన
తల లెత్తు పూల తే
నెల క్రోలి సోలు ఆ
యెలదేటి పాటలో
ఆల వల్లకాట, చ
య్యాల చెరలాటలో!
ఊరకే మాధురులు!!

ఒక్కసారిగ నురగ
కక్కుతూ పొంగేసి
ఉరుముతూ విరిగేటి
కెరటమ్ము కేకలో
ఆవెన్కనే మరో
అల రాక తెలుపుతూ
ఏవైపు చూచినా
ఎందుకో మాధురులు ! !
వాడిపోయిన పూల
వాసనలు కాబోవు !
క్రొత్తవాసంతికల
కొమరు లసలే కావు !
మనసు మనస్సులె కాల
మందు కల్పించితే
ఊరకే మాధురులు
ఊరిపడుతున్నాయి !
హాయి, భోగం, మనకి
ఏవైపొ దాగికొని
తీయరోజులె కలుగు
తాయి ముం దెప్పుడూ

అని కమ్మవాసనలు
విరజిమ్ముతున్నాయి !!
ఆశలై అందాలరాశులై, కలిగేటి
సౌఖ్యాలపూసులై
చిరునవ్వుమోసులై
పెరుగులో విరుగులో
తరుగులో పరుగులో
ఊరకే మాధురులు
ఊరిపోతున్నాయి !

ఒక్క పువ్వే ?

ఒక్క పువ్వెటు చాలునోయ్? నీ
కొక్క నవ్వెటు చాలునోయా ?
వలపులోనో సొలపులోనో
కలుగు తీపియె వలయుగాదా!
అందమందే వలపుసొలపులు
అంతటా లోకమునఁ గలవోయ్ !
ఒక్క పువ్వే ?

అడుగు నిడితివి లోకమందున
హాయికొఱకే కాదటోయా ?
అందఱకు సొత్తయినలోకము
నంద మందే కలదు హాయి !
ఒక్కపువ్వే ?

ఏకతము గూర్చుండి యూరక
యేడ్వ నెటులు సహింతువోయా ?

పవలనకి, రేయనక, యీవిధి
బాధ నెటుల భరింతువోయీ!
ఒక్క పువ్వే?

కలడో లేడో అయిన స్వామికి
కాలమంతయు రిత్త బుచ్చుచు
ఏల యీగతి సేవచేయుట
ఎందునా పొందని శ్రమంబున
ఒక్క పువ్వే?

ఆ 'విభుని నేర్పయినకృతు' లగు
అన్ని విరు లందమ్ము నీవా
ఆ విభుని ప్రతిమూర్తులే యగు
అన్ని పూవులు వలపు నీవా
ఒక్క పువ్వే?

కల విరుల నన్నిటిని వలచుము
వలయుచో లోకమునె వలచుము!
కలవు తీపియు హాయి, దాననె!
బదులుకోరే స్వార్థపరతను
వదలుమోయ్! అనవసరమోయీ!

లెవు నీ కాశానిరాశలు,!
రాదు నీ కిక భగ్నహృదయము !
విశ్వసౌందర్యార్చకుడవై
నిత్య మానందమ్ము క్రోలే
సత్య మగు జీవితాశయ మా
చరణమందువ నిడగదోయి !

"చండీదాసు ప్రేమగీతి"

అతిదీనకామిని! రజకినిరామి! నా
హృదయమందిరమె తన సదనముగ వెలసినది!
లేదు తిరుగనివాడ లేదు చూడనిజాడ
లేదు చేరిననీడ తన కూటికై వేడ!
అతిదీనకామిని!
రజకినిరామిని!

ఆలయంబున వెల్గు నాదేవి యటు; నాహృ
దంతరంబున వెల్గు నీదేవి యిటు సతము!
వరప్రేమగాయని!
వాసంతదాయిని!

ఆమెను నియోగించి రాచార్య లనుకంప
మందిరాంగణము సమ్మార్జన మ్మొనరింప!
దేవీ ప్రసాదమ్ము తృప్తిగా భుజియింప!
అతిదీనకామిని!
రజకినిరామిని!

యౌవనభామిని! దుఃఖినిరామిని!
నిరుపమప్రేమిని! శారదయామిని!
అతిదీనకామిని! రజకినిరామి! నా
హృదయమందిరమె తన సదనముగ వెలసినది!
అతిదీనకామిని!
రజకినిరామిని!

కవిగాయకుడు 'చండి' గానమ్ములో తేట!
లేదు లే దలరామి ప్రేమ కిలలో సాటి!!

కన్నెకాకిబావ!

కాకిచూపుల కన్నెకొలుకుల
కొత్తతీపుల చేవులు పూయగ
తేనెబుగ్గలు గుంటలడగా
తీయపాటలు పాడుతుంటే
పండ్రెండో వసంత మిట్టే
పాలుతెంచిందోయ్!
కాకిబావా కాకిబావా
కలిగె నీ రెక్కల్లో సత్తువ
ఎగరలేవో ఏకతంగా
ఇరులుతెంచుక మింటిలోనికి
చూపులకునూ రంగునకు నే
చూడగానువు కాకిబా వవి!
హాయిగా నువు పాటపాడిన
కోయి లెందు కీక?
మారుమూలల కెగిరిపోవగ
ఒక్కపా టెలుగెత్తిపాడవ్

ఒక్కమా టెలుగెత్తిపాడవ్
నక్కబావని కాను లే నేను

... ...

ఎసగు బిడియపుతొడిమ
పసిమి మించెను గదా !
అతను శంఖరవాళి
అలముకొన్నది గదా !
తీయకోరిక తేకు
తెఱచుకొన్నదిగదా !
తలయెత్తి చూచుటకు
తటపటాయించకోయ్!
కలిసిమాటాడుటకు
కల్లోలపడకుమోయ్!

ప్రధానం

ఎన్ని తీయని కలలు
కన్నానో నినుగూర్చి
ఇన్నాళ్లు ఎదవిప్పి
ఎరిగింపనా చెలీ !

బ్రతుకు పందెములలో
పయిపేరు నాదిగా
తొడిగినా వొక వీర
కడియమ్ము నాచేయి !
నీ పెదవి కెంజివురు నే
పుడికిన ఫలమె చాలు
తీయగొంతుకతోడ
కోయిలై పాడుదును !
నీమనసు నామనసు
ఏక మగుటనె చాలు
లోకమ్ము దిద్దేమ
హాకవిని కాగలను !

నీ వలపు తేనియను
త్రావిన బలమె చాలు
ఈ రేడులో కాలు
ఏకముగ ఏలుదును !

మనప్రేమ

మనప్రేమ

సస్యసుందర భూములన్
ప్రభవించి ప్రభవించి
ప్రణయ తృణకాష్ఠ మగునో? ఏమో !
ప్రణయ పల్లవం బగునో ఏమో !

మనప్రేమ

కల్లోలినీతరంగములన్
పయనించి పయనించి
ప్రణయ తరణియే యగునో ? ఏమో !
ప్రణయ జలరాశి యగునో ? ఏమో !

మనప్రేమ

కాలగాఢాగ్నిశిఖలన్
తపియించి, తపియించి
ప్రణయ జలదాళి యగునో ? ఏమో !
ప్రణయ విద్యుల్ల తగునో ? ఏమో!

మనప్రేమ

దీర్ఘ ఝంఝానిలములన్
ప్రసరించి, ప్రసరించి
ప్రణయ నిశ్శ్వాస మగునో ? ఏమో !
ప్రణయ మధుహాస మగునో ? ఏమో !

మనప్రేమ

సువిశాల గగన వీథులలో
విహరించి విహరించి
ప్రణయ విహగరాజంబె అగునో !
ప్రణయ భువన సామ్రాజ్య మగునో ?

రాధ వలపు

వలపులో తేలుదునో
మఱపులో సోలుదునో
మనసులో ప్రాణేశు
మాట తీరే తోచె!

కపురంపు తునకలో
అపరంజి మొలకలో
తలపులో నానాథు
పలుకు తీరే తోచె!

విరిదేనె ముసురులో
తొలిమించు విసురులో
విరమింప కే విభుని
వేణురావమె తోచె!

ప్రణయగీతమ్ములో
ప్రణవనాదమ్ములో
రాధయే నాథునిగ
ప్రభుడె రాధగ తోచె!

వసంతోత్సవము

బృందం:—పులుగునెచ్చెలులార పూవునెచ్చెలులార
కొదమతుమ్మెదలార కదలి రా రండోయి!
తీయతావులపూలతేరెక్కి ఋతురాజు
వనలక్ష్మి కై సేయ వచ్చెనే నేడు!
ఇరులు కురియగ లోక మిగురజేసినవాడు
చలిరేడు హేమంతు డరిగెనే నేడు!!
స్వాగతమోయీ! వసంతదేవా!
స్వాగతమమ్మా వనలక్ష్మి!!

తుమ్మెద:— ఝుం ఝుం ఝుం ఝుం
ఝుం ధిం ధిం ధిం
ధి మ్మని దుందుభు
లను మ్రోయింతుము!

కోయిలలు:— ఆహా ఆహా యని
జగములు మరవగ
కుహూ కుహూ కుహూ కుహూ యని తూ
ర్యారావమ్ములు సేయుదుమోయ్!

బృందం:—స్వాగతమోయీ వసంతదేవా!
స్వాగతమమ్మా వనలక్ష్మీ!!
చలిలోరాలిన మంచుముత్తెసరులు!
ఇరులను త్రోలి హసించు కమ్మవిరులు!
మరులను జిమ్మి తనియించు తేనియలు!
మలయానిల మృదుమధురాలాపములు!
కలహంసీకృతనవనవనాట్యములు!
కొనుమోయీ మాధవ మాకానుకలు!
వనలక్ష్మియె లోకపుయావనలక్ష్మి
కొనుమోయీ మాధవ నీప్రేయసిగా!
వనలక్ష్మీ వసంతులకు పెళ్లి!
మనస్సులకు మోదమ్మగు రండి!
తమస్సులిక తొలగును లెండి!
వనలక్ష్మీ వసంతులకు పెళ్లి!!

మధువని

మధువనీలతాంత కాంతలారా! రారే
మదభరయౌవన మధునిధులారా రారే రారే!
నీలగగనవీథులలో బారులుగా తేరి
తేలి తేలి కోమలదళముల పరచుకరారే
లోలపవనకల్లోలినిలోన తూలి తూలి
రాలుపరాగపరిమళపాళి మెరయరారే?
రావె అశోకా అరవిందా
రావే మాకందా
రావే నవమల్లీ నీలోత్పల రారే విరులారా
మధువనస్వప్నడోల
విధురహృదయ సంయోగఖేలలో
మధురప్రేమిజన మత్సరలీల
మధువన స్వప్నడోల

మలయానిలుడు ౧:

రావోయీ మలయపవనా!
తీయ తీయానైన విరితావులడోలికలో రావోయీ

---

*రాబోవు ఎనిమిది మధువనస్వప్న నాటకగీతాలు.

దూరాంబ భ్రమరాళీపికాళుల
హాయిగొలుపుసన్నాయినగారాలలో రావోయీ.

మలయానిలుడు ౨:

ఏతెంచె నదె మలయానిలుడు
వీతెంచె నదె మలయానిలుడు!
హాయి హాయిగ తీయ తీయని
భావముల నెదరేపుచూ!! ఏతెంచె!!

రివ్వురివ్వున నెగురుకమ్మని
పువ్వుతేనెల రువ్వుచూ!
దవ్వుదవ్వుల పాటతేటల
వలపు బరువుల మోయుచూ!! ఏతెంచె!!

మరులుమాతంగి ౧:

చర చర చర చర పోయే
శరవేగము చాల దహో!
చరాలు మని బిరాన పోయే తటిల్ల తేల నహో!
మనోవేగమును మించిన
మలయహాయువేగ మ్మిది!
ఏడుసముద్రములా ఈరేడుసముద్రములా
చూడు దాటి కొనితెత్తును అపరూపపుసంపంగి

మరపు తెరల మాయ ముంచు ప్రసవము
మరులుమాతంగి!!

మరులుమాతంగి అ:

మరులు మాతంగి పూజేనె! నీదు
కనుదోయి లోగొన్న యిరుల పోద్రోలీని !! మరులు!!

ప్రియురాలి ప్రేమార్తి గనవో నీదు
హృదయమ్ము రాయైతె ఇక కరగిపోయీని!! మరులు!!

కన్ను రెప్పలు తెరవగానే నీ ప్రియను
వెన్నంటవో వలపు వలపంటు వేడవో !! మరులు !!
మరులుమాతంగి !!

జోల:

జోజో, జోజో, జోజో, జోజోజో
అందాలమల్లీ నికుంజమందునా
పొందుగా నిద్రింపవమ్మ సుందరీ
చల్లగాలి చెక్కిళ్లపై సోకగా
మెల్లాగ సోగా కన్నుల తాకగా
తీయాతావీ వింజామర లాడగా
హాయిగా సుమాంగ నాళి పాడగా
జోజో, జోజో, జోజో, జోజోజో

మాయాజాలం:

రేగనీ చెలరేగనీ
మాయాజాలము, మధుమాయాజాలము !
పుప్పొడి దుమారము, స్వప్నపారావారము
ఉప్పెనౌచు పొంగి నిండనీ నిండనీ కాంతారము !
మధురసాలసారము దివ్యసౌరభవారము
దిక్కుదిక్కులా అల్లనీ అల్లనీ నీహారము !!
రేగనీ చెలరేగనీ !!!

మధువనస్వప్నసీమ
మధుమాయా పరివృతచ్ఛాయా సుందరము
నరులుగాని, సురలుగాని, పూవుల
నారాచాల వాడిమొనల కోడరె
తీయ విరులతేనె సుంత కనుగవ
పూయ ప్రియా ప్రియా యనుచు రోయరె
మధువనస్వప్నసీమా !

వెలుగు

వెలుగు ! నా వెలుగు !
ఈ జగము నిండిన వెలుగు !
కనుల ముద్దిడు వెలుగు
ఎద తియ్య నగు వెలుగు !
మనికి మొగసాలలో
నటియించు నా వెలుగు !
వలపుతీవల మీటి
పలికించు నా వెలుగు !
అంబరమ్మే విరిసి
అనిలము కడల దరిసి
అఖిలలోకమ్ము, హా
సాంచితమ్మై వెలసె !

పెళ్లి కాకముందు

ఏమని, ఏ మేమని, ఏ మేమని!!
నా హృదిలోపల కోరిక యేదో
నాట్యము సేయును తీయని పాటై
కమ్మకమ్మని పూవులతావులు
పలుకరించు పూరేకుల చాటై
హృదిలో కోరిక ఏ మేమని!! ఏమని!!

ఝుం ఝుం ఝుమ్మని పూవుపూవుపై
క్రమ్మెడు తుమ్మెద పాటల రొదతో
యీ వసంతమే గేలిసేయుగా
హృదిలో కోరిక యే మేమని!! ఏమని!!

పెళ్ళయాక

చిన్ననాటి స్వప్నసీమ
కన్నయూరు విడువలేము !!
ఎంతహాయి!
చింతా చీకు లేని చిన్ననాడు ?
ఎంత వంత,
ఎదిగి లోక మెరుగుకొలది, నేడు !!
తల్లి మరచి, తండ్రి మరచి, చెలుల, బంధువులను
కల్ల లనుచు, ప్రియములైన వెల్ల మరచిపోవలెను !!
చిన్ననాటి స్వప్నసీమ
కన్నయూరు విడువలేము !!

జంటఊయెల

అతను: ఊయెల ఊపనా సఖీ
ఊయెల ఊపనా !

ఆమె: తీయగ పాడనా మీ
రూయెల ఊపగ ఊగనా !!

అతను: జీవితమే ఊయెలగా, కలగా
నీవే కలలో తీయదనముగా !! ఊయెల !!

ఆమె: ప్రకృతియె నేనుగ
పురుషుడు మీరుగ

అతను: ఆకాశము భూమియు ఏకముగా

ఇద్దరు: ప్రకృతిపురుషలీలయె ఊయెలగా
ప్రణయమధురడోలయె ఊయెలగా

ఆమె: భావగగనపుటంచులు మీరి
దేవలోకపుసీమలు చేరి

అతను: } ఏలుదమా యీ జగమంతా
ఆమె: } మరచి మనుజులచింతా, వంతా !!

అతను: ఊయెల ఊపనా !

ఆమె: తీయగా పాడనా !!

ఆరుఋతువుల ఊయెల

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా !!

థళథళ మను మెరపులలో
ఫెళ ఫెళ మను ఉరుములలో
ఝర ఝర పడుధారలలో
చర చర నర్తించు నెమలినై !!

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా !!

తెలిమబ్బుల నురగలలో
తెలివెన్నెల తరగలలో
పయనించు చంద్రనౌకలో
శయనించే తారాకోమలినై !!

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా !!

హేమంతరాజు కైదండనే
చేమంతి కుసుమాలదండతో
తెరతెరల నును మంచువలువలో
సిరు లొలుకగా పుడమి చెలువనై !!

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా !!

ఇలరాలిన ఆకులలో
తలవాల్చిన తరువులలో
చలిమంటల వెలుగులలో
వలపొలుకు చెంగల్వలతికనై !!

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా !!

తోటతోట చివురులు పోయా
బాట బాట పూవులు పూయా
జుమ్మనిపాడుచు తేనెలు క్రోలే
తుమ్మెదరాయని సుమప్రేయసినై !!

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా !!

తెలిమల్లెల పూలతోటలో
చలిపందిరి తేనెయూటలో
తరువు తరువు ఫలాలబరువులో
వరలి మురియు వనదేవతనై !!
జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా !!

పూలచెండు!

అందుకోం డందుకోం డిదే!
అందుకోం డిదే! అందుకోం డిదే!
అందమౌ పూలచెం డిదే!! అందుకొండి!

మందమారుతమువోలె సోలుతూ
తేలి తేలి భువి రాలి తూలుతూ
కన్నెవలపువలె కమ్మవాసనల
చిమ్మి మైమరచుచెం డిదే!
తన్ను దా మరచి యెదిరి మరపించు
అందమౌ పూలచెం డిదే!! అందుకోండి!

అందదోయ్ అడుగు మందగించి వెను
కంజవేసినా అందదోయ్!
తొందరై అడుగు ముందు వేసినా
అందదోయ్ అదే మందదోయ్!
క్రిందుమీ దరసి చిందు తా వరసి
పొందుగా అందుకోం డిదే! అందుకోండి

మేలుకొలుపు !

మేలుకొలిపెగా
తానే మేలుకొలిపెగా !

నా మేనిసొగసులో
నిదురించే యౌవనమును తానే !
ప్రేమ తెలిపి పలుకరించి
మేలుకొలిపెగా !! మేలుకొలిపెగా !

నా మదిలో నాట్యమాడు
నా తొలికోరికలే
మింట తోచి మెరసిపోవు
తారా మాలికలై !! మేలుకొలిపెగా !

రెక్క విప్పే నా కోరికలే
ఎక్క డెక్కడికో ఎగయా
చక్కనైనా వెన్నెలయేరుల
స్వప్ననౌకలలో సొగయా!
స్వప్ననౌకల తేలే కోర్కెలు
సఫలము సేయడొ రయమున తానే !
మేలుకొలిపెగా !!

మలయానిలుడు; దిరిసెనపూవు

దిరిసెన:— ఓ మలయపవనమా!
నిలు నిలు నిలుమా! ఓ మలయపవనమా!

మలయ:— ఓ విరిసిన దిరిసెనపూవా!
నిలిచిన బహుమతులా! ఓ విరిసిన దిరిసెనపూవా!

దిరిసెన:— బాటసారి నిలు నిలు మని
పిలువగానె బహుమతులా! ఓ మలయపవనమా!

మలయ:— బహుమతులే ఈయనిచో
బాటసారి పిలువనేల! ఓ విరిసిన దిరిసెనపూవా!

దిరిసెన:— మాటకారి బాటసారి
మాట చెల్లకుండునేమి
అర్పించితి సర్వస్వము
అతిథిసేవగా తనకే ఓ మలయపవనమా !

మలయ:— తా నెవరో నే నెవరో
తనసంగతి నా కెందుకు
నీ వలపుల నీ తళుకుల
ఏవి నాకు బహుమతులో ఓ విరిసిన దిరిసెనపూవా!

దిరిసెనః— తొలిజన్మల వలపులలో
తొగిపిన తేనియలు!
వలపుల పుష్పాడి మెరపుల
విరిసిన మాధురులు! ఓ మలయపవనమా!

స్వ భా ను !

రావే రావే నవవర్షా జగదభి నవహర్షా !
రావే నవప్రభాత శీతల
శుభానిలంతో స్వభాను !

దెసదెసలన్, కెంజాయల మధుహాసనములు
ఎసగునవే తరులతల చివురు గుసగుసలు
ముసరునవే పరిమళ కుసుమోల్లసనములు ! ! ॥రావే॥

పల్లె పల్లెలన్, పట్టణమ్ములన్
బాలబాలికలు చెలరేగ, నీ
ఆగమనమ్మును గనరాగ,
దవ్వుదవ్వులను నవ్వులగొంతుల
యౌవనరమ ఉయ్యాల లూగ
జంటలుగాగ, నిను గనరాగ ! !
విషాదగీతులు, విరాగగాథలు
వినంబడవులే
వినూతన మధూదయోత్సవమ్మున
విమోహానానంద మాధుర్యమా! ॥రావే॥

మధుఋతువు

వెలసె నహో! వెలసె నహో
ప్రతివనమున మధుఋతువుసహ !
యౌవనము ! యౌవనము !
త్రిభువనముల నవయౌవనము ! !
వలపుబరువుతో వరుసలుగా
తరులతికలపై విరిసె నహో !
కుసుమాలు ! కుసుమాలు !
వనవనమున మధురసుమాలు !
మరందధారలు క్రోలుటకో
పరాగరాశుల తేలుటకో !
ముసరె నహో ! ముసరె నహో
కుసుమకుసుమమున భ్రమరాలు !

చెల్లికి!

మెఱసె మెఱసె తారకాళి
మింట తోరణమై!
మొరసె మొరసె భువనమెల్ల
దుందుభిస్వనమై!
తరళ మధుర మధురామృత
కవితగానవల్లీ!
సురగాయకగణము పాడు
శోభనగీతులు చెల్లీ!
నీదు నవవసంతోదయ మీ
దినమున తల్లీ!
ఈ దినమ్ము తిరిగి రాక
మునుపే నీ పెళ్లి!

వసంతము

జగతికి వసంతమా
వసంతమా జగతి!!

అమృతవీణ నాగాన
మ్మావరించు దశదిశలను!! వసంతమా!!

షడ్జమును మీటి
మధ్యమమును దాటి
దైవతమును మీరి తార
షడ్జమును చేరి!! జగతికి వసంతమా!!

మ్రోడులయిన తరుల వీణ
మ్రోయగనె చివురులు!!
సఫలాశయ హృదయమ్ములు
సఫలాశలగు వనమ్ములు!! జగతికి వసంతమా!!

పాడలేని ప్రతిగళమ్ము
పాడునే డనర్గళమ్ము!!
పాటలోన మరచు నాత్మ
మరపున నెరుగు పరమాత్మ!!

జగతికి వసంతమా

వసంతమా జగతి!!

అమృతవీణ నాగాన

మ్మావరించు దశదిశలను!! వసంతమా!!

గ్రీష్మపత్రావళి

58

అందవు

అందవు అందవు యెంత చాచినా
యెడదల మొలిచే చేతులు !

ముందుకు ముందుకె యెంత చూచినా
బరువుగ మెరిసే చూపులు !

తడియవు తడియవు యెంత కురిసినా
వలపు జేడుల బడి యెడదలు !

తనియవు తనియవు యెంత విరిసినా
వెన్నెలసుడులలో కన్నులు !

అందవు అందవు యెంత చొచ్చినా
యెడదల దొలిచే చేతులు !

ముందుకు ముందుకె యెంత విచ్చినా
పెదవుల నమిలే చూపులు !

తెలియవు తెలియవు యెంత మ్రోసినా
బ్రతుకుల సంజేలగంటలు !

కలియవు కలియవు యెంత సొలసినా
ఒకటై రెండు యెడందలు !

గతాగతం

చూచినకొలంది రాబోవు వత్సరా
లలసా లనిపిస్తాయి !

కడచినవి వెనుదిరిగి చూస్తే
వేవేగ నడిచె ననిపిస్తాయి !

సంతోషమైన సంతాపమైన
ఒకజ్యోతి క్రమ్రసారభమే !

చిరకాలపు కర్పూరమ్మో !
కడచినకాలపు చందనమోకద !

వికృతహాసం

హృది పొంగే తరుణ మధువనంలో
నిదురించా నొక నీరవరాత్రి
గుసగుసల నెసగి నా మదిలోన
కొసరి కలలవెన్నో కదిలాయి!

మధూదయారుణిమచ్ఛాయలలో
హృది నిండే యానందముకొరకై
వెదకాడగ ప్రకృతియే వికృతయై
వికటహాస మొనరించినది!

"గజేల్"

హాయిలో నేల యెద కింత హింస?
తీయపాటలో బాధేల వంశీ !! హాయిలో!!

శకలశకలాలుగా నిన్ను విరిచి
వికలరుతు లందె జగతి మైమరచు!! హాయిలో!!

ఏల అమృతమ్ము నాశించు వీరే
నందనము నేలకే దించుతారే!! హాయిలో!!

మురళి నీ పాట నేల గద్గదము?
రజనికంతాన నేల బుద్బుదము? హాయిలో!!

విరహిణి రాధ

విరహానలంపుబాధ
భరియింపలేదు రాధ!
తన చూపే నీదు తేరు
చను దివ్యపథముగ గోరు
తన వినికియె నీ మురళీ
స్వనసృతానిలముగగోరు
విరహానలంపుబాధ !
భరియింపలేదు రాధ!

ఊర్పు వేడి వాడె విరులు
ఉరమునుండి యూడె సరులు
కేశరాశి అశ్రువారి
రాశితోడ కలగి పొరలు
విరహానలంపుబాధ
భరియింపలేదు రాధ!

*స్వాగతము :

సంధ్యారుణిమ రుచిరజ్యోతులు
సకలపాంథులకు స్వాగతము
నందనవని హరిచందన విపృతా
నందాంగణమున స్వాగతము
ప్రసవసుగంధిల నిహారశీతల
పాద్యజలమ్ముల స్వాగతము !
విచికి లాక్షతా దధి మధు ఫలరస
రచితార్ఘ్యాంజలి స్వాగతము !
వసంతాంత మృదుకిసలయతోరణ
మసృణాంగుళముల స్వాగతము !
అదళిత కదళీ శ్యామ విస్మృమర
చ్ఛదనకరమ్ముల స్వాగతము !

---

*రాబోవు పదిపాటలు గ్రీష్మము అను సంగీతనాటికలోనివి.

గ్రీష్మజృంభణము

నడిమింట చండరవి మండు నెండ కాచె!
వడగాలులు సుడి తిరిగి హోరు మని వీచె!
సడలి తరుపర్ణములు జరజర మని రాలె!
వడలి సుమఫలాలు సొగసుచెడి పడి తూలె!
కడలంటు బ్రదుకులను జీవరాశి రోసె!
బడలి మంచెపయి తోటమాలి కనుమూసె!

౨. ఈ రేడుజగాలు కాలె ఈ గ్రీష్మ జ్వాలాకీల!
ఈ తాపమునార్చు నేత లేదు ఈపాపముతీర్చు త్రాత లేదు!
అనల మ్మనిలమ్ము కలిసి, ఆకాశము నొసట పొగలు
వనరుజీవజంతుతతుల బ్రదు కాశలకడలరగులు
ఈ తాపము ... ... ఈ పాపము
ప్రేమకొరకు మరిగి మండి వ్రీలిపోయినవి ఎడదలు
తేమకొరకు సురిగి యెండి చీలిపోయినవి యేరులు
ఈ తాపము ... ... ఈ పాపము
వెతలను మరపించు దారి కతలు మాయమాటలోయి

వితలౌ యెండమావులే వినిపించే పాటలోయి
ఈ తాపము ... ... ఈ పాపము
ఈ రేడుజగాలు సోలె ఈ గ్రీష్మ జ్వాలాకీల !

3. ఎండకారు, ఎండకారు, తోటలన్నీ పండేకారు
వనదేవతకావికురులు మెరసి వ్రేలు కెంజివురులు!
తెరల తెరల కమ్మతాల లొరసి మరులుజిమ్ము త్రోవ!
]ఎండకారు !
తరులనీడల వీనేందిర పరచికొనిన చలిపందిర
విరిదేనెలు ఫలరసాలు కురిసి నోరు నిండేకారు ! ఎండకారు !
తెరతీసిన మావితోట సురిగి చనెడు పికముపాట
తేటలోన మేను మరచి తోటమాలి పండేకారు !
ఎండకారు ఎండకారు తోటలన్నీ పండేకారు !

తోటమాలి

తోటమాలీ! తోటమాలీ!
యేటి కింక లేవవు యీపాటికి నీ నిద్ర తేలీ
తోటమాలీ! తోటమాలీ!

పాటిరేవులో కదలక పడవలాగిపోయినవో
ఏటినీరు రాక తోట యెండి మాడిపోయినదో
తోటమాలీ! తోటమాలీ!

మావిపండ్లు కావిలోన మాగిపోయెనో యేమో
తావి జారి పూవులన్ని రాలిపోయెనో యెమో
తోటమాలీ!...తోటమాలీ!

వడగాలులు వీచుచుండ, ఒడలుకాలి మండిపోవ
మడులలోని విత్తనాలు ముడిగి విడిగి యెండిపోవ
తోటమాలీ.....తోటమాలీ.....
యేటి కింక లేవవు యీపాటి నీ నిద్ర తేలీ
తోటమాలి! తోటమాలి!

ఓసారి లెమ్ము ఓ తోటమాలి
హాసమ్ము చిందువదనమ్ముతోడ
ఓ తోటమాలి ఓసరిలి లెమ్ము లెమ్ము
ఓసారి లెమ్ము ఓతోటమాలి లెమ్ము!
వేసంగి నలగి వేగునే ప్రాణితతులు
ఈసారి లేచి ఈక్షింపు జీవగతులు
ఆశాశ నందుకొనుమోయి లోకనతులు
ఓసారి లెమ్ము.....

వేసంగి క్రాగి వీగి భువి రిత్తవోయె
వాసంత జీవనపుహాయి నిత్తువేని
బ్రతుకంత మధుమ్మయ మ్మంచు మెత్తుమోయి
ఓసారి లెమ్ము ఓతోటమాలి
హాసమ్ము చిందు వదనమ్ముతోడ
ఓ తోటమాలి ఓసరిలి లెమ్ము లెమ్ము
ఓసారి లెమ్ము ఓ తోటమాలి లెమ్ము!

నీ కెందుకు

తోటమాలిజోలి నీ కెందుకు !

తోటలో తేనెతేటలో తీయపాటలో మునిగి తేలక

వనములో సఖీజనముతో సుధాసవములో మునిగి తేలక

తోటమాలి జోలి నీ కెందుకు ?

తోటమాలి నిద్రింపనూ లేదు

తోటమాలి మేలుకోనూ లేదు

నీదు ఊర్పులో నాదు ఊర్పులో

నీపాటల నాపాటల మాటల

పెరుగులో విరుగులో తరుగులోన

పరుగువారు కనబడనితేజమా

తోటమాలి జోలి నీ కెందుకు?

తోటలో తేనెతేటలో తీయపాటలో మునిగితేలక

వనములో సఖిజీవనముతో సుధాసవములో మునిగితేలక

తోటమాలి జోలె నీ కెందుకు?

చలిపందిరి

విరిచెలువలార నవమాధవీనికుంజ
మందు కలయంపిగా తేనియలను చిల్క
గండవొడు లల్క పైడిసింగంపుపీట
లం దతిథివర్యు లెల్లరు నధివసింప
పజ్జ గొజ్జంగి చలువవీవనలు గొనుడు

* * *

బ్రదుకందు గాసిలిన పాంథా
ముదియెండ శోషిలినపాంథా !
బరువైన చూపు విదళించు
చిరునవ్వు పెదవి గదియించు !
చలిపందిరిలోపల విందు
కలలూరు మధువనమునందు !!

మలుసంజ మంచు నునుజల్లు
పలికమ్మ తెమ్మెరలపెల్లు
ఎలదేటులార లే లెండు
విరిబోటులార రా రండు !!

నవవర్ష మధువులను తెండు
యువహర్ష గంధముల నిండు
క్రొవ్విరులతేనెజడి ముసురు
మవ్వంపు గంధవొడి విసురు !!

చలిపందిరిలోపల విందు
కలలూరు మధువనమునందు
ఫలరసాలు నవశీధువులు
కలరవాలు యువమాధురులు !!

అజరుండ వైతివిక పాంథా
అమరుండ వైతివిక పాంథా
ఇదె ఆశకై సుధాపాత్ర
ఇదె ప్రేమకై సుధాపాత్ర
ఇదె స్మరణకై సుధాపాత్ర
విస్మరణకై సుధాపాత్ర!!

వీడ్కోలు

తీయమావిచివుళ్లు మత్తిల్ల మెసవి
పాడి తెగపాడి, కోయిలా నేడు నీవ
సంత మలరారు వేరు ద్వీపాంతరమ్ము
చనియు, వీడవు మా హృదంచలము లెపుడు !

* * *

చివురు గుబురుల గూటిలోనె దాగితివి
చివురు రసమును చేదుగానె త్రాగితివి
తీయతీయగపాడి హాయి మనిపించుటే
కాని కంటికి కానరానె లేదోయీ !
రానే రావో కోయిలా ! ఇక నీవు
పోనే పోదువో కోయిలా.....
దెసల యంచుల పాట తేలి కరగేనో
ముసలిమ్రాకుల తోట సోలి మరిగేనో
పాయకే మా హృదయఫలకాల చిత్రిత
మ్మాయెనే నీపాట కానరాలే దీవె

రానేరావో కోయిలా! ఇక నీవు
పోనే పోదువో కోయిలా.....

* * *

పోయిరావే కోయిలా
పోయిరావే కోయిలా
వీడుకోలే కోయిలా
వీడుకోలే
చివురుగుబురుల
గూటిలోన
దాగినావే కోయిలా !
చివురురసమును
చేదు చేదుగ
త్రాగినావే కోయిలా !
తీయపాటల
హాయిగొలుపుటెగాని
కానరానె లేదోయి !!!
దెసల అంచున
నీదుపాట
తేలి కరగేనోయి
పసిమి వెలుగుల
తోట నిలువున పులకరించేనోయి !!

ఆశాగీతి

కనవో ప్రతిఋతు మధురీతి!
వినవో యీ ఆశాగీతి !
వడలో సందడిలో...ప్రశాంత
వనజనసంగతి నీ ఆశ !
జడిలో అలజడిలో...మనోజ్ఞ
శంపాద్రుతగతి నీ ఆశ !
చలిలో ఆకలిలో...కలిత
స్వప్నసుధాస్మృతి నీ ఆశ !
పువులోన మధువులో...హసంత
కవిపికగళరుతి నీ ఆశ !
కనవో ప్రతిఋతుమధురీతి !
వినవో యీ ఆశాగీతి !

గ్రీష్మసంధ్య

మెరసినవి వినువీథిలోగిట వెలుగు తేనెలపైడిగిన్నెలు
కురిసినవి యీ తోటముంగిట ననుచు మల్లెలచలువసోనలు
ఒలసినవి యీ సంజవాకిట మధువులొలికిన పాటతేటలు
వెలసినవి యలసంపుబ్రదుకుల అమృతచైతన్యంపుబాటలు
ఒరగినవి వెత లడగి యెడదలు మరపుటంచుల మెరపుపాలకి
కరగినవి తరళిమలు కన్నుల విరియు మించుల తోటమాలికి!

యక్షనిగ్రీష్మము

నీకు మాత్రము కాకపోయిన
నాకు సుంతయు లేకపోయిన
ఆ వసంత మ్మటులె గడచెను
నీవు లేకయె ప్రేయసీ!

ఎడద వ్రీల్చు వియోగశాపము
ఒడలు కాలుచు గ్రీష్మతాపము
జగమె యుడుకుచు నంటుకొన్నది
జ్వాలాతోరణ మాచు నలుగడ
నీవు లేకయె ప్రేయసీ!

ఈ నిదాఘనిశీథి జాబిలి
ఏడ్చు నొంటిగ మించుటేర్లయి
ఈ వనిని సుమసౌరభమ్ములె
దావపావక శిఖల నుమియును
నీవు లేకయె ప్రేయసీ!

ఏలో ఏలేలే

ఏలో కోయిల ఏలే
ఎలో ఏలేలే

కువ కువ కువ మంటూ
కురూ కురూ అంటూ
చివురులమాటున గొంతుక చించుక పాడే వేలే
చినుకులు రాలుటతోనే తోటను వీడే వేలే

ఏలో కోయిల ఏలే
ఏలో ఏలేలే !

కువ కువ మంటూ
కురూ కురూ కురూ అంటూ
చివురులరసమును చేదుగ చేదుగ తాగే వేలే
నవఋతుగీతము తీయగ తీయగ పాడే వేలే

ఏలో కోయిల ఏలే
ఏలో ఏలేలే !

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

కువ కువ కువ మంటూ
కురూ కురూ అంటూ
వడగాలుల సీగళాన ఓడిన దమృతపుచేలే
కడిచే వేసవితోనే కదలుచుపోయే వేలే
ఏలో కోయిల ఏలే
ఏలో ఏలేలే ! !

V.R. MARLA
D.P.R.L.
ACC. NO.
A. MEMORIAL LIBRARY

๒๙
๒๐๙
๒๙
๒๙
๒๙

80

క్రొత్తపొంగు

మొయిలునడకలఁ గ్రొత్త హొయలు తోచినది !
మెఱపుచిందులఁ గ్రొత్త మిసిమి మించినది !
నాకలమ్మును గ్రొత్త నడక నేర్చినది !
హృదయమ్ము క్రొంగ్రొత్త పదము పాడినది !

సీతమ్మ శోకమ్ము శ్రీకృష్ణలీల
శ్రీరాము సత్యవాక్పారీణతయును
గానమ్ముచేసిన కవిలోకమునకు
ముసలినీతులవలని మోసమ్ముచాలు
మతముపేరిటి ప్రాతకతలు చాల్చాలు
అని చాటుమాట యీ నా క్రొత్తపాట !

కవిసమయాల శృంఖలములఁ దవిలి
ఉత్ప్రేక్షలుపమలు నూరకే చొనిపి
రంభోరువులు హేమకుంభ స్తన లని
అవయవమ్ముల నసభ్యముగ వర్ణించ

విరసప్రబంధాల వృత్తమ్ము లింక
కాలగర్భమ్మున గడతేర్పవలయు
అను తేటమాట యీ నా క్రొత్తపాట !

అశరీరయౌ సఖి యాశ్లేషమునకు
పవలు రేలను దీయ బాధలఁ బొగిలి
విరహాగ్ని కీలల వేగి తపించి
తనియక భావగీతములను వ్రాసి
తమయాతనలయందు గుములులోకమ్ము
వారిపై విరజిమ్మ వలను గా దింక
అను క్రొత్తమాట యీ నా క్రొత్తపాట !

దారిద్ర్య మంది స్వాతంత్ర్యమ్ము లేక
కష్టజీవిక ననుక్షణము భారముగ
గడపుచు ముక్తికై యడలెడు మనకు
జ్ఞానమ్మునకు గానరాని యమూర్త
భావాలు వృత్తమౌ పద్యాలవేల
అను తెల్విమాట యీ నా క్రొత్తపాట !

కనకసౌధాల సుఖాపేక్షఁ గులుకు
స్వార్థపరులును సౌహార్దహీనులును
ఊడిగము చేయింప వాడు మొగాన

కాయకష్టము రక్తము చెమటూడ్చి
నవయు కార్మికుమాట నా క్రొత్తపాట !

దారిద్ర్యతమసాన జలధిప్రళయము
తలపించు కార్మికు తన్వి కన్నీటి
తేటగూర్చిన మాట నా క్రొత్తపాట !

జలధి ప్రళయములోపలఁ జిన్నినావ
అనిపించు కార్మికు చినిపాప నవ్వు
రేక గూర్చిన మాట నా క్రొత్తపాట !

శుక్తివిరహము

ఈవిదాహ మెటులారునో ! ఈ
ఈ హృదయతాప మెటుతీరునో !
జలదసఖుడు తన ప్రణయామృతమధు
కణము లెన్నటికి కురియునో !
ఈ విదాహ మెటులారునో!
ఆకసమ్ములో అమృతధారకై
అరయు నా కరవు బరువులో
విజనసీమలో వేదనాగ్నిలో
వేగు లెన్నటికి తీరునో ! !
ఈ విదాహ మెటులారునో ! !

రాబోవు మూడుపాటలు శుక్తి అను సంగీతనాటికలోనివి.

నిరీక్షణ

ఈ తీరభూమిలో ఏకాకినిగ నీవు
ఎందుకై తపియింతువో సుందరీ ఎవనికై తపియింతువో!
చేయి కనుబొమలపై చూపు లాకసముపై
ఎండు పెదవులతోడ ఎగయుగుండెలతోడ
పొంగి ని న్నలరింపబోవుతరగల గనవు
నింగివైపే వెతలక్రుంగుచూపే కాని
ఈ తీరభూమిలో ఏకాకినిగ నీవు
ఎందుకై తపియింతువో సుందరీ
ఎవనికై తపియింతువో !

శుక్తిముక్తాఫలము

"మెరపు తీగ లవిగో జలదవరు
ఘన గర్జన లవిగో !!

మలయవాయువుల
పులకలలోపల
కలలకోరికలు
అలలై పొంగగ
హాయి హాయిగా
తీయ తీయగా
అమృతధార లవిగో !!

యుగయుగాలుగా
పగలు రేలు నా
పడిన వేదనా ఫలమో
తరళ తరళమై
ధవళ కాంతులను
మెరసెడి ముక్తాఫలమో !"

నెమలి

ఆడుతోంది నెమలీ! తీయగ పాడుతోంది నెమలీ

రంగురంగుల తరంగవళులలో

రమ్యమైన పురివిప్పి గెంతుతూ ఆడు

తళుక్ తళుక్కని కన్నులు చెదరగ

మబ్బులపై నొక హరిచాపం!

అబ్బురముగ మెడ తిప్పి యాడు నా

నెమలిపించ మొక హరిచాపం—

మెచ్చగు పించము విచ్చేని!

విచ్చెడు గొంతుక హెచ్చేని

వనియే బృందావనియో తానే

నందకుమారుడో అనిపింప!

ఆడుతోంది నెమలీ! తీయగ పాడుతోంది నెమలీ!

హరివిల్లు

అదిగో లేచెను హరివిల్లు!
హరివిల్లు! హరివిల్లు!
ఆకసమందున అందా లొలికే
ఏడు రంగులా హరివిల్లు! అదిగో !!

రవికి వాహనాలా? మబ్బుల
రథాలాచక్రాలా?
చూడ రమ్యమౌ చిత్రవర్ణముల
అమృతవాహినుల నును జల్లు! అదిగో !!

నేరెడిరస మెవరో విల్లున
నిలువున పూశారే
పాలపిట్ట రెక్కల నెవరో
బాగుగ కట్టారే! అదిగో !!

నీలనీలమై పచ్చపచ్చనై
అంచున విరిసింది—విల్లున

సంద్రము పాయో పొలాల చాయో
చక్కగ మెరిసింది ! అదిగో !!

పాలవెల్లిలో పసుపుకుంకుమలు
నూరి యలదినారా !
కోరి కూర్చి శ్రీ శ్రావణలక్ష్మికి
గొడుగు నెత్తినారా ! అదిగో !!

అదిగో లేచెను హరివిల్లు !
హరివిల్లు ! హరివిల్లు !
ఆకసమందున అందా లొలికే
ఏడు రంగులా హరివిల్లు !! అదిగో !!

చినుకు పాట

చినుకు కన్నియల పరికిణి చెంగుల
చెంగున మెరిశాయే చిన్ని ముత్తైసరులు !
టిప్ టప్ !...టిప్ టప్ !...టిప్ టప్ !.....
పరికిణి చెంగులి మాటున బరువుగ
ఖంగున మెరశాయే సిరిమువ్వవరుసలు !
టిప్ టప్ !...టిప్ టప్ !...టిప్ టప్ !...
చినుకు కన్నియల పెదవుల కెంపుల
కిల కిల విరిశాయే చిట్టి తటిల్లతలు !
టిప్ టప్ !...టిప్ టప్ !...టిప్ టప్ !.....
పెదవుల కెంపుల మాటున పేరట
పిలుపులు పిలిచాయే పిల్లమబ్బుసడులు
టిప్ టప్ !...టిప్ టప్ !...టిప్ టప్ !...
చినుకు కన్నియల ఊపిరిదారుల
తలుపులు తెరిచాయే వలపుపైరజడులు !
టిప్ టప్ !...టిప్ టప్ !...టిప్ టప్ !.....

శ్రావణలక్ష్మి

శ్రావణలక్ష్మియె అవతరించింది
జగ మెల్ల చలువయై పులకరించింది
మేఘాల రథ మెక్కి ఊరేగుతోంది
మెరపుల జండాల మెరసిపోతోంది
మసలు గాడ్పుల్లోన మాడిన లోకం
విసురు పయ్యెరలోన వీడింది శోకం
ఆకస మంతటా అల్లి వేసింది
ఊరూరనూ శాంతిభేరి మ్రోసింది
చల్లచల్లగ నయ్యె సూర్యుని తాపం
నల్లమబ్బుల నిల్చె నింద్రుని చాపం
శ్రావణలక్ష్మియె అవతరించింది
జగ మెల్ల చలువయై పులకరించింది

జానపదం

సేలమీదీ పైరగాలీ—సల్లంగ
సెంప తాకీ లేపుతాదీ !
మణుసులో అణగారి మరిసీపోయిన కతల
మక్కువలూ రేపుతాదీ !
తెల్లావోరిందంటూ తెలివొచ్చిందా అంటూ
మెల్లా మెల పలకరిస్తాది—జల్లుమని
వొళ్లెల్లా పులకరిస్తాదీ !

ములగసిర

వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
తొంగిచూసిన ములగసిరకి పొంగిపోయే తొలిమేగం
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
నల్లాకట్టి యేన్గులబారో
కొల్లేటి కొంగలతీరో
అందాల మెరుపురథాలో
కిందా మీ దౌతు నింగి రాలేయా పొంగి కూలేయా
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
యేటివొడ్డుని మొల్లరుప్పా
యెల్లువగా నవ్వింది !
నవ్వుతూ తనకళ్లా నవరసులూ రువ్వింది!
తళుకూలే ములుకూలై
వలపూలరేపంగ
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
తొంగిచూసిన ములగసిరకి పొంగిపోయే తొలిమేగం
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !

చాతకీ!

నీదుపాట విందున్—చాతకీ
నీదుపాట విందున్—లోకము
లేదు లే దనుచు వాదులాడినా
నీదుపాట విందున్

మంచున తడిసిన మల్లె కైపులో
మించి యలరు రేరాణి వలపులో
నింగి మబ్బులు మెలంగకుండిన అ
నంగ ఖేదమున ఆశాశలలో
నీదుపాట విందున్

చందనవిపినసుగంధవహాములౌ
మందమందపవమానగీతముల
మించు దీగలై విశ్వ మెల్ల పుల
కించు వర్షహర్షాగమమ్ములో
నీదుపాట విందున్—చాతకీ
నీదుపాట విందున్—లోకము
లేదు లే దనుచు వాదులాడినా
నీదుపాట విందున్

వానకోయిల

చిటపట చినుకులు రాలగ
కో యని కూసె నదే
చిటారు కొమ్మకొస వాన
కోయిల హాయిగ తీయగ !!

ఎండలవేడిమి తరుగగ
మండిన యెడదలు తడియగ
తీయగ పండిన ఫలములు
తిని తిని గళమ్ము విరియగ !!

దారిని పోయెడు పాంథుడు
తలెత్తి చూడగను
పారెడు కాల్వల జలములు
పకపక నవ్వగను !!

చిటపట చినుకులు రాలగ
కో యని కూసె నదే
చిటారు కొమ్మకొస వాన
కోయిల హాయిగ తీయగ !!

మయూరీ!

నటన మాడవే మయూరి
నటన మాడవే !

కటి యిటు నటు కదలియాడ
చిరుపదాలు చిందులాడ
వంపులమెడ సొంపు లొలుక
ఇంపుగ గళమెత్తి పాడి ||నటన||

చల్లని తడిగాలిపిల్ల
మెల్లగ నిను తాకెనుగా
రెక్కల సందున నేదో
చక్కిలిగింతాయెనుగా ||నటన||

ఆకసంపు టంచు దాటి
పైకి పైకి ప్రాకివచ్చు
నీలిమబ్బు దుప్పటాన
తేలియాడు కలలలోన ||నటన||

ఉరుములసడి మెరపులవడి
చినుకులజడి తాళముగా
సరస నీసఖుడు పురివిడి
వన్నెలకన్నుల చూడగ ॥నటనసా॥
నటన మాడనే మయూరీ
నటన మాడవే !

ఇంద్రధనుస్సు

నింగికి నేలకు వంగిన వంతెనగా
రంగుల కురిసే ఇంద్రధను స్సిదిగో!! నింగికి!!

సప్తాశ్వములు లాగెడు అరుణరథం
సప్తవర్ణదీప్తమగు గగనపథం
వర్ణవర్ణముల విద్యున్మాలికలు
కర్ణ పర్వామర్శరిత కథానికలు!! నింగికి!!

నేరెడుఫలముల ప్రోవుల నిగనిగలు
బారులు తీరిన పాలపిట్టజతలు
చాయలుతేరిన సంధ్రపుపాయ లవే
పాయలుతీరిన పొలాలచాయ లవే!! నింగికి!!

పసుపు నలందిన దిక్కులకడప లదే
నొసటను కుంకుమతో మిను వెలది యదే
జేగురు సేలువ వ్రేలెడు చెలువ మదే
శ్రావణలక్ష్మికి నిలిపిన ఛత్ర మదే!! నింగికి!!

అభిసారిక!

గాలివానరేయి! నిన్నీ
కానలోన నెటులు కాంతునోయీ!!
మనసులోన ఊరు తీయకోర్కులు
కనుల యెదుట నాడు నీడలై
ఇరులు చీల్చి దూయు మెరపుతీవల
తళుకులోన చెరిగి కరగునోయి!!
హృదయమందు నిన్ను గూర్చి మాటలు
కదలియాడు తీయపాటలై
ఉరుము సడుల నుడిగెనోయి పాటలు
వెరపులోన దారి కాననోయి!!
పొదరుచాటో తీవమాటో నిల్చితో
వెదకలేను వేసరిలితినే!
ఇరులలోన ప్రొద్దు తెలియదే నీ
విందు వచ్చి వెడలిపోయితేమొ!
గాలివానరేయి! నిన్నీ
కానలోన నెటులు కాంతునోయి!

జలదాగమనం

మురళీధరుని మోహనగానము
మరల వినబడునదే !

గోపభామినికి పోయినస్వర్గము
తిరిగి కనబడునదే ! !

గోపభామినికి గ్రీష్మమంతయు
హరివియోగమున వలవంత !
శౌరిరాకచే జలదాగమమున
ఆనందమ్మగు కొండంత ! !

జలభరితములౌ చల్లని మెల్లని
జలధరముల నడకలలో
మదమయూర సమ్మదనాట్యమ్ముల
మృదుకేకారవములలో ! !

శిఖిపించము తన శిరసున మెరయ
అఖిలలోకములు మురియ

శ్రావణనీరదశ్యామలదేహుడు
బృందావనిలో వెలయ !!

మురళీధరుని మోహనగానము
మరల వినబడునదే !

గోపభామినికి పోయినస్వర్గము
తిరిగి కనబడునదే !

మే ఘ మా!

మేఘమా ! మేఘమా !
గంగవలపులో సొలపులో
బెంగయూర్పులో
కనలు నెండలో తేలుతూ
గగన మంటెదో ! !—మేఘమా !

హృదయ మావిరుల్ వదలుతూ
కదలి కదలకే
కుంగి పొంగుతూ నింగిపై
కంగ చాపుతూ
నిండుకడలి తేడెగా నీకన్న
తండ్రి! కన్నతండ్రి ! !—మేఘమా !

వలపు టలలలో కలలలో
వగల సగమయీ
వెలుగుపొరలలో యిరులలో
తిరిగి వరుగయీ
మరుగుప్రేమికుల్ నీ
కన్నదమ్ము లన్నదమ్ములు ! !—మేఘమా !

దిగకోయి!

మెరిసే మబ్బులలోనో
విరిసే పూవులపైనో
చరియించే నా చెలీ! చెలీ!

మేను
పులకించే—నాచెలీ చెలీ!
దివ్యలోకమునుండి
దిగకోయి దిగకోయి
దేవతామూర్తి నా చెలీ!
వలచే గాలులపైనో
తలచే దారులలోనో
తలపించే నా చెలీ చెలీ!

మేను
మఱపించే నా చెలీ చెలీ!
దివ్యలోకమునుండి
దిగకోయి దిగకోయి
దేవతామూర్తి నా చెలీ!

ఉజ్జయిని పిలుపు

"రమ్మోయి ! జలధరా ! మదభరా !
స్వాగతమ్మోయి ! అమృతధారాధరా !
ఉజ్జయిని ప్రేమసామ్రాజ్యాల నెలవంచు
ఊరూర నింటింట మారుమ్రోగగ నిమ్ము ! రమ్మోయి
ఆమహాకాళు ఫాలాక్షి కెంజాయ !
అభిసారికల పాదలాక్షి క్రొంజాయ !
ఆనందధామాన నరయగా రమ్ము !
ఆమంద్రరవళి నాలాపించి పొమ్మోయి !
రమ్మోయి ! జలధరా ! మధభరా !
స్వాగతమ్మోయి ! అమృతధారాధరా!"

అలకానగరి!

ప్రణయజీవనపు బాటలకలిసే
వలపుతోట అలకానగరి!

ప్రణయిహృదుల పులకలౌచు మెరసే
కలికావళి అలకానగరి!

తీయతావి తెరలందు చిందుక్రోం
దేనెలాను భ్రమరావళులు!

తేలి సోలుచును జోలపాడు భ్రమ
రాళి వ్రాలు కుసుమాళులు!

హాయి మీరగా నూయ లూగు కుసు
మాళితో తరులతావళులు!

మందాకినిపయి నందగించు నవ
నందనాళి జ్యోత్స్నావళులు!

కరములలీలా కమలాలు
అలకల తెలిమొల్ల సుమాలు!

-ముఖములపై లోధ్రరజాలు
శిఖలను విరియు కురవకాలు
సీమంతముల కడిమిపూలు !
తలపగలమె అలకానగరీ
లలనావళి చక్కదనాలు !
వలపు లొలుకు తియ్యదనాలు !

మేఘరంజని (1)

ఘనాఘనా ! ఘనాఘనా !

గర్జింపవో ! ఘనాశని !! ఘనాఘనా ! !

దిశాంతములనుండి పైకి

కొసల్ బిగించి లేవనీ

ప్రశాంత సమీర ప్రసరిత

పయోధర వినీలశాటి !! ఘనాఘనా !

వియత్తలిన్ తటిల్లతల్

చలచ్చకితలై పారగ

ధరాతలాన వారిధుల్

నభోంగణమ్ము మీరగ !! ఘనాఘనా

చిటుక్ చిటుక్ చిటుక్ చిటుక్

చిద్రూప లౌచు చినుకుజడులు

ఝరత్ ఝరత్ ఝరత్ ఝరత్

ఝరులై ప్రవహించుధార

ధారాధరా ! ధారాధరా !

కురియింపవో ! ధారారుధి !

ఘనాఘనా ! ఘనాఘనా !

గర్జింపవో ! ఘనాశని ! ఘనా ఘనా !!

మేఘరంజని (2)

హే దయాంభోధరా పర్జన్యా
ఏదయా నీజీవధార !

నా తానమందు నా గాన మందు ఉ
డ్డీన మౌ వేడి యావిరుల్ !

వినువీథి దాటి ఘననీలశాటి
గా పైకి లేచునా తెరతెరల్
భూమ్యంతరాళముల వంతెన లౌ వి
ద్యుల్లతల్ తనుపు హ్యుల్లతల్
దిగ్దిగంతరమ్ముల మారుమ్రోయు గ
ర్జనములన్ మురియు మనములు !

వలిగాలి వీచ జలధార లౌచు, ఝర
ఝరా ఝరా ! ఝర ఝరా ఝరా !

హే దయాంభోధరా ! పర్జన్యా పడె
నయా నీ జీవధారా !

వరలక్ష్మి!

స్వాగత మమ్మా!
శ్రావణ వరలక్ష్మి!
దయాకువలయాక్షీ!
స్వాగత మమ్మా!
వినీలజలదాంచలా!
చలచ్చంచలామేఖలా!
క్షురీమృదులకుంతలా!
క్షుళంక్షుళితధారానూపురా!
స్వాగత మమ్మా!
శ్రావణవరలక్ష్మి!
చందనానిలశీతలా!
కుందకుసుమమృదుదరస్మితా!!
మధురాశాడోలికా?
ఫలభరితోద్యానమాలికా!
స్వాగత మమ్మా!
శ్రావణ వరలక్ష్మి!!

వొల

యెయ్యరా వొల యెయ్యరా
యిసి రెయ్యరా వొల యెయ్యరా!
సెంద్ర వొంక రూపుమాసే! మబ్బు
సీకట్లు రేతిరి కాసె!
సంద్రము హోరున మ్రోసె! కెరటాలు
మింటిపై పురకలు వేసె!! యెయ్యరా వొల!!
కెరటాలు విరిగినకాడె! మిల మిల
మెరిసేటి సేపలతోడ!!
బరువైన వొల లాగినావొ! ఇల్లె
బంగారమై తూగినావొ!! లాగరా వొల!!
కన్నులుసెదిరీని నేడు! వొలలో
వొన్నేల సేపలు సూడ!
కొంపలో కుంపటికాడ—కునుకు
కోడలు ఆసతో సూడ! యె తరా వొల!!

అభిసరణ

సఖుని గాంతునే! ఆహా సఖుని గాంతునే!

నీలిమబ్బు మేలిముసుగులో
తేలిపోవు తారానారినై
తరువు తరువు వెనుక తారుచు
అడు గడుగున నూహ లూరుచు
ఆహా సఖుని గాంతునే
మోమున చిరునవ్వు మొలకలో
మ్రోల నిలిచి తీయపలుకులో
మైమరపున మధువు లొలుకగా
ప్రేమడోల నోలగింపగా
ఆహా సఖుని గాంతునే! ఆహా సఖుని గాంతునే!

కృష్ణజననం

భువననేత శాంతిదాత
పురుషోత్తము డవతరించె
పృథివీతలి నెట యెట యెట ?
మధురానగరి !—యెట యెట
మధురా నగరి !

ఆశాహృదు లోలలాడె
ఈరేడు జగాలు
అలవైకుంఠ మిలా తలి
కవతరించె నెట యెట యెట ?
మధురానగరి !—యెట యెట
మధురానగరి !

జగతీప్రజ కిక అంధతమో బంధన తొలగు ననుచు
ధర ధర్మదేవతకు స్వేచ్ఛాసుగతులు కలుగు ననుచు
వసుదేవదేవకీదేవుల వరములు పండె ననుచు

గలగల మని యూడిపడెను కరచరణశృంఖలాళి
చరచర మని తెరచుకొనియె చెరసాల ద్వారపాళి
ఎడ యెడముగ పాయ విచ్చి యమునానదీమతల్లి
శిశువుతోడ వసుదేవున కొసగె త్రోవ రేపల్లె!
దూరమాయె దూరమాయె
దురహంకృతి నిరంకుశత !
ఇలాతలిని ధర్మపరత
నెలకొన్నది యెట యెట యెట ?
మధురానగరి !—యెట యెట
మధురానగరి !

బృందం:—అల వైకుంఠపురంవారం! మేం
శ్రీమహావిష్ణు పరివారం!

గరుడ:—అందమైన రెక్కలూ
అనంతమైన వేగము గల
గరుడుడ నేనె!
శార్ఙ్గధనుష్పాణి జగము
లేలే తిరుగు తేరు నేనె!
దేవరాక్షసుల పోరుల
విష్ణువాహనము నేనే!

బృందం:—అల వైకుంఠపురంవారం! మేం
శ్రీమహావిష్ణు పరివారం!

సుదర్శనం:—కృష్ణుని తర్జని కేంద్రముగాగ
గిరగిర తిరిగే చక్రము నేను!
మధ్యందిన మార్తాండునిపోలె

మహాతేజమున మెరయుదు నేను
సముద్రమథనపు సమయమునందున
అనేకాసురుల హత మొనరించిన
కృష్ణుని తర్జని కేంద్రముగాగ
గిరగిర తిరుగు సుదర్శన మేను!

బృందం:—అల వైకుంఠపురంవారం! మేం
శ్రీమహావిష్ణు పరివారం

శార్ఙ్గము:—శార్ఙ్గము నేను
కురంగపు వంపుల సొంపుల ధనువును నేను
వైకుంఠేశ్వరుడౌ శ్రీమహావిష్ణువు ధరించే
సుందరధనువును నేను
స్త్రీవలె తోచియు పురుషుని
ధైర్యముతో చెలగుదును
రథ గజ తురగ పదాతుల
రాక్షసబలము లడంచిన
వైకుంఠేశ్వరుడౌ శ్రీమహావిష్ణువు ధరించే
సుందరధనువును నేను!

గద:—హరి ధరించు గద నేను!
కౌమోదకి నా నామము!

సరయూనది మథించితిని !
చంపితి ఘోరాసురులను
హరిధరించు గద నేను !
నా నామము కౌమోదకి !

పాంచజన్యం:—భం భం భం, భం భం భం, భం భం,
పాంచజన్యమును నేనే !
పాలకడలి జన్మించినతోడనె
శ్రీపతి ముదమున చేపట్టెను నను
నా నాదముతో దేవవైరులకు
నాశ మ్మొదవును రణాంగణమ్మున
భం భం, భం భం, భం భం, భం భం,
పాంచజన్యమును నేనే !

ఖడ్గం:—నందకమను ఖడ్గమ్మును
న న్నెదిర్చి రణమ్మందు నాశమ్మే పొందుదురు !
తలచినతోడనె విష్ణుని కరమ్మంటి మెరయు నేను
నందక మను ఖడ్గమ్మును !

బృందం:—అల వైకుంఠపురంవారం !
శ్రీమహావిష్ణు పరివారం !

ఆ మహావిష్ణు వవతరించె, లో
కావనార్థమై వ్రజభువిలోన !
మేమంతా గోగోపజనమై
అనుసరించెదము విష్ణునిసేవ !

అల వైకుంఠపురంవారం !
శ్రీమహావిష్ణు పరివారం ! !

* వైతాళికగీతులు

మేలుకో స్వప్నలోకరాజ్ఞి మేలుకో
చా లింక నిదుర శాక్యరాజ్ఞి మేలుకో
నిశాతమస్సులు నిరాసములై నశించెనులే
దిశాంతభూమిని ఉషఃకామిని హసించెనులే
స్వాంతమ్ముల శాంతహిమధునులు వర్షించెనులే
అంతరమున నఖిలవిశ్వమును హర్షించెనులే

---

* రాగల 20 పాటలు బుద్ధచరిత్రాత్మకమైన దివ్యజ్యోతినాటికనుండి.

మాయాదేవిస్వప్నం

నిద్రాముద్రితవు కమ్ము
సార్వభౌమినీ !
విశ్వజ్యోతిష్మతీ ప్రమోదయామిని
స్వప్నలోకచ్ఛాయావీణా
సమ్మోహాననిస్వనాలు
పర్వదిశల విస్తరిల్ల
సార్వభౌమినీ
విశ్వజ్యోతిష్మతీ ప్రమోదయామిని

* * *

విహరింపవె మారాణి
మోహన
నిహారపథ సోపానపాళిపై !
అలసనిమీలిత సుందరనయనా !
పులకిత సకలాశామృదుశయనా !
మహనీయాశయ కాంచనసదనా !

విహసన మధువర్షాంచితవదనా !
విహరింపవె మారాణి !

మోహన

నిహారపథసోపానపాళిపై
విహరింపవె మారాణి !

ప్రబోధము

చైత్రజీవచైతన్యము గొను మీసారి
మర్త్యశరీరీ!

ఆర్తిహాలహాలధారీ!
ఆనందసుధక్రోలు మీసారి!
శాంతతరళశుభకాంతిలో
చందనానిలభ్రాంతిలో
ప్రాచీదిశ నరుణరోచిలో
ఆశా లసదమృతవీచిలో!!—
అఖిలేశ్వరమా తేజస్సే
నకలలోకైకమా వర్చస్సే
శాక్యరాజ్ఞిగర్భమునందు
జ్ఞానరవియై జనన మొందు!
చైత్ర జీవచైతన్యము గొను మీసారి!
మర్త్యశరీరీ!

ఆర్తిహాలహాలధారీ!
ఆనందసుధక్రోలు మీసారి

వైతాళికగీతి

మెరయు దిశాముఖ మే మన్నది యే మన్నది?
మరుగు సుషశ్శిఖ యే మన్నది ?
తెలివివెలుగులో శతసూర్యచ్ఛవి
మెలగనీని తేజము కలుగు నని !
పొరలు సాగర మ్మే మన్నది యే మన్నది ?
కెరలు చకోర మ్మే మన్నది ?
చలువవెలుగులో శతచంద్రప్రభ
తొలగద్రోయు తేజము కలుగు నని !
ఎరగు హిమశిఖర మే మన్నది యే మన్నది ?
కరగు గిరిఝర మ్మే మన్నది?
ఎడదలోతులో హిరణ్యగిరినే
కడకు ద్రోయు తేజము కలుగు నని !
విరియు పంకజ మ్మే మన్నది యే మన్నది ?
ఉరలు పరాగ మ్మే మన్నది ?
వలపుబరువులో అమృతభాండమునె
తలపనీని తేజము కలుగు నని !

గౌతమబుద్ధుని జననం

ప్రమదావని కింశుకసాలము
కకుబంతస్పృత మృదుకిసాలము
కమనీయ సురభిసుమజ లము
హిమశీకర సించితమూలము

కింశుక పర్ణచ్ఛాయాకుంజములోన సంపూ
ర్ణాంశుమతి రాణి స్వర్ణతర్దికపైని
విశ్రమించి నయనముల సుధారుచు లెసగ కన్నది
అశ్రమమున అఖిలేశు నంశమౌనిసుఁగు !

* * *

కలలు ఫలియించి జగతి వెలిగించు సుతుడు రాణికి జనించె
మలయానిలము లలఘి లుంబినీవనము నందనమై మించె
మాధవీలతిక వలపించి ప్రోవులై పూచె కోటపైని
బోధితరుశాఖ పులకించి మొలకలై లేచె తోటలోన !

* * *

రాజసౌధ మజరావనము !

రమ్యమానంద కాననము !

దివ్యశరీరులు తిరోహితులై చరించిరి

దిక్పాలకులు సువర్ణడోలిక వహించిరి !

రాణిని సూనుని రాచనగరు చేర్పించిరి !

కానికలను దీవెనల ననల నర్పించిరి !

రాజసౌధమజ రావనము !

రమ్యమానంద కాననము !

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

అసితముని ఆవేదన

అసదృశ తేజోవర్తి!
శిశుమూర్తి శిశుమూర్తి!
అఖిలము వెలిగించు జోతి వీవె నీవె నీవె!!
కనగా గలిగితి నిన్నమరకమలినీ సుధానీ!
జరాభరితుడనే నేను
వినగలనే యిల శాసనములా
నీ మృదులభాషల మధురకలస్వని
కిసలయారుణమ్మౌ నీ
మసృణ చరణతలమున నను
పొరలనీ! తరలనీ!
చింతారహితముగ సుప్రశాంతియుతముగ
నా వయోజీవిక నిక మరలనీ
సురుగనీ! పరలోక మ్మరుగనీ!
యువమానవ భావిమార్గవ్యక్తీ!
భువినవతారమా స్వర్గశక్తీ!
అసదృశ తేజోవర్తి!
శిశుమూర్తి! శిశుమూర్తి!

ఏనాడో యేనాడో

ఈ నాడె కాదు ఇం కే నాడో యే నాడో
ఈ గాలి నెరుగనే నేను?
ఈ నేల తిరుగనే నేను?
మనసు నలరించు కమ్మని గాలు లివి యవే
తనువు సొలయించు చల్లని దారు లివి యవే!
ఈ నాడె కాదు ఇం కే నాడో యే నాడో
ఈ గాలి నెరుగనే నేను?
ఈ నేల తిరుగనే నేను?
ఎరుగనే వీరు నా బంధులు! వీరు నా బంధులు!
మనసు కలిసియు కలియకుందురు
సరస నిలిచియు నిలువకుందురు!
ఎరుగనే వీరు నా బంధులు! వీరు నా బంధులు!
ఈ నాడె కాదు ఇం కే నాడో యే నాడో
ఈ గాలి నెరుగనే నేను?
ఈ నేల తిరుగనే నేను?

స్వయంవరం

కామదేవు కొలువున వలపుల
రేకలను విరియు ప్రసవాలమోయి
కనవోయీ ! కనవోయీ !
ఓ మధుపాయీ ! కనవోయీ !
హృదయములో కస్తురులో
మది నలలౌ చంచలలో !!—
పువుశరాలు మైమరచెనో !
యువహరిణి దెసలుపరచెనో !
పరువిడు వలపుల ప్రసవమ్ము నెటుల
బహుమానింతువో భ్రమరకుమారా !
మదనవిశిఖలకు మెరుగగు విరి నెటు
బహూకరింతువో భ్రమరకుమారా !

సోమరిపాట

ఆమని పొంగులో
అలరులేమ ముసుంగులో
సోమరిగాయకుండు
నే డేమని పాడెనో, బ్రదుకు
నేమని పాడెనో,
ఎందుకని—సౌందర్య మెవరికని!
కమ్మనైన విరిముసుంగు చాయనే
వేడిర క్తమ్ము చిమ్ము కంటకమ్ము గాయమే!
ఎందుకని—సౌందర్య మెవరికని!
ఆకటి బాటలో
అలము చీకటి తోటలో
సోమరిగాయకుండు
నే డేమని పాడెనో! బ్రదుకు
నేమని పాడెనో,
దుఃఖమ్మని—సౌఖ్యమ్ము దూరమ్మని!

బ్రదుకు తెరువు నరయు ప్రాణి గొంతులో
బెదరి యుసురు వదలు నల్పజీవి జాలి వంతలో
దుఃఖమ్మని—సౌఖ్యమ్ము దూరమ్మని !
ఆమనిపొంగులో
అలరు లేమముసుంగులో
సోమరిగాయకుండు
నే డేమని పాడెనో, బ్రదుకు
నేమని పాడెనో !

భ్రమర ప్రబోధము

భ్రమరా! ఓ భ్రమరా!

సిరులతెరలలో పొరయు నిరులలో
ఒరగు మనికి చాలులే చాలులే

మేలుకో వేల, మేలుకో వేల
భ్రమరా! ఓ భ్రమరా!

చెలిమికలలో వలపుటలలో
కరుణతెలిసి మేలుకో మేలుకో

చాలు లే నిదుర, చాలు లే నిదుర
భ్రమరా! ఓ భ్రమరా!

* * *

భ్రమర ప్రబోధము

భ్రమరా! ఓ భ్రమరా!
సుమభవనము విడుమా!

మర్త్యజీవిత మ్మున నే మనుకొన్నావు?
ఆర్తస్వరమో భరమా నిశ్వసనమ్మో
ప్రలయశ్రుతియో సంతత హింసారతియో

భ్రమరా! ఓ భ్రమరా!
సుమభవనము విడుమా!

దేశదేశముల ప్రమోదలేశము కానము కానము!
ఆశ లరయు నయనమ్ముల రాలిన వర్షులు అశ్రులు!
అంతఃపుర మేల ప్రణయ సంతర్పణ మేల లెమ్ము!

భ్రమరా! ఓభ్రమరా!

చితిజ్వాల

రగిలి మండెను చితిజ్వాల !
ఎగసి యార్చెను దహనకీల !

మేడలో వాడలో తోటలో బాటలో
ఆడుతూ పాడేటి కునుకుతూ కుళ్లేటి

తనువు మండెను చితిజ్వాల !
కనలి యార్చెను దహనకీల !

వలపులో వంతలో ఆసతో ఈసుతో
ఎగురుతూ గెంతేటి వగచి వగపించేటి

తనువు మండెను చితిజ్వాల
కనలియార్చెను దహనకీల !

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

ఉజ్జ్వలప్రభాతము

అమలహృదయ కమలాకరా !
సకల వికలజనార్తితమోహరా !
నిద్రారహితములౌ నీ నేత్రమ్ములవలెను !
హిమార్ద్రములౌ దిశల నరుణరాగమ్ము ప్రబలెను!
అదిగో ! ప్రథమ శకుంత మనోహరగానమ్ము !
అదిగో ! ప్రాసాదాంగణఘంటాధ్వానమ్ము !

ప్రస్థానము

ఈ యిరులుచీల్చుకొని యే వెల్గు పిలిచెనో
యేగుమోయీపథికుడా !

యిలు వీడి

సాగుమోయీ పథికుడా !
ఏ కొసకు సాగేవో ఆ దెసనె ప్రోగాను
ఆశాప్రశాంతకిరణాలు !

వాగౌను

అమృతవాణీపురాణాలు !
ఇరులలో కడలంట మఱుగు తారలు మింట;
మనుజహృదయాల పెనుమంట

కలదంట

కనలు నీకనుల కొనలంట !
జగములోపలి వంత మనసులోపలి చింత
తొలగింప నీ యాత్రకంతు !

యుగయుగ

మ్మిలను జన్మింప నీ వంతు !
ఈ యాత్ర వల దంచు నెవరు పలికేవారు ?
ఎవరు ని న్నాపగలవారు ?

లోకాని

కెవరు సంతాప మావారు ?

వి యో గి ని

హృదయేశ్వరు డెందు పోయెనో యిక
నేనాటికి నిందు రాడుగా !!—
బ్రదు కంతయు వంతపాలుగా, ఏ
పాపమ్మున కింత శాపమో !!—
ఎదలోపల నొదిగియున్న కోరిక
లెపుడే నెరిగింపనై తినే !
ఇపుడే యవి పొంగి కూలి చీలిక
లై పోయిన వేమిసేతునో !!—
అరవిచ్చిన పారిజాతమాలిక
సురమం దొకగడెయు తాల్పడే !
తడి యారని దాని యూర్పు వేడిమి
వడి సుసిగాఁజాల నేలనో !!—
హృదయేశ్వరు డెందు పోయెనో యిక
నేనాటికి నిందు రాడుగా !!—

వైతాళికగీతి

పాలపుంత పర్వతముపై వ్రాలి పవ్వళించినదిలే
నాలవజా మింక భూమిపయి చిరునవ్వు నుంచినదిలే !
వేగుజుక్క ఆశ లల్లు చూడ్కుల వేసటలో
రాగశాటి యోసరిల్లు అంచుల బాసటలో
పాలపుంత పర్వతముపై వ్రాలి పవ్వళించినదిలే
నాలవజా మింక భూమిపయి చిరునవ్వు నుంచినదిలే !

విరాగగీతం

శ్రుతులు సమముగా బిగించి
నదింపు మోయీ విపంచి! ..... శ్రుతులు

మనోహరమ్మగు హాయలుతో
అనేకరీతుల లయలతో
వినూత్న గీతులు సాగవో
వియోగతంతులు వీగవో! ..... శ్రుతులు

తీగ శ్రుతి మించి లాగిన
సాగకె రాగ మాగునే!
తీగ శ్రులు బిగి సడలిన
మూగయై రాగ మడగునే! ..... శ్రుతులు

* * *

విరాగగీతం

గడ్డిపువ్వు సుఖము
నీకు కలదా మానవుడా!

ఎండగాడ్పులందు గాని
వాన వరదలందు గాని
మంచుజడులయందు గాని
చింత, చీకు, వంత, వాదు
సుంతయేని లేని చిన్ని ॥గడ్డి॥
చిన్నిపూవుపైని యెగురు
సీతాకోకచిలుకయేని
హాయిగా క్రొంజివురులందు
కూయుచుండు కోయిలేని
సొగసు వెరచి సురిగిపోదు
బ్రదుకు వెరచి పారిపోదు
జ్ఞానీ మానవ నీకె తగుర!
గడ్డిపువ్వు సుఖము
నీకు కలదా మానవుడా!!—

బోధిమహీజం

ఆశాంతర చుంబితకాంతిలో
వాసంతికా మధురభ్రాంతిలో
శకుంతలోక సురభూజము !
సుప్రశాంతము బోధిమహీజము !
బోధితరుచ్ఛాయాస్థితుడౌ గౌతముడు
ప్రపంచ
బాధాశమన విభాకర తేజోధనుడు !

*ఒక్కడవే!

ఒకరయినా నీకేకకు ఓ యని రాకున్నా
ఒక్కడవే బయలుదేరు!
ఒక్కడవే బయలుదేరు
ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే బయలుదేరు!

ఓరీ ఓ అభాగ్యుడా,
ఊరంతా భయంచేత
గోడవైపు తిరిగి మాట
లాడకుండ నిలుచున్నా
మనసు విప్పి లోలోపలి
మర్మ మేదో కంఠ మెత్తి
నీకు నీవె చెప్పవోయి!

ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే బయలుదేరు!

---

*రవీంద్రుని ఏక్‌లాచలో అను గీతమునకు అనువాదము. మహాత్మునకు నవఖాళీలో ఈగీతము ప్రబోధానికి సహాయపడింది.

ఓరీ ఓ అభాగ్యుడా
ఊరంతా ని న్నొంటిగ
కారడవిని వదలి, తోడు
గా యెవ్వరు రాకున్నా
ముళ్లదారి తొక్కిళ్లకు
కాళ్లు నెత్తురే చిమ్మగ
నీ వొకడవె నడువవోయి!

ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే బయలుదేరు!

ఓరీ ఓ అభాగ్యుడా
ఒకరైనా నీ ముంగిట
కారుమబ్బు కాళరాత్రి
దీపమైన చూపకున్న
పిడుగుమంట కాల్పులోన
పడి మండే నీ గుండెల
ఒంటిగానె వెలుగనీయి!

ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే బయలుదేరు!

1444

శరత్పత్రావళి

MEMORIAL
R.NARI A
. P. R. I
c. No.
MANDIRA
145

146

ఆగమనము!

చల్లగాలిలో యమునాతటిపై
శ్యామసుందరుని మురళి!
ఉల్లము కొల్లగొనే మధుగీతులు
మెల్లమెల్ల చెవి సోకు నవే!
తూలి రాలు వటపత్రమ్ములపయి
తేలి తేలి పడు నడుగు లవే!
పూలతీవ పొదరిండ్లు మాటుగా
పొంచి చూచు శిఖిపింఛ మదే!
తరువు తరువు కడ డాగి డాగి న
న్నరయు కన్నుగవ మురుపు లవే!
మురిసి మురిసి నా వెనుక దరిసి కను
మూయు చివురు కెంగేళు లివే!

విభావరి

ఓ విభావరీ ! ఓహో విభావరీ !

నీహార హీర నీలాంబర
ధారిణీ, మనోహారిణి !! ఓ విభావరి !

నీ చంచల చేలాంచల
నిభృత్వ స్వప్నసీమలలో
ఏలా భయచ్ఛాయాజాల
మేలా సౌఖ్యరోచిర్లీల !! ఓ విభావరి !

సంతత శాంతతరంగిణి
మదభరయువకురంగిణి
ఏలా యలసగమనమ్ము
ఏలా నవవిలసనమ్ము ! ! ఓ విభావరి

ధరణీతలచంద్రశిలా
తరళమంటపమున నిలిచి
యుగములుగ పరిభ్రమింతు
వగమ్యుడౌ యెవని వలచి !!
ఓ విభావరీ ! ఓహో విభావరీ !

నళిని - పవనుడు

ఆమె:—కుంజవని మధుర మంజులగానము
మందపవనుడా నీదేగా

అతను:—మంజులగీతీ మరందస్రోతము
నళినీ నీదే గాదా !

ఆమె:—మృదులగీతముల మదరావములో
హృది పొంగింతువు పవనా !

అతను:—నీ మృదులపత్రములమదమాధురిలో
మైమరపింతువు నళినీ !

ఆమె:—ప్రణయ సరసి తేలుదమా

అతను:—ప్రణవ మరసి సోలుదమా

ఆమె:—యువకవరా !

అతను:—సుమరమణీ !

ఆమె:—అనిలసఖా !

అతను:—కమలినీ ప్రియసఖీ !

ఇద్దరు:—అనురాగాంబుధి నలరుదమా
ఆనందాంబుధి మునుగుదమా

శరద్దీప్తి

పసిడి మబ్బుల ముసుంగులో
పాలవెల్లి హారంగులో
తళుకుమెఱుపుల తీవె లై
వెలుగు నాశాజ్యోతులు!!

కడలి కెరటముల ఆటలో
పొడియిసుక పొరల పాటలో
మలయపవనముల ఈలలో
చెలగు నాశాడోలలూ!!

తరులతాళి మలిపూతలో
పరదేశిపికపు తొలికూతలో
విరతిలేని మాఱుమ్రోతలో
వినెద నాశాగీతులు!!

సంధ్యాదీపకళిక

స్వామీ నీ యాలయమున
సంధ్యాదీపకళిక నోయి !! స్వామీ !!

అలలై తావులవలలౌ మలయపవనములలో
తెరలౌ నీ తీయని ఊపిరితేనెల సోనలపై
తేలి సోలి పోదునోయి !! స్వామీ !!

ఝుంఝూనిలగతిలో
తావకతాండవత్ పదఝుళంఝుళన విరుతిలో
హృదంజలి కంపిలిపోవగ
ఊగి తూగి పోదునోయి !! స్వామీ !!

ఘనతమోవివృతనిశీథి
వనపథాల దిగులు మిగులు
అభిసారిక నయనయుగళి
కాశాజ్యోతి నౌదునోయి !! స్వామీ !!

LIBRARY

విరహిణీ దృగంచలాల
తరళాశ్రుకణాలలో
మెరసినపుడె చెలిమికలలు
విరియ ధన్య నౌదునోయి !! స్వామీ !!

లోకావలి పెన్నిద్దురలో తోగిన వెనుక
పెంజీకటి కవ్వలవెలిగే నీకాంతి సుధాస్రవంతిలో
కరంగి పోదునోయి !! స్వామీ !!

స్వప్నజగతి

స్వప్నజగతిలో ఛాయావీణా
సమదశ్రుతు లెవో సాగునవే !! స్వప్నజగతిలో !!

అంతరాళమున వింతరంగు లెవో
అలసాలసములై అలమునవే !
రెప్పపాటులో కోటికోటిశశి
రేఖలాశలకు యేగునవే !! స్వప్నజగతిలో !!

కల్పనాకృతులు కథలు కథలుగా
కదలి మెదలి చెలరేగునవే !
జన్మజన్మగతస్నేహమాధురులు
ఝురులు ఝురులుగా మూగునవే !! స్వప్నజగతిలో !!

జాడజాడలుగ జరిగిపోవు నా
నీడల నా ప్రియు డేడో !
గురుతు వైచికొని, కన్ను మూయగనె
జరిగిపోవు నే నీడో !! స్వప్నజగతిలో !!

జాజి - తుమ్మెద ✓

చల్లగాలిలో పూలతోటలో కొల్లలైన వలపులలో
కన్ను విచ్చి చిరునవ్వు నవ్వినది సన్నజాజిపూ వొకటి !!
దారినిబోయే తుమ్మెదబాలుడు దగ్గరగా నిలిచాడు !
సన్నజాజివిరికన్నె చూపులో తనచూపులు కలిపాడు !!
సన్నజాజివిరికన్నె యెడదలో తేనెజల్లు కురిసింది !
తుమ్మెదబాలుని కన్నులలోపల వానవిల్లు మెరిసింది !!
తుమ్మెదబాలుడు జుమ్ముజు మ్మనుచు రమ్మర మ్మనగసాగె !
సన్నజాజివిరికన్నె సిగ్గుతో చివురుజొంపమున డాగె !!
తుమ్మెదబాలుడు నమ్మకమునకై తోటయే సాక్షిగాను
బాసల నెన్నో చేసినాడు విరిబాలకు మోదముగాను !!
జాజివిరివలపు తేనెల వానల జడులలోన తడిశాడు !
జాజిపూవుపై మోజుతోడనే రోజు లెన్నో గడిపాడు !!

*ఆశ్వసనము

శతపత్ర సుందరీ! అతిలోక
సౌందర్య బంధురీ!
యౌవనసరసి - మదభరిత
జీవితలావణ్యము లొరసి
ధగధగ మెరసి - శతమృదుల
దళములుగా విరిసి
వెలసితే, చెలిమి కలలలో
అలసితే, సొలసితే,
తరుణారుణ నవరాగమంజరీ!
భ్రమరకంఠకలగానవాహినీ!
భంగసార్ద్రహృదయాంజలీ!
సుందరీ! ఓ సుందరీ!

---

*రాగల తొమ్మిదిగేయాలు శతపత్ర సుందరి నాటికనుండి.

అస్తమయము

ఇనుడు కొండ దిగెనా అయ్యో,
దిగెనా అయ్యో, దిగెనా ?
నా వలపుల చేకొనకుండ,
నా పిలుపులనే వినకుండ, కొండ
దిగెనా అయ్యో, దిగెనా ?
యుగయుగాల దినదినంపుమోసము
ఓర్వగలనో యెన్నినాళ్లో యీగతి
నగవుపాలుకాదె నాదు జీవిక
కనులు తెరచి కలువ చూచెనే ! !
ఇనుడు కొండ దిగెనా అయ్యో,
దిగెనా అయ్యో, దిగెనా ?

కీచురాలు

హాయి హాయి హాయి
రేయివచ్చెనోయి!
తెరలు తెరలుగాగ యిరులవే
పొరలి వచ్చెనోయి!!
కలుగు కలుగు తలుపు తెరవరే
తలలు పైకి చాపరే!!
కీచు కీచు మంటు రెక్కలూ
రాచి రాచి పాడరే
కాలు తీసి కాలువేయరే
గంతు వేసి తేలరే
ఎరక పరచి యిరులలోపల
ఎగిరి యెగిరి పోవరే!!

విరహిణి

తిరిగి, తిరిగి, తిరిగి యేలనోయి
ఈ రేయి యేలనోయి ! !
మరిగి మరిగి మరిగి తరుగు
నాదు నెడదపైని తెరగ ! తిరిగి తిరిగి!

పడమట కను నిలిపి నిలిపి
బడలి దిగులు వడుదు,
సడలి వ్రీలునో, నా
ఆశామృణాలహారావళి ! తిరిగి తిరిగి !

సురిగిపోయె లోన, తేనె
పెరలు,తరుగ దిక దాహము
ఒరగి, ఒరగి, ఒరగి, కలల
బరువు నిదురలోనపడుదు ! తిరిగి తిరిగి !

జాబిల్లి

జాబిల్లి వస్తున్నాడు
వెన్నెల్లు కాస్తున్నాడు
కళ్లెత్తి చూస్తున్నారా !!
తూర్పుకొండపైనే
ప్రాకి వస్తున్నాడు
చూస్తున్నారా ?
ఓ జక్కవపులుగుల్లారా !
ఓ చక్కనిచుక్కల్లారా! రారే! రారేమర్రా !
తేలుదామా వెన్నెలన్
వ్రాలుదామా కొలనుతిన్నెలన్
విరాళి సోలే పద్మరాణి
ఇదే పోయి చూదామా !!

జోల

జోజో సఖి ! నిదురపోవే సఖి !
నూరు రేకుకన్ను లొక్కసారి మూసి హాయి!
తేరు తేటనీటి యలల డోల నూయ లూగవోయి !
జోజో సఖి ! నిదురపోవే సఖి ! !
నిదురలోన నీ యాశలు కదలి రెక్క లొదవునోయి
విదలించిన రెక్క లెగసి చదల తేలి మెదలు హాయి ! !
జోజో సఖి ! నిదురపోవే సఖి !
వెలుగు తెరల చిమ్ముకొనుచు మబ్బు తెరల చీల్చుకొనుచు
కలలలోకములను కోరికల చెలువల కలిసియాడు
జోజో సఖి! నిదురపోవే సఖి !

స్వప్నలోకము

స్వప్నలోకము ! స్వప్నలోకము !!
రంగురంగు వెల్గుతెరల చిత్రలోకము !!
పొంగి పొరలు వెన్నెలలో, చుక్కలసాగరములో,
ప్రోవు లౌచు తావు లౌచు, చేరి చేరి చెదరిపోవు !!
ఫలియించని ప్రేమలో తరించని మాధురులో
పండి విరిసి అలసిన నీ గుండియ చల్లగా నిమురు
స్వప్నలోకము! స్వప్నలోకము !!
రంగురంగు వెల్గుతెరల చిత్రలోకము !!

గగనయానము

సరసి విడిచి యెగయుదునో !
నే నెగయుదునో ! నే నెగయుదునో !
సరస సరస వెన్నెలతరగలు న న్నొరయ !
పై మి న్నరయ !

నూరురేకులూ తేలితేలి తెరచాపలై పైకి సాగు !
తొడిమరేకులే గాలిని కిందికి వడివడి త్రోయగ సాగు !!
వెన్నెలప్రోవులు క్రిందికి క్రిందికి
క్రొన్నన తావులు పైపైకి !
తారామండలి క్రిందికి క్రిందికి
నూరురేకులూ పైపైకి !—
పైపైకి ! పైపైకి ! పైపైకి ! పైపైకి !

మేలుకొలుపు

మేలుకొనవె శతపత్రా !
శతపత్రా ! శతపత్రా !
అరుణ తరుణ కోమలగాత్రా !
అలసమీలితాయతనేత్రా !
ఉదయకాంతు లొదవెను కనవో !
హృదిని విరిసి మధువు లొలుకవో !
శతపత్రా ! శతపత్రా !
కుక్కుటతతి మేల్కొలుపు లవే !
మధుపమాగధుల పిలుపు లవే !
సౌధసౌధ ప్రాంగణసీమను
స్వర్ణపతాకల తళుకు లవే !
మేలుకొనవె శతపత్రా !
శతపత్రా ! శతపత్రా !

రొద

రొదసేయకె తుమ్మెదా, రేగి
రొదసేయకె తుమ్మెదా !!
చెలిని నిదురింపగా నీయదే, నీ రొదా !
రొదసేయకె తుమ్మెదా !!
విరివలపని బ్రమయకే
పొందామర తళుకని మురియకే
చెలియూపిరి తీపికి సొలయకే అలయకే !! రొదసేయకే !!
హాయిగ నీ అరమూయు కనులలో
ఆడు పాపలే నీ చెలులా !
తీయన్నైన పెదవి యెఱుపులో
తేరు తేనెలే నీ కలలా !! రొదసేయకే !!
వింజామర వేయవె—చల్లని
విరిగందము భరియించు రెక్కలతో
వింజామర వేయవె !
కంజానన యిపు డిపుడే ఆ
కలల లోకమున చెలగెడివేళ !! రొదసేయకే !!

కొండకోన

కొండకోనలో కుంకుమము
శతకోటిరాశులై తూలె !
సెలయేటిపాయలై మేటిచాయలై
పాటలీకుసుమవాటియై !! కొండకోనలో !

అవనితలమునకు, ఆకసమునకు
అందమౌ కెంపుబాటయై
నవగంధలహరి, నా
నందఝురు లలము
మందపవనముల పాటయై !! కొండకోనలో !

పొదరు పొదరునా గుబురు గుబురునా
కదలు పులుగుగమి కూతలై
ఆలమందలను తోలుకొనెడు గో
పాలుని వేణువు మ్రోతలై
మధురీతులై మంజులగీతులై కొండకోనలో !

సెలయేరు

కవి:—రా, సెలయేరా! రా, సెలయేరా!!

జలజల ప్రవహిలు సెలయేరా, సెలయేరా!
కలకల నవ్వుచు చిందుచు
కులికే కన్నెపిల్లవలె రా, సెలయేరా!!
రా, సెలయేరా! బిరాన, రా సెలయేరా!!

సెలయేరు:—వస్తాను నేను వస్తాను, న
ర్తిస్తూ బిరాన వస్తాను!
తొలిమెరపు నడక ఒయ్యారంతో
తెలిమంచు చీర సింగారంతో
నా కలల తేనియలయూటలతో చిరు
యెడద రొదచేయు పాటలతో
వడవడ వణకించే మంచుశిలల
అడుగున తడబడుతూ వస్తాను!
తళతళ మెరయించే గులకరాల
గలగల పరువులతో వస్తాను!

ప్రతిశ్రుతి!

ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతిశ్రుతీ!!
ఏటివార తోటలో తాటితోపు తలలనూపు
గాలి తీయ పాటలో
ఆకుపచ్చ చేలవెన్ను లల్లలాడు ఆటలో
నీపాటె విందునే! నీమాటె విందునే!
ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతిశ్రుతీ!
వవలురేలు కొనలలో పాతకోట బురుజుపై
పలికించు నగారలో
దెసలు మారుమ్రోయ మ్రోగు దేవళంపుగంటలో
నీపాటె విందునే! నీమాటె విందునే!
ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతిశ్రుతీ!
దారికాని దారిలో ఆకసమ్ము నంటి నిల్చు
కొండల నడిలో లోయలో
ఒంటరైన బాటసారి ఓ యన ఓహో యన
నీపాటె విందునే! నీమాటె విందునే!
ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతిశ్రుతీ!

కృ:—కోప మేల రాధా ! దయ
చూప వేల నాపై !
రా:—మోసగాడవోయీ ! పలు
బాస లేల చాలునోయి !
కృ:—బాధ కలుగు చాల ! అప
రాధ మేదొ సైప వేల ?
రా:—అపుడె మోసగించి, తిరిగి
యపుడె సైప మందువోయి !
ఓరి మెంతవరకో, నీ
నేర మీవె తెలియలేవొ !
కృ:—ప్రాణసఖుడ గాన, నా
యాన, నను క్షమింపవేని !
నేర మేదొ తెలియా, నే
నేరనైతి చెలియా !
రా:—రాతిగుండె నీది ! ఎన్ని
రాత్రు లయ్యె నన్ను వీడి

వార్తయైన లేదు—నాదు
ఆర్తి నీకు తెలియలేదో!

కృ:—కలత వీడు చెలియ! నీ
వలపు దక్క వేరు తెలియ!

రాధికాప్రియుండె, యీ
మాధవు డని విశ్వ మెరుగు!

రా:—కల్ల లెన్ని పల్కినావో?

కృ:—ప్రతిన నేతు నమ్మలేవో?

రా:—ప్రతిన లెన్ని సల్పినావో!

కృ:—ప్రాణసఖీ పదములాన!
వదలను క్షమియించుదాక!

రా:—మాధవ! అపరాధము నీ
రాధను నీవే క్షమించు!

కృ:—రాధారాణీ!

రా:—మాధవదేవా!

ఇద్దరు:—రాధామాధవప్రేమా
రామము బృందావనము
రాసక్రీడామనోజ్ఞ
ధామము బృందావనము!

వెన్నెలరేయి

తార: కన్నుల కింపా వెన్నెలరేయి
వన్నెకాడ వెవరోయి !
చేసన్న సేతు వెవరోయి

చంద్ర: అందమైన యీ చంద్రనాకలో
నావికుండనే చెలియా !
నీ ప్రేమికుండనే చెలియా !

తార: నున్నని చెక్కిలి వెన్నెలకన్నా
మిన్నయై మెరసె నేలా !
నా కన్ను లిటు విరిసె నేలా !

చంద్ర: వెలుగుముద్దలో వెన్నపూసతో
మలచినారు నను చెలియా !
నిను వలచినాడనే చెలియా!

తార: అందమైన నీ చంద్రనాకలో
ఎందుకుతిరుగుదువోయీ !

చంద్ర: చుక్కలలోపల
సుందరివా నీ
పొందుకోసమే చెలియా !

తార: నన్ను చేరగా
తెన్ను నీ కెవరు
తెలిపినారోయి సఖుడా !

చంద్ర: మినుకు మినుక నీ
మెరయు నీ చూపె
దారిచూపెనే చెలియా !

తార: నన్ను చేరగా
ఎన్ని నాళ్లుగా
తిరుగుచుంటివో సఖుడా !

చంద్ర: యుగయుగాలుగా
పగలు రే యనక
పయన మైతినే చెలియా !

తార: నావలోకి రా
నీవో, నా కింత
తావు చూపవో సఖుడా !

చంద్ర: నావ నీదె గాదా! చెలియా
నావ నీదె గాదా!
నీవె నడపవే చెలియా! నావ
నీవె నడపవె చెలియా!

ఇద్దరు: కన్నుల కింపొ వెన్నెలరేయి
అందమైన మన చంద్రనౌకలో

చంద్ర: ఒరగిపోదమా సకియా!
తార: కరగిపోదమా సఖుడా!
ఇద్దరు: కన్నుల కింపొ వెన్నెలరేయి!!

మబ్బుకన్నె - మలయపవనుడు

మబ్బు: మలయపవనా ! మలయపవనా!

కొండదాపునసుండి లేచి
కొంటెచూపులు చూచి చూచి
గుండెలోపలి కోర్కె లేవో
గొంతుముడిలో కదలియాడగ
ఏల యీలలు పాడుదోయి !
ఎవరికై నడయాడుదోయి
మలయపవనా ! మలయపవనా !

మలయ: మబ్బుకన్నే ! మబ్బుకన్నే !

నీదు వలపుల జడులకోసము
నీలిదారుల కొండకోనల
నీటిచాలుల తేలిపోతూ
నింగి నీలపుచాందినీకడ
నిలిచిచూచెదనే - ఓ మబ్బుకన్నే !

మబ్బు: తోటతోటల బాటబాటల
యేటికెరడుల పూలకన్నెలు
తేనెసోనల కాన్క లీయరో !
నా దరికి రానేల నోయీ !
మలయపవనా ! మలయపవనా !

మలయ: మబ్బుకన్నే ! మబ్బుకన్నే !
కానుకలుగ గడించినాడను
తీయదనముల వెన్నొ బరువై
పోయె - చల్లగ నేద తేరగ
నీ తుషారము కోరినానో!
మబ్బుకన్నే ! మబ్బుకన్నే !

మబ్బు: నా తుషారపు వజ్రహారము
నాదు మెరపుల వలపు జడులను
నీకు కానుక లిత్తు నంచును
నీకు తెలియున? నీకు తెలియున !
మలయపవనా ! మలయపవనా !

మలయ: మబ్బుకన్నే ! మబ్బుకన్నే !
నాకు తెలియును ! నాకు తెలియును!

నిలిచి నీ నీలాలమేడ
నీలిదారుల నొడలు మరచి
నీ వెవరి నెదురుచూచెదవో !
నన్నె కాదా!! నన్నె కాదా !
మబ్బుకన్నే ! మబ్బుకన్నే !

దినాంతము

దినాంతమ్ము కాగా వనాంతమ్ములందు
ప్రశాంతరుణచ్ఛాయ లంతర్హితాలై
దిశాంతావకాశమ్ము తాకెన్ తమమ్ము
నిశాకేశపాశమ్ము ప్రాకెన్ నభమ్ము

అన్వేషణ

యమునాతీరవనములో ప్రముదిత
శ్యామల జలధరఖేల!
మధుర మధుర మృదుమురళీలోలన
గోపికామోహనలీల!! యమునా!!

మదులకోరికలు మెదల
బెదరుచూపులే కదల
వెదకుదు రేమది నదిలో
జలముల శ్యామలతనువో!! యమునా!!

నీట మునుగు వసనాలా
నింగి తేలు జలదాలా?
తొంగిచూచు నయనాలో
వంగి ప్రాకు చరణాలో!! యమునా!!

మనమిద్దరమే

ఇద్దరమే, మన
మిద్దరమే !

నీలిబైలి లోయలలో
పాలవెల్లి పాయలలో
చేయి చేయి కలిపి, హాయి
హాయి నొక్కటై పోదము !

ఇద్దరమే, మన
మిద్దరమే !

పాలవెల్లి బిరులు దాటి
పాలరాతి గవను దాటి
ఆలోకపు పొలిమేరల
తేలి ఒక్కటై పోదము !

ఇద్దరమే, మన
మిద్దరమే !

తెలిమబ్బు తెరలలో
నెలవంకదో నెలో
వలపుటుయ్యాలలో
కలిసి ఒకటౌదమా !

ఇద్దరమే, మన
మిద్దరమే !

ఎందుకో !

ఎందుకో ! పున్నమ !
ఎందుకో ! వెన్నెల !
ఎందుకో ఈ జగ
మ్మంత నే డీహాయి ! ! ఎందుకో ! !
ఇందుకా నా హృదయ
మెగసి పాడేందుకా !
విశ్వహృదయమ్ముతో
ఐక్య మందేందుకా ! ఇందుకా ! !
అమృతవీణాహృదయ
గలిత దివ్యశ్రుతులె
ఆశాశ లెల్ల బ్ర
హ్మాండాలు నిండినవి ! !
నా గళమ్మును వీడు
కళ్యాణిరాగమ్ము
నా వీణపై లోక
కళ్యాణమా నేడు ! ! ఇందుకా ! !

ఇందుకా నాహృదయ
మెగసి పాడేందుకా !
విశ్వహృదయమ్ముతో
ఐక్య మందేందుకా ! ఇందుకా !!
ఎందుకో ఈ జగ
మ్మంత నే డీహాయి ! ఇందుకా ! !

మెట్లవరుసలు

మెట్లవరుసలు మెట్లవరుసలు !
మెట్లవరుసలు మెట్లవరుసలు !
గగనసీమలు కాలపరిధులు
గడచిపోయే మెట్లవరుసలు !
జీవితమునకు మరణమునకూ
ఈవ లావల కదలు వరుసలు !

మెట్లవరుసలు మెట్లవరుసలు !
మెట్లవరుసలు మెట్లవరుసలు !
కుడి యెడమలే కానరాని
తుదిమొదళ్లే తోచబోని
మెట్లవరుసలు మెట్లవరుసలు !

స్వప్నమధువుల జడులలోపల
స్వాంతమున జ్ఞాపకపుపొరలు !
పొరలలోపల తెరలు తెరలుగ
పూర్వజన్మ ప్రేమకథలు ! !

మెట్లవరుసలు మెట్లవరుసలు !
మెట్లవరుసలు మెట్లవరుసలు !

జ్వాలాతోరణం

జ్వాలాతోరణం !
నీలాకాశ ఫాలతలాన తేలే
జ్వాలాతోరణం !!
దశదిశలను కాంతి
వెలుగుల కావల పలవించు అశాంతి
కలకలలాడే మృదులాననములపై
తళతళతళ మను మధురభ్రాంతి !
జ్వాలాతోరణం !!
తెరలు తెరలుగా తరలెడు పొగలు
పురులు పురులుగా విరియుచు
వెలిగెడు దీపపుసెగలు !
అరులు వెలికి పరువు లిడగ
ఇరుల తరిమి తరిమి వెలుగు !
జ్వాలాతోరణం !
నీలాకాశఫాలతలాన తేలే
జ్వాలాతోరణం !!

౨. దిబ్బా దిబ్బా దీపావళి
మళ్లీ వచ్చే నాగులచవితి !!
మిన్ను మన్ను కలకల కలకల మని
మెరసి వెలుగు వెన్నమతాబా వెలుగు రవ్వలూ
ఓహో ! వెలుగు రవ్వలూ !! దిబ్బా !!
కన్ను చెదర మిలమిల మిలమిల మని
మిన్ను లలము చుక్కనవ్వులో కాకరపువ్వులూ
ఓహో ! కాకరపువ్వులూ ! దిబ్బా !!
సన్న తాచు చరచర చరచరవలె
మిన్ను దూసి వెలుగు టేరులా తారాజువ్వలూ
ఓహో ! తారాజువ్వలూ ! దిబ్బా !!

3. కను డదే - కను డదే
కడప గడపను ప్రమిదవెలుగులు
కను డదే కను డదే
కడల నడలెడు ఇరులపరుగులు !
కడప గడపను ప్రమిదవెలుగులు
ఘనఘనా ! ఘనాఘనా !
ఘనఘన మనుచు దిశలు పలికెను !
ధనధన ధనధనా !
ధనధన మనుచు సిరుల నొలికెను
ఘనఘన మనుచు దిశలు పలికెను

జైత్రయాత్ర

కేల కేల గోగు కాగడాలతో
విశ్వ మెల్ల వెలుగు నగుమొగాలతో

కడప గడప గడచి రారే!
వీథి వీథి వెడలి రారే!!

కేల కేల బాణసంచాలతో
దిక్కు లెల్ల ప్రేలు పటాకీలతో

నడుముకట్టి నడచి రారే!
బడలిక నేమరచి రారే!!

మదమత్సరకోపమ్ముల
అదిమి వేయ నొకేసారి
ప్రగతి నడ్డు దానవాళి
పగ లడంప నొకేసారి

రారె రారె యువకులార!
రారె రారె యువతులార!!

దీపావళి వెలుగు చూపి
తిరుగులేని ప్రేమ చూపి
శాంత్యస్త్రము సంధించుక
సమరసాప్తి కొకేసారి

రారె రారె యువకులార !
రారె రారె యువతులార ! !

కేల కేల గోగు కాగడాలతో
విశ్వ మెల్ల వెలుగు నగు మొగాలతో ! !

ప్రతిజ్ఞ

ప్రతిహస్తము కాగడా ధరిస్తాము !
ప్రతివత్సరమ్ము ప్రతిజ్ఞ చేస్తాము ! !

గోగుల కొమ్మల రెమ్మల కొసలందు, మా
ప్రతిజ్ఞలే జ్యోతులుగా వెలుగొందు ! !

చెరకువిండ్ల చివరల్లో దీపికలై మా
ఆశయములె మెరయునుగా మాధురులై ! !

అర్కసహస్రపు కిరణావళిపోలు ! మా
కోర్కులవెల్లుల గోగుకాగడాలు ! !

దేవత్వమునకు విజయోత్సవ మిదియే
దానవత్వమున కపజయ తరుణ మిదే ! !

దీపావళి

ఇంటింటీ ముంగిటా ఒలికేటి నవ్వులే
దీపావళీ ఓహో దీపావళీ !

కంటికాటుకలోన మెరపూలపువ్వులే
దీపావళీ ఓహో దీపావళీ !

ఒడినిండా నగలుండే ఒయ్యారినడకలే
దీపావళీ ఓహో దీపావళీ !

జడుపు గిడుపూలేని సంబరాల ఒడుపులే
దీపావళీ ఓహో దీపావళీ !

చెడుగంతా చీకట్లయి మంచంతా వెల్తురయే
దీపావళీ ఓహో దీపావళీ !

చెడుగూ చీకటి పోయీ మంచీ వెలుగూ నిలిచే
దీపావళీ ఓహో దీపావళీ !

*అంజలి

అంజ లిదే పుష్పాంజ లిదే
అనంగదేవ! ప్రణయాధిదేవతా!
నీ శుభాగమనలీల! మా మధురాశాడోలా!!
చివురుపతాకాలు! కోకిల బాకాలు!
వలపుల పవనాలు! చిలుక విమానాలు!
ప్రసూన మధురతలై! ప్రణయజీవలతలై!
భువి నామని దిగిన వనాలు! నవమనోజ్ఞసునందనాలు!
అంజ లిదే! పుష్పాంజ లిదే!
ఓహో! ఓహో! నవవసంతసఖ! మన్మథా!
ఓహో! ఓహో! కుసుమసాయక! మధువ్యథా!

---

* రాబోవు అయిదూ అవంతిసుందరినాటికాగీతాలు.

రాజహంస !

రావో రాజహంసమా !
శీఘ్రమైన నడకలతో !! రావో !!
తెలిరెక్కల అంచులే
మెరయు పైడిమించులై
కులుకుచు మెడచాపుచు
తరణి వౌచు తేలవో !! రావో !!
జననాంతర సౌహృదాల
సందేశము లిత్తువో
ఈమృణాలహారము నీ
పాదములకు తోరమోయి !!
రావో రాజహంసమా !
శీఘ్రమైన నీడలతో !!

* * *

రాజహంసకులతిలకా ! సెలవోయీ సెలవోయీ !!
ఏ జన్మపుదో నీ స్నేహస్మృతి !
మా కేళీవని చేరితివా !! రాజహంసకులతిలకా !
మాతృదేవి పిలుపున పోవుదు నో
మదహంసా మన్నింతువుగా ! రాజహంసకులతిలకా !

* * *

ఇంద్రజాలగీతాలు

౧ రావోయీ వైనతేయా

కాలగండభేరుండ ! గరుడా ! విషనాగహారా !!
కొండశిఖరినుండి లేచీ, నిండుగ రెక్కలను చాచీ,
అశనిపాత మట్లు భూమి ఆకసము ప్రతిధ్వనింప
కాళరాత్రి శిరోజాల పాయగా,
నిబిడఘనాఘనముల పెనుచాయగా,
రావోయీ వైనతేయా !!

౨ హ్రీం హ్రీం, హ్రూం హ్రైం

దిగు ! దిగు ! మహేంద్రజాలీ ! మాయామహాంకాలీ !
కనులకు ఇరులతేరే మాయాజాలము !
ఇరులకు వెలుగుపారే మాయాజాలము !
మనసుకు మరపుతెరే ఐంద్రజాలము ! దిగు ! దిగు !
జల్లుజల్లులై సభికుల కన్నుల చల్లవే ! చల్లవే !
చల్లవె మాయాకిరణాలు !
అల్లవే ! అల్లవే !...అల్లవె, అల్లవె కాంతివాహినుల
కదిలే ఛాయారూపాలు !

రమ్యాణివీక్ష్య

స్మరియింతురుగా !

స్మరియింతురుగా ! !

తెలియని యే తొలిజన్మనొ

హృదిలో నెలకొన్న వలపులు !

మదిలో ఒదిగిన తీయని తలపులు !

స్మరియింతురుగా !

స్మరియింతురుగా ! !

కన్నారో రమ్యవస్తువులను

విన్నారో మధురగీతములను

పరువులువారే యెడదలు

బ్రహ్మాండము నిండగ

స్మరియింతురుగా !

స్మరియింతురుగా ! !

తొలి పిలుపు

ఎవరు పిలిచినారో న న్నెవరు పిలిచినారో !!
భవసాగరమున ప్రణయతరణిపై
పవలురేలుగా పయనించే న న్నెవరు పిలిచినారో !!
కలకబారె మది, పులక లొదవె నెద,
మరపు తెరలు విడి, తలపులు పొంగగ నెవరు పిలిచినారో
పిన్నవయసులో కన్నస్వప్నములె
కలకంఠస్వనక మ్రమధువుగా నెవరు పిలిచినారో !!

వచ్చే ఆరుపాటలు శిలప్పదికారంలోని కానల్ వరిప్పాటు అనగా 'కడలి వరిపాట' అను కోవలన్ కథను అనుసరించి.

ప్రియోక్తి

సడలనీకు కాంచీదామము! నా
ఎడదలోన వెన్నెల లొలుకనీ!!
వేయివలవంటి కనులతో నా
యెడద కడలిలోతులలో అసువుల
హరియింతువుగా నీ సొగసుతో!!
వింటివంటి కనుబొమల చలనముల
కంటబడిన నా జీవమ్ముల నిటె
హరియింతువుగా నీ సొగసుతో!!
సడలనీకు కాంచీదామము! నా
యెడదలోన వెన్నెల లొలుకనీ!

చెలివలపు

తీయతీయగా చెలి వలపించినదోయీ సఖుడా!

తోటలోని నెత్తావి తెరలలో

బాటపైన అరవాడు విరులలో

తేటతేనెలా మాటలతో - ఎడ

బాటులో వెరగుబాటులో నిటులె - తీయతీయగా!

కడలియలలు విరిగిపడు నాటలో

ముడుగు నిసుకపొర లూదు పాటలో

అణచు నగవులో పులక లెగయగా

తాను కెరలి తిరుగాడు దరులలో

తీయతీయగా చెలివలపించినదోయీ సఖుడా!

చెలిసొగసు, వలపు

తెలియునా చెలియ సొగసు వలపుతీరు లో సఖా !
విరిశరాలు, మరులు నొగులు, చిరుతమీలు, కారు మొగిలు
తరచి చూచి సకియమోము థాత మలచినాడోయి

—తెలియునా

రాగిలువాడినేత్రాలు మ్రోగుకంకణాలు
ఆగియాగి తిరుగ యువకహృదులు మరుగునోయి !

—తెలియునా

శారదపూర్ణిమను చెలగు జాబిలి వెలుగోయి !
పాముకాటు వెరచి యిలకు పరచివచ్చెనోయి !

—తెలియునా

ఇటు లౌ నని యెటు లెరుగుదుము !

ఏటి ప్రియుడో ! ఏటి ప్రియుండో !

తారహారములకు బదులుగా

తలలో వాడినపువు చాలని

వలపు లొలుక పలికిన ప్రియుడే

ఏటి ప్రియుడో! ఏటి ప్రియుండో !

ఇటు లౌ నని యెటు లెరుగుదుము !

బాసతప్పి మోసకారియై

ఆసల నడియాసల జేసి

కల్లగాథలను వినిపించెనె

ఏటి ప్రియుడో ! ఏటి ప్రియుండో !

ఇటు లౌ నని యెటు లెరుగుదుము !

కావేరి!

కావేరి! ఓ కావేరి!
నీ వెంత పుణ్యావతివమ్మ!
నీ వేమి యీసుపడవమ్మా!
వెండిగొడుగు వలివెన్నెలలో, నృప
దండము మెరసే వన్నెలలో, నీ
కేటిప్రియుడో! చోళుడు చేపట్టెను
ఏటికొమ్మ గంగమ్మ!
నీ వేమి యీసుపడవమ్మ!
నీ వెంత పుణ్యావతివమ్మా!
నీ కనుల మీను లాకలిని చెంద
వరుణింపవమ్మ కావేరి!
నాగేటి మంతనము పాట, మేటి
సెలయేటి నీటిరొద పాట, నీ
నీట క్రుంకులిడువారి మంతరము
పాట లొలసి మెలయంగ
నీ విభునికీర్తి వెలయంగ వినుచు

ప్రవహింతువమ్మ కావేరీ !
కావేరీ ! ఓ కావేరీ !
నీ విభుడు నిన్నె ప్రేమించునమ్మ !
నీ వెంత పుణ్యవతివమ్మ !
ముద మగు తుమ్మెదరొదలో కమ్మని
పూవుల ప్రోవులు మెదల,
కదలియాడు మీననయనాలతో
పొదరు, గుబురు, బాట, తోట, చూచుచు,
పరువు లిడుదువు గదమ్మ !
నీ విభుడు నిన్నె ప్రేమించునమ్మ
నీ వెంత పుణ్యవతివమ్మా !!
కావేరీ ! ఓ కావేరీ !

సుమసౌరభం

ఈ సుమసౌరభ మే సురపారిజాతకళికదో !
పెరటిలోని కల్పలతావరసుమమునె మరపించెను !!
ఏకాకి యెడద నే తారక పలుకరించెనో!
రాకేందుబింబ మే మబ్బుపిరుంద నిల్చెనో ఈసుమ !!

అగ్నిమిత్రు డౌ వాయువు నిట్టూర్పుల వలెనె
అగ్నిమిత్రరాజు హృదయ మాందోళితమాయె !
ఈసుమ !

వచ్చే 7 పాటలు మాళవికనాటకముకొరకు వ్రాసినవి.

ఏకాంతజీవిక

ఎద గాయపడిపోయె
సొదతోడ రొదతోడ !!

ఏకాంతజీవనము నే గడుపగాలేను
ఈవియోగము నింక నే నటింపగలేను!! ఎదగాయపడి!!

నా గోడు విని సుంత న న్నూరడింపంగ
ఏనెచ్చెలియు లేదు ఏనెయ్యుడును లేడు!! ఎదగాయపడి!!

నాట్యపరీక్షా

నర్తించు నవె మయూరములు!
ఓహో యనుచు ఓహోహో యను
కేకారవముల క్రిందుమీ దగుచు! నర్తించునవె!!
ధనంధనమ్మను మృదంగధ్వని
ఝుళం ఝుళం మ్మనెడు నూపురస్వని
రాచనగరులో నాట్యాచార్యుల
నృత్యగీతవాద్య ఘోషల
మేఘావృతమౌ వర్షఋతువుగ
భ్రమించినవో మదించినవో! నర్తించునవె!!

ఎందుకో!

ఎందుకో - హృదయమా!
అందని ఫలమునకై ఆశలు!!

అదరు నిదేలా వామనయనము
అందిచ్చునో అనుకొనని శుభాలు
ఎందుకో - హృదయమా!!

పురుష శేఖరుని కంటిని నేడు
వలపు విరియు టేనాడో కన్నుల
కరవు తీరు టేనాడో
ఎందుకో - హృదయమా!!

తెలిసికొనగలేవా దేవా! నీ
దివ్యచరణములె శరణము నాకు!
ఎందుకో హృదయమా!
అందని ఫలమునకై ఆశలు!!

హాక్షాచిత్రణ

కదలకుమా చెలీ! కదలకుమా చెలీ!
కదలిన అలదెడు లత్తుక
చెదరి తూలు క్రింద మీద కదలకు ॥

లత్తుక నలదినపాదము
నొత్తిన కెంజాయ లరసి
మెత్తని విరిదమిరేకు
యెత్తదు తల లజ్జచేత కదలకు ॥

అరుణపదము తాకినంత
మొరడు కూడ చివురింపదో
కరకురాతి యెడదకూడ
కరగి యేరులై పారదో కదలకు ॥

దోహదము

పరపుము పరపుము...చెలీ!
తరువున నీ అరుణపాదకాంతుల
పరపుము పరపుము చెలీ!
వలచుము వలచుము చెలీ! ...నీదు మది
కదలు కోరికలవిరులు ఫలింపగ
వలచుము వలచుము చెలీ!
చరచుము చరచుము చెలీ!...నీదు మృదు
పదముల నీతరు వదరి విరియగా
చరచుము చరచుము చెలీ!

ఎడబాపు

మనోరమణుడె రాగ
కనులార కాంచనైతి!!

పిలుపైన వినగనైతి
మనసైన తెలుపనైతి!!

నా తను వేలో తూలి
నా మానసాంచలాల
మారుత చాలిత సుమలతయో
విచలిత విద్యుల్లతయో
రెపరెపలాడినది, నా
ప్రియు నెడబాపినది!!
మనోరమణుడె రాగ
కనులార కాంచనైతి!!

అశోకదోహదము

ఎత్తె నదే మాళవిక !
లత్తుకపాద మశోకము నొత్తగ
నెత్తె నదే మాళవిక !!
వ్రాలె నదే మాళవిక !
సోలుచు చెలి వకుళావళి కౌగిలి
వ్రాలె నదే మాళవిక !!
తాకె నదే మాళవిక !
అశోకము తన మృదుపదమున నదరగ
తాకె నదే మాళవిక !!
పూచె నహో - అశోక మదే !
రాచకన్నె మాళవిక పదాహతి
పూచె నహో - అశోక మదే !!

కుసుమితాశోకము

విరహశిశిర మరిగె హృదయ
తరుణాశోకములు పూయ
వనములను భువనమ్ములను
నవవసంతమాయె !
కల్పలతికయైనా వర పారిజాతమైనా
పెరటితరువె అమరయశో
మహితధీరలలితునకు
అగ్నిమిత్రు కూర్మిరాణి
యైనది మాళవిక !
అగ్నిమిత్రు నిట్టూర్పుల
అలరును వలపులిక ! !

కలువవలవు

ఓ శశీ! ఓ శశీ!
కౌముదీ విలాసీ!

వలపే నా యాశయమ్ము
వలపే నా జీవితమ్ము
బ్రదుకులోని చీకు చింత
మరచిపోవ వచ్చినాను!!

జీవితంపు దేవళాన
దివ్యమంటపమ్మునందు
నీదు చరణతలము చెంత
అర్పింతును నా యెడంద!!

ఓ శశీ! ఓ శశీ!
కౌముదీ విలాసి!

శశిపిలుపు

కలువా ! ఓ కలువా !!
ఓ కలువా ! సొగసులచెలువా !!
నీలి నింగిపైన తేలు చుక్కకన్నె వలెనె
నీలినీటి సరసిపైన తేలియాడినావా !! కలువా !!

తేరి పారచూచి నన్ను మిక్కిలి
ఏల కెంపు లొలికెదు నీ చెక్కిలి
కానుగదే ఓ చెలియా !
నేను నీకు పరదేశిని !! కలువా !!

మరులు జల్లు చిరునవ్వుల
తనియించితి వెన్నిసార్లో?
నీలి నింగినెలత నొసట
క్రాలెడు నా రేఖవోలె
నీలినీటి సరసిపైన తేలియాడినావా ! !
ఓ కలువా ! ఓ కలువా !!

ఆనందప్రకృతి

ఆకు పచ్చని ఆకు ఆటలో
అల్ల నల్లన సాగు చల్లగాలికి తోగు
చేలవెన్నుల సన్నపాటలో
ఆనందమే చిందునే జీవితపు
టాశలే వెలుగొందునే!!
కలకలలాడే తరులతికలు వలపులు చిలికే
విరితోటలడోలికలో
జల జల జల జల మని ప్రవహిలు సెలయేరులలో
తళ తళ లాడే సొగసుల మెరపులపాలకిలో
ఆనందమే చిందునే జీవితపు
టాశలే వెలుగొందునే!!
ఎడదలు పగిలించే ఎండలగాడ్పులలో
బ్రదుకుల కదిలించే వానలవరదలలో
దెస దెస ఇరులౌ పెనుచాయల కారుమొగిలు!
ఉరుముల ఫెళఫెళలు! మెరపులు తళతళలు!
తరిగిన వెనుకను సన్నని వానలసోనలలో
ఆనందమే చిందునే జీవితపు
టాశలే వెలుగొందునే!!

స్వేచ్ఛ

పాట తెలిసిన కోయి లేమో
బయల స్వేచ్ఛగ యెగరగలిగింది!
పలుక నేర్చిన చిలుకమాత్రం
పంజరంలో యెరక లుడిగింది!

గుమ్మమున వ్రేలాడుచిలుకను
కొమ్మమీదీ కోయి లేమో
కమ్మగా వొకసారి పిలిచింది!
"అడవులంటా తోటలంటా
హాయి హాయిగ యెగిరిపోదా
మోయి నేస్తం రమ్ము ర" మ్మని
తీయగా వొకసారి పిలిచింది!

చిలుక నేస్తం సిగ్గుపడుతూ
యెరక కంటికి అడ్డు పెడుతూ
చిరుతగొంతుక తొణక నిచ్చింది!
'క్రొంజివుల్లా కొమ్మ దిగిరా
పంజరంలో పలుక నేరిచి
పల్లు తింటూ కులుకుదా' మని
కళ్ల చూడకె కబురు చెప్పింది!

'ఇనుపయూచల యిరుకులోపల
యెరక చేపగ తావు లేదే
యెట్టు' లని అడిగింది కోకిలము!
'ఒంటికాలున కూరుచుండగ
మింటిలోపల వూచయే' దని
కంట తడి పెట్టింది కీరమ్ము!

'తోటభూముల హాయిగొలిపే
పాట లించుక పాడవోయీ
అంది పాటలమేటి కోకిలము!
'సరస కూర్చో - నేర్పుతాలే
చదువు లయ్యల పలుకు లెన్నో'
అంది పలుకులకొలికి రాచిలుక!

'పాటలైనా పలుకులైనా
పరులదగ్గర నేర్చుటే' మని
హాయి నెరిగిన పికము పలికింది!
'పాట లేమిటి? తోట లేమిటి?
పాడు టెట్టులు హాయిగా' నని
పంజరంలో శుకము పలికింది!
పాడుతూ పిక మెగిరిపోయింది!!

(రవీంద్రుని గీతి కనుసరణ)

శరదభిసారిక

మధువని కానరావో సఖా ! నీకై
వెదకుచు వేసరిలితిన్ - సఖా - సఖా ! !
రానేలేదో ! ఎందో దాగితివో ! !
మధువని కానరావో !
నలుగడల చీకటాయె దారితోచదాయె
రానేరావో ! మధువని కానరావో !
నీవే పికమై తరులలోన డాగి
కుహు కుహూ యని పిలుతువేమొ పిలుతువేమొ
కుహ కుహూ యని పిలుతువో యీ వనాంతరమున ! !
మరచితివో నీ చెలినే, తలపవేమొ బాసలనే !
మధువనిలో సుమడోలాకేళులలో
తనువుమరచు మోహనగానములోన
సురనదీజలములన్ సురుచిరమౌ ప్రణయనావ
సోలియాడరావో వేగమె వనతలికిరావో !

విరిసెనదే కలువచెలి, ప్రియుని కాంచినదో!

చంద్రికలై ఆశామాధురులే వెలింగె!

ప్రియతమమోహనమూర్తిని

కాంచగ నా మనమే చెలంగె!

ఎంతో వేసరితిన్ వనియంతయు నీకై వెదకితి

ఎందుంటివో!

ప్రేమజలధిలో నీదరావో!

మధువనకేళి తేల రావో!

హృదయనావ

చిన్నదోయీ నా హృదయనావ!
సాగరరాజా మెల్లగపోవా!
చూడవోయి నావలోకి నీరుపోరాదోయి
సాగరరాజ మెల్లగ పోవా!!
గాలిరేగి వీచెను నాల్గువైపులా
రాత్రి అంధకారమాయెనే దారితోచదే
ధ్రువతార వెలుగులోన
నావ నడుపుము నీలోన!
సాగరరాజ మెల్లగపోవా!
చిన్నదోయీ నా హృదయనావ!!
తెరచాపా చుక్కాని ఇవి నావి కావుకాని
మనసులోన ఏదో తోచి పడవను వదిలాను!
సాగరరాజ మెల్లగపోవా!
చిన్నదోయీ నా హృదయనావ!!

(రవీంద్రుని గీతి కనుసరణ)

గు లా బి

సంజ నీరెండలోన
కెంజాయ చివురుశయ్య
అలవోక పవ్వళించె
అందాల చెలి గులాబి!!
పొంగారు వలపుబరువున
రంగారు రేకుకనుల
నిండారు తేనెచూపుల
నెలవంక విరిసె నౌర!!
అలసానిలమ్ము వీచె
మన నెల్ల కలచివైచె!
మదిలోన నా గులాబి
వలచి మైమరువనీదె!!

చిత్రార్జునులు

చిత్ర:—ఎవరో నీ వెవరో, నిను గని నా
భవమే మాన్యముగా!
ఓ అసామాన్యవీరా !
ఓ మహామాన్యధీరా !!

అర్జు:—విజయకాంక్షతో విశ్వము తిరిగే
వీరుడ—విజయుడ నో రమణీ !
నాగసతీ ! నీ నవ్యసురూపత
నయనయుగళిధన్యత నొందెనుగా !!

చిత్ర:—నా కనులయెదుట నిలిచిన కాంతిమయుడు
కౌంతేయుండేనా ? నిజముగ కౌంతేయుండేనా
నాకలల దేవళములోనే కొలిచిన కామదేవుడేనా!

అర్జు:—నాగసతీ ! అనురాగవతీ !

చిత్ర:—యోధపతీ ! విజయైకమతీ !!

ఇద్దరు:—యుగయుగమ్ములా తపములు నేడే
సఫలము లాయెనుగా ! !

(రవీంద్రుని గీతి కనుసరణ)

పరిష్వంగము

హాయిగ పాడుదునా సఖీ
హాయిగ పాడుదునా ! !
ఆకసమందున రాకాచంద్రుడు
నా కౌగిలిలో నీ సౌందర్యము
కాంచలేక నా మబ్బులలోపల
పొంచిచూచి సిగ్గున తలవంచగ ?
హాయిగ పాడుదునా ! !
కరమున నొక మధుకలశము నిడికొని
ఉరమున నీ విటు లొదిగి యుండగా
తారాపథమును చేరగ గళమును
సారించుక తీయతీయ పాటలు
హాయిగ పాడుదునా ! !

నిదురపో

నిదురపో—హాయిగా నిదురపో !! నిదురపో !!

కనుమూసి హాయిగా నిదురపో !

నిదురలో కలలలోకమ్ములో తేలిపో !! నిదురపో !!

కలలలోకమ్ములో కనకపీఠమ్ముపై
వలపించు నీరాణి వదనచంద్రికలలో
పొంగేటి క్షీరసాగరములో !!

నిదురపో ! నిదురపో ! నిదురపో !! నిదురపో !!

తరగలై వరదలై ఆకసమ్మటంటుతూ
పొంగేటి క్షీరసాగరములో
వలపించు నీరాణి వదనచంద్రికలవే
చూచుకో ! చూచుకో ! చూచుకో !
వలపించు నీరాణి వలచుకో !!

నిదురపో హాయిగా నిదురపో !! నిదురపో !!

మెల్లమెల్లగ

మెల్ల మెల్లగ మెల్ల మెల్లగ !
ఉల్లమును కొల్లగొనిపోయే !! మెల్ల మెల్లగ !!

దూరదూరము సాగిపోతూ
కరగు గీతిక చరణమో
గాలి అలలను తేలిపోయే
పూలమాలిక తావిమో !! మెల్ల మెల్లగ !!

ఇసుకతిన్నెలు దాటి దాటి
నీలితరగల నీటి అంచుల
గలగ లను మంజీరమో
అంచలమ్ముల నంటి జలజల
రాలు శీకరపూరమో !! మెల్ల మెల్లగ !!

మెల్ల మెల్లగ మెల్ల మెల్లగ
ఉల్లమును కొల్లగొనిపోయే !! మెల్ల మెల్లగ !!

మధురయామిని

మధురయామినీ మానసవీథిలో
నీరవలోకము నిదురకాంచె!!
దూరతీరాలను సాగరగానము
ఉచ్ఛలస్వనుల మ్రోగి యాగె!!
జన్మజన్మల మధురాశయములు
శరదభ్రములై దెసలు ప్రాకె!!
చిరతరుణాశాజ్యోతి తారయై
చీకటి తెరలను చెదరగ తాకె!!
దూరదేవాలయమంగళగీతులు
భువనమోహనములై చెలరేగె!!
చపలచంచలసాగరగానము
సీమాంతరముల కరగసాగె!!
హృదయతంత్రుల ప్రణవమంత్రము
శాంతి శాంతి శాంతి యనుచు
అమరకాంతి కిరణజాలము
మహోదయమ్మని మారుమ్రోగె!!

(రవీంద్రుని గీతి కనుసరణ)

హేమంతపత్రావళి

223

824

చలికారు

చలికారు కౌగిలించె
కొండచిలువవోలె లోకము!
తొలికారు తలుపు చరచె
తెరచుకోదు కరవు వాకిలి!!
మనసందు మసలు పరువులు
వినువీథి నంటలేక
చిరుతగాలి నర్తనాల
జగతి శోభ నందలేక
తల వాలిచి యిల రాలెను
ముదురాకు లవెన్నో!!
నెరవిరు లొదవని తోటల
గళము విడిరాని పాటల
కరవాయె తరుణిమలు
అబ్బురమాయె మధురిమలు
ఇరులందె ఇనుపసంకెల
బరువందె స్వాతంత్ర్యము!
పరమాణువు శకలమ్ముల
భయమందె శాంతి భద్రత!

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

*హరిదాసికీర్తన

తన

అధరసీమపై అనిశమ్ము నర్తించే
మధురమురళి నే నైతినా!

తన

నీలతనువుపై తేలీయాడే
వనమాల యైనా ఐతినా!!
నే నేమి గా నైతి నా స్వామికి!!

సఖీ

విరహిణి రాధనై వీథిని బడితిని
గోకుల మంతా హసియింప!
అదిగో కళంకిని మదనశరాహత
మాధవు ప్రేయసి రాధ అదే—

---

* వచ్చే నాలుగుపాటలూ గోరాశాస్త్రి విషవృక్షంనాటకంకోసం వ్రాసినవి.

అని

నింద పా లయితి నందరిలోనను

మందిరమును విడలేను సఖీ!

నిద్రాహారములు నిన్నటి మాటే
అలంకరణములు అవి యేలే!!

నే నేమి గా నైతి నా స్వామికి!!

జూదరి వేదాంతం

వేరే జూద మెందుకూ?
వేరే పందె మెందుకూ?

ఈజీవితమున కదే అర్థం
పేరే వేరూ.....

ఒక్కసారి తెగించి
సాహసే ర్లక్ష్మి యని
రంగమున కురికేవొ,
గగనాంతరాళమున కెగసిపోయేవొ,
ఖంగుమని మోత మోగేవొ!
ఆ మరుక్షణ మందె
అధఃపాతాళానికే క్రుంగిపోయేవొ!!

వేరే జూద మెందుకు?

ఒక పందెమునకు పాచికలు పేర్చిన
వేరొక పందెము పడునట్లే

ఒక్కదానికై నీవు పరుగులిడ
వేరొక్కటి నీకై వెంటాడగ
ఏ యొక్కరికై నా లభించేది
ఏమిటి పూర్ణానుస్వారమె !
వేరేజూడ మెందుకు ?
వేరే పందె మెందుకు ?

జూదరి వేదాంతం

చూపు దూర మెందుకు ?
చూడు దగ్గరలోనే !
పందెం పారకపోతే
ఉందే కోటివేలురా !!

కొండపల్లంలోన
ఎండవెలుతుర్లోన
ఏదో మెరుస్తుందిరా
ఏదో పిలుస్తుందిరా
దాహపడి నీ రసుకొని
మోహపడి దారినిబడి
దగ్గర చేరంగానే
మాయమవుతుంది !
చూపుదూర మెందుకు ?
చూడు దగ్గరలోనే ! !

మా యైనా మస కైనా
హా యైనా అదు సైనా
దొరికిందే స్వర్గంరా
వలచిందే అప్సరరా
దూర మెందుకూ ?
చూడు దగ్గరలోనే !!

కాలసర్పి

ఆడుదంటే
యేమనుకొంటివో !
చూడ, సుందరి రూపమునందు
ఆడు కాలసర్పము హృదయమందు!! ఆడుదంటే!!

దూరమందుండి చేయెత్తి
పిలిచేటి మోహనరూపం !
దగ్గరైతే అంటక తాకక
ఆడే శాపం ! ! ఆడుదంటే !!

కదిపి
కోపమ్ము సుంతైన రేపితే
పగబట్టి ఉరుకు !
తోక తొక్కడిన తాచై
నిదురింప దెర చచ్చువరకు!!
ఆడుదంటే
యేమనుకొంటివో !

*అనుభవభారము

ఎన్నో, ఎన్నో, ఎన్నో ఫలాల్
ఎన్నో ఎన్నో రుచి చూశాను! ఎన్నో!
దానిమ్మ, ద్రాక్షలు, మామిళ్లు,
నారింజ, లరటులు చూశాను!
మేథస్సు మత్తెక్కించేవి! ఎన్నో!
పారెయ్యి పళ్ళన్నింటినీ
కలిపెయ్యి పళ్లన్నింటినీ
కలిపెయ్యి ధూళితో లేదా
మొలిపించు కాటిలో!—
ఆకలికంటె మధురమైన దేదీ ఫల మదేదీ!! ఎన్నో!

---

*వచ్చే నాలుగుపాటలూ 'బుచ్చిబాబు' 'ఉమర్ ఖైయాం' నాటిక కోసం వ్రాసినవి.

*　　*　　*

ఎన్నో ఫలాలు రుచిచూశాను
అన్నింట మధుర మేదో ఏదో!!
ఆకలి ఒకటే మధురఫలమ్ము
ఆకలి మించిన దేదీ ఏదీ!!

దానిమ్మలు ద్రాక్షలు, నారింజలు,
మామిళ్లూ, అరటులు చూశాను
ఇవి అన్నీ ఏటి ఫలాలో!
ఆకలి ఒకటే మధురఫలమ్ము
ఆకలి మించిన దేదీ ఏదీ?
ఎన్నో ఫలాలు రుచిచూశాను
అన్నింట మధుర మేదో ఏదో!

ఖైయాము తత్వం

ఖైయాముతో కలిసి రావోయీ!
నీవు త్రాగిన మధువు నిజము కాదేని
నీవు నొక్కిన చెక్కిలే మిథ్యయేని
సృష్టి అంతా నిజమటోయీ !! ఖైయాముతో !!

నీ లోని యీ వెల్గు నిలిచి యున్నపుడే
నీ వాంఛితము లెల్ల నెరవేర్చుకోవోయి !
ఆ వెల్గు నీలోన ఆరి చనెనేని
ఏమున్నదోయి! నీవును శూన్యమోయీ!!

ఖైయాముతో !!

హేమంతగానము

మట్టిబొమ్మలను వలచానే !—అవి
ఎట్టి ద్రోహమును చేశాయో !!
పరితాపపు మధువుతోడ
పరిపూతస్మాత్మ నేడు !
లేదు నేడు నాకు వాంఛితమ్ము లేనే లేదు !
నేను ప్రకృతిలోన లీనమౌదు లీనమౌదు !!
ఎండిపోయినది యంబుధి !
ఎర్రపడిన దాకాశము !
అంధకారరాత్రినుండి
అనంతకాంతిలో కలియ
విమోచన మ్మయిన యాత్మ
విశ్వమ్మే నిండి వెలుగు !
లేదు నేడు నాకు వాంఛితమ్ము లేనే లేదు !
నేను ప్రకృతిలోన లీనమౌదు లీనమౌదు !!

ఉమర్ ఖైయాం

సాకీ రావె సాకీ!
ఏదీ మధువు కలశము నింపు!! సాకీ !!

చలికారు చింతావసనము
తొలికారు మంటల విసరుము!
రెక్కల నార్చు కాలవిహంగ
మొక్కింత దూరమె పోవలె!!

సాకీ రావె సాకీ!

కలుగని రేపు గూరిచి అసలు
కలవర మేల సాకీ
గడచిన నిన్న గూరిచి అసలు
తలపగ నేల సాకీ!!

నేడే మనకు
మధువును క్రోల - నేడే సాకి నేడే!!
సాకీ రావె సాకీ!

ఒంటెలపైని పాంథుల గుంపు

ఊగుచు సాగు శూన్యములోకి!

ఒక్కటివెన్క నొక్కటి కాగ

చుక్కలు నేగు శూన్యములోకి!

చక్కని నీదు పెదవులు కలిపి

చల్లగ నన్ను చేరుము సాకి!!

సాకీ రావె సాకీ!

ఏదీ మధువు కలశము నింపు!

సాకీ రావె సాకీ!!

* కలలబేహారిపాటలు

౧ కలలూ బాబూ కలలూ !!

ఎవరైనా ఎవరైనాగానీ
కొనరండీ మహామంచికలలూ !! కలలూ !!

ప్రేమ గనని విరాగుల్లారా !
శ్రీలు పొందని జోగుల్లారా !
అంద మెరుగని అభాగ్యులారా !
కుట్రమనసుల కుత్సితులారా !! కలలూ !!

ఉన్నతపథాల ప్రేమమాధురుల
చిన్నిపూవులో చేర్చిన అందం,
పున్నమజాబిలి వెన్నెల వెలుగే
చిన్నికెరటమున చిందే అందం,
ఒక్కకేశమున విశ్వమ్మంతయు
తొక్కి యుంచు నవయౌవనపందం,

---

* 'బుచ్చిబాబు' నాటికకోసం వ్రాసినవి.

అన్ని అందముల అరచేతుల్లో
స్వర్గముచేసే తియ్యని కలలూ!! కలలూ!!

వ్యక్తులపై అధికారము నిచ్చే
శక్తి కలలు కావాలా?

విరక్తివల్ల కర్మసన్యాసమూ
ముక్తికలలు కావాలా?

పిల్లా, మేకా, కొంపా, గోడూ,
భూమీ, పుత్రా, నగలూ, నట్రా
అన్నీ యిచ్చే యెన్నో కలలూ!!
కలలూ బాబూ కలలూ!! కలలూ!!

అ కలలు కొంటారా! బాబూ
కలలు కొంటారా!!

బ్రతుకె కలయై కలయె నిజమా
కలలు కొంటారా!!

పాడులోకపు బరువు సంకెల
పారవేయ ర దేమి పాపము!!
కలలు కొంటారా!!

అంధులా బాబూ అ దేమో
ఆవరించిన వెలుగె కానరు!!

కలలు కొంటారా !!

కీర్తికాంతకు ఆశపడుదురో

ముక్తికాంతకు మోహపడుదురో !!

అమరులై జగమెల్ల యుగయుగ

మవతరించే కలలు కనరో !

కలలు కొంటారా ! బాబూ

కలలు కొంటారా !!

మ ధు మా య

మ్రోయవే మృదు మురళీ ! హృదయములో మధుమాయా!!
అంతరాళమునకు సాగి అలసగతిని మ్రోగి మ్రోగి
అవశ మౌచు రాలిపడెను ఆశాతంత్రు లవనిపైన!!
కదలికేని లేనిజగము నిదురలోనో నీరవతనో
కారుచీకటులకౌగిలి కన్నుమూసి సురిగిపోయె!!
మరల మరల పిలుచునవే! తరళమధురగీతు లెవో!
రాలిన ఆశాతంత్రులు తూలి కలసి మ్రోయగోరు!!
మ్రోయవె మధుమురళీ!
హృదయములో మధుమాయా!
నీరవరాగజలధిలో
నిబిడనిరాశావధిలో
తేలి తేలి ఉదయించు వెలుంగుల
తీయని యాశల రొదలో!
మ్రోయవె మధుమురళీ!
హృదయములో మధుమాయా!

మంచుతెరల ఆశలు!

నును మంచు సోనలో—తళ్కుమను
తొలుసంజ మెరపులో
వలపించు భావాల అలలలో కలలలో
నీ రూపె తోచునోయి—నా ఆశ
నీ వైపె సాగునోయి!!

సెలయేటి పరువులో—మెరిసేటి
నీరెండ తళుకులో
ప్రణయమే విరహంపు టనలమై ప్రళయమై
నీ వలపె తోచునోయి—నా ఆశ
నీ వైపె సాగునోయి!!

విరిదోట మలుపులో కురిసేటి
పరిమళపు బరువులో
తలపు దొంతరలలో చెలగేటి స్మృతులలో
నీ హాయలె తోచునోయి—నా ఆశ
నీ వైపె సాగునోయి!

లోకాలోకం

ఏ లోకానికి ఆలోకం ?
ఈ లోకానికి ఈ లోకం
ఆ లోకానికి ఆ లోకం
ఈ లోకానికి ఆ లోకం
ఆ లోకానికి ఈ లోకం
ఆలోకాని కొకేలోకం !
ఈ లోకానికి ఆ లోకపు
ఆలోకం తుది పెను శోకం !
ఈ లోకంలో ఆ లోకం
వీలైతేనే ఈ లోకం
లో ఆలోకం ఒకనాకం !
సుఖానందలోకాలోకం !
ఏ లోకానికి ఆ లోకం !
ఆ లోకానికి ఆలోకం
ఈ లోకానికి కాకుంటే

అది యేమో ఒక మాలోకం !

మా లోకానికి మీ లోకం

మీ లోకానికి మా లోకం

ఒక ఆలోకపువయితేనే

ఆ లోకంలో మీకూ మా

కూ ఒకే ఒక్క ఆలోకం !

సుఖానందలోకాలోకం !!

జన్మభూమి

మేలుకొనవో మాదు జన్మభూమీ !
మేలుకొనవో మాదు ఆంధ్రభూమి !
నిద్రా జడత విడవో
దారిద్ర్యతమస్సు లడగెలే !
ఆర్ద్ర మనస్వినీ ! ఆనం
దారుణ భవ్యోదయాన ! మేలుకొనవో
సశ్యామల సుశ్యామల
స్వర్ణపతాకాంచలాలు
తిరుమలేంద్ర కీలసింహ
గిరిమారుతములను తేల ! మేలుకొనవో

గౌతమీ కృష్ణా పంపా
ఘనతరంగ గానములో
కలవిహంగ వైతాళిక
గళశంఖారవము వినవో! మేలుకొనవో

చైత్ర కిసాలయతోరణ
కోమలలసనములో
యాత్రలు ముగిసిన యోధుల
విజయ విహాసనములో
ఆశల వెలుగులలో
నిరాశల పరుగులలో
మేలుకొనవొ మాదు జన్మభూమీ !
మేలుకొనవొ మాదు ఆంధ్రభూమి ! !

నవోదయాశ

నవోదయ మెపుడో! దేవా,
శుభోదయ మెపుడో!!
దహనలకీలలై, ద్వేషము రోషము భువి నిండెగా!!
నవోదయ మెపుడో!!

నీతిహీన సంగరాల నంధకార మాయెనే,
స్వాతంత్ర్యభాను డే విహాయసాన దాగెనో!!
నవోదయ మెపుడో!!

క్రూర మారణాయుధాల ఘోరభయద నర్తన!
ఉదారజీవితాశయాల స్వేచ్ఛావికర్తన!!
నవోదయ మెపుడో!!

ఆరాటమ్మే ప్రాణధనమ్ముల
కరచేతులలో ననుక్షణమ్ము
తీరని పర్యవసానపు పోరాటమ్మా
సదసత్తుల కనిశమ్ము!! నవోదయ మెపుడో!!

ఆశోద్ధతులై జగముల హాత మొనరించే అసురుల
ఉసురుల గొనవో
తరుగని నీ దయ అమృతలహరులై
ఝరులై కురియగ మే మరయుదుమో ! !

నవోదయ మెపుడో ! !

శాంతిశోధ

నడవనిచోటెల నడుస్తా.....
మడిచిన వ్రేలినే మడుస్తా.....
వడి దిరిగే విశ్వంలో.....
సుడి దిరిగే విశ్వంలో!!.....
కడలేని పయనాలలో
కడిచాయి యుగా లెన్నో
తడబడే చరణాలతో
కడలనే నయనాలతో
ముడివడిన చిరుపాటతో
ముడిలేని యెదమూటతో
తడివడిన కనులసొదతో
తడిలేని పెదవిరొదతో
కడిచాయి యుగా లెన్నో
కడలేని పయనాలలో!!

అన్వేషణ

దారిచూపువాడె లేక తరలిపోవాలి
కొండదారులందు వొంటరిగా తడుముకోవాలి
అడవులందు కుంజకుంజ మరసి చూడాలి ||దారి||

చిన్నిచిన్నిగుహలు చూసి లోయలు చూసి
కొండలసెలయేటినీట కళ్లు తుడుచుకోవాలి ||దారి||

విజనసరోవర సువర్ణసోపానములన్
కదలియాడు పైడిహంస బారులలోన
హాయిగ మలయానిలాన నూయల లూగే
కొమ్మకొమ్మ కోకిలమ్ము గూడులలోన
మరపురాని తీయబాధ అరసికోవాలి !
అడవులందు కుంజకుంజ మరసి చూడాలి... ||దారి||

ఆకసమ్ముక్రింద నిలిచి ఏకాకిగ నొక్కసారి
అంతరాంతరముల గాథ లాలకించినాను
పలుకు లెవో నోటినుండి వెలువడినవిగానీ

గగనగర్భమందు కలిసి కరిగిపోయినాయి
తెల్లపోయి ఏకాకిగ తేలిపోయినాను
బ్రతుకంతా కొండలలో పడి తిరగాలి!
అడవులలో కుంజకుంజ మరసికోవాలి!
దారి కానరానిచోట తడుముకోవాలి!
అంతరనేత్రాంచలాల అద్దుకోవాలి!

(రవీంద్రుని గీతి కథసరణ)

ఊరడింపు

ఊరడిలవె ఓ నళినీ! రాణీ!! ఊరడిలవె!!

వెలుగు చీకటులు, పవలును రేయీ
విశ్వరంగమున వేడుక తెరలే!! ఊరడిలవె!!

వాడుకయా తీయని కలవరమున
నేడు రేపు తిరిగి తిరిగి కలుగునె!! ఊరడిలవె!!

రాత్రి లేకయె కలుగునొ వేకువ
వేకువనే నీ కల సఫలమ్మా! ఊరడిలవె!!

దిగు దిగు

దిగు దిగు నాగా!

దిగరా నాగా!! దిగు!!

దిగు దిగు దిగరా నాగా

దిగరా నాగా దిగరా నాగా!! దిగు!!

తెల్లనీ శివునీ మెడలో

నల్లనీ కాలనాగూ

నీవెగా ఓ నాగా, నీవెగా ఓ నాగా!! దిగు!!

నల్లనీ విష్ణువుకూ

తెల్లనీ శేషపాన్పూ

నీవెగా ఓ నాగా, నీవెగా ఓ నాగా!! దిగు!!

వేయిపడగాల నెత్తీ

మోయుదువు భూదేవినీ

మనుషులా ఉసురులంటే మనుసేమో నీకు నాగా!!

దిగు దిగు నాగా !

దిగరా నాగా !

ఓ నాగా దిగరా ! నా తండ్రీ దిగరా !

నీ కోరా విషమూ లాగికోరా నాగా !

ఓ నాగా దిగరా ! నా తండ్రీ దిగరా !!

హింసాయ్ ఉన్మత్త పృథివీ

ధరాతలము హింసోన్మత్తము
ద్వంద్వభావసమరోద్రిక్తము
లోభ జటిలబంధము లడచ
ఘోరకుటిల పంథల నడుచు !
నూతనావతారము నెత్తి
కాతరులగు సకలప్రాణులకు
అభయ మ్మిమ్మహో మహాప్రాణ !
ఆలకింపని మ్మమృతవాణి
విరియనిమ్ము ప్రేమకమలము
చిరమధునిష్యంద మమలము !

ఓయి శాంత ! ఓయి ముక్త !
ఓహో అనంతపుణ్య !

రవీంద్రుని వంగగీతమునకు అనువాదము. ఢిల్లీఅల్లరులలో భంగీపేటలో మహాత్ముని ప్రార్థనలలో దీని వంగమాతృక ఆయనకు సభాసదులకు మనశ్శాంతి నిచ్చేది.

కరుణాఘన ! కావింపు ధరా
తలి కళంకశూన్య !

రమ్ము ! దానవీరా ! రమ్ము !
ఇమ్ము ! త్యాగకఠోరదీక్ష !

మహాభిక్షు ! కైకొ మ్మిదె మా
అహంకారభిక్ష !

దేశదేశముల శోకమ్మును
మోహమ్మును రూపుమాపవో !
ఉజ్వలముగ జ్ఞానసూర్యుడై
ఉదయసమారోహము సేయ
సకలభువన ప్రాణవృష్టియా
అంధజగతి కమరదృష్టియా
ఓయి శాంత ! ఓయిముక్త !
ఓహో ! అనంతపుణ్య !

కరుణాఘన ! కావింపు ధరా
తలి కళంకశూన్య !

స్వార్థవిషాచ్ఛన్నము లగుచు
అపరితృప్తి ఖిన్నము లగుచు
నిఖిలహృదులు ఆక్రందించె
దేశదేశముల రక్తకలుష
గ్లాని తిలకరూపము తాల్చె !

నీ దక్షిణహస్తము చాచి !
వినవీ ! నీ మంగళశంఖము !
వినవీ ! నీ శుభసంగీతము !
నీ సుందరచ్ఛందము !
ఓయి శాంత ! ఓయి ముక్త !
ఓహో ! అనంతపుణ్య !
కరుణాఘన ! దీవించు ధరా
తలి కళంకశూన్య !

అమరగాయకుడు

వృథావ్యథితచరితోద్గాతా !
సుధామధురగీతోద్గాతా !
యుగయుగాలు జీవితపథాన
దగాపడిన జీవుల హృదార్తి
ద్రవమై నీనీగళమున స్రవించు !
హృదయమ్మే నీకు గళమ్మో?
వ్యసనమ్మే నీకు వరమ్మో?
చేతలలో తలపోతలలో
కైతలలో కనుమూతలలో
ఆశలలో ఉడురాశులలో
జోతులకై యెగురుతు పోతా !
ముంగిటి తలుపే వంగిన దయి
యెగురకయే తలపై తగులు!
దిగుచుండగ జోతులు రగులు !
మిగిలేదే యెడదకు దిగులు !
వగపుజీవికల పెనునొగులు !

"పొగిలి లోలో కుములు గాయమె
రగిలిమండెను నీ హృదయము !
ఎగయు నీ యింటిదీపము కొసలె
బుగులుకొని తగులవడె గృహము ! !"

స్మృతిసీమల్లో సైగల్

గేయకారు లెవ రై తేనేం
భావాలకు నీ హృది నెలవై
నీ తియ్యని కంఠ నాళమున
నిస్తుల మధువులుగా రాలాయ్!

రజకినీ ప్రియుడవై పరచి
ఘాతుకలోకము నేమరచి
మధురగీతమాలికతో నవ
ప్రణయసౌధమును నిలిపావు!

"ప్రేయసి వస్తే శ్రావణము
ప్రేయసి లేందే ఏ ఋతువూ
భాసించ" దనుచు పాడేవు!
యువకులకూ విద్యార్థులకూ
ప్రేమికులకు అది వొక వేదం!

"గడచిన దినాలు సుఖదాలై
కలలో తియ్యదనా లవుగా!

దుఃఖంలో ప్రకృతదినాలు
ఒక్కింతయినా గడవవుగా !"
అని ఆలాపిస్తూ నవ్వేవ్,
అది నవ్వో లోకపు కఠినహృ
దయాని కొక సమ్మెటరువ్వో !

ప్రేమికు మార్గ మ్మాజగతిని
కంటకమహిత మ్మన్నావు !
ప్రేమకుఫలిత మ్మాజగతిని
దుఃఖమ్మే అని తేల్చావు !

నీ శక్తిని వినియోగించి
నీ ప్రయత్నమును కావిస్తే
కలిగే సత్ఫలితా లన్నీ
కావిలించుకుంటై నిన్నని
ధరిత్రిమాతను సేవిస్తూ
పవిత్రముగ చాటించేవు !

"చేత్తో నను రమ్మని పిలిచి
కాల దన్ని పొమ్మంటుందా !
చిన్నతనం అయితే మాత్రం
హృదయం లే దా అమ్మాయికి ?

అని వాపోతూ నువు దగ్గిన
ఆ దగ్గున ఖంగు ఖంగు మని
మారుమ్రోగుతై లోకంలో
మోసపోవు ప్రేమికహృదయాల్ !"

వీథిగాయకుడవై నువ్వు
చేతులార పైకితెచ్చిన
ప్రియురాలే నిన్ను కాదని
లోకపుషోకుల పాలైతే
నీదుహృదయవల్లకి విరిగి
రోదింపగ కొండలె కరిగాయ్ !

నీ నేర్పినపాటే గొప్పగ
తాను పాడగా సభలోన
తనని మెచ్చువారే అంతా,
నిను చూచేవారే లేరు !
ఏమిటి ఈ అన్యాయమ్మని
ఎలుగెత్తి విలాపించేవు !
సులువుగ బ్రతుకున దగాపడే
కవిహృదయాలను కలిచేవు !

ఆరిపోని దీపపు వెలుగున
కొనవూపిరి నీ పాట వినే
కోరికతో వేచిన ప్రేయసి
దేవలోకసీమల నామెను
రాకుమార్తె చేసినపాట!
గుండెబరువు తీర్చినపాట!
లోకములో ప్రణయజీవులకు
'మరపురాని తీయనిబాధ!'

'దివ్వె జ్వలించా' లని పాడావ్!
నువ్వే ఆరనిదివ్వె వయావ్!
నీ పాటలు మాస్మృతిసీమల
తరిమి తరిమి వలపించే నం
దనవన చందనపవనాలు!
తలపు దొంతరల మెదిలే క
మ్మని కర్పూరపుధూపాలు!

భగ్నప్రతిమ

ఎచట ఎచట శిలకు ముక్తి ?
ఎచట మనుజ హృదికి ముక్తి ?

కళలలోనె కళలలోనె కలదు కలదు శిలకు ముక్తి !
కలలలోనె కలలలోనె మనుజహృదికి కలదు ముక్తి !!
ఎచట ఎచట ?

కడలి అలల బానిసగా గడపి ఓర్మి నేర్చిన శిల
అగ్నిపర్వతంపుగర్భమందు క్రాగి వేగిన శిల
నరుల గగనసౌధముల పునాదిరాయిగా నగు శిల
కెచట ఎచట ?

తరతరాల ఎండ వాన తాకిడుల కృశించిన శిల
యుగయుగాల మనుజపాదయుగళి మోసి అలసిన శిల
కెచట ఎచట ?

'బుచ్చిబాబు' నాటికకోసం వ్రాసినది.

కలలో ప్రణయమధురిమల చవియే మనుజహృదయ ముక్తి!
శిల్పిచేతి ఉలి నర్తనముల విలయము శిలకు ముక్తి!
విరిగిన శకలాల దివ్యవిగ్రహ మౌటదియె ముక్తి!

ఎచట ఎచట శిలకు ముక్తి?
ఎచట మనుజ హృదయికి ముక్తి?

యశోధరవ్యాకులత

ఉషస్సుల శాక్యపురీవనముల
వికసింప మానె తామర లేలో ?
తమస్సు లలమి విన్నవోయె వెన్నెల
రేలను రాచనగర దేలో ?

యశోధరరూపలత
వసివాడెను వ్యాకులత !
నటించు విరాగతలో
మరపించు విషాదతయే ! !

అశేషజీవతతి యార్తి బాపగా
నరిగిన విభు డిక రాడో !

ఆర్తివిముక్తాశేషజీవనుతిలో
తనకును సుఖ మీడో !
యశోధరరూపలత
వసివాడెను వ్యాకులత ! !

పురప్రవేశము

నేడే వచ్చునటమ్మ—నేడేనటమ్మ !
నిర్మలప్రేమతో నిఖిలమ్ము పాలించు
రారాజసుతుడు—శ్రీతథాగతుడు ! !

శృంగాటకాల చివురుల తోరణాల
స్వాగత మ్మిచ్చేటి పారిజాతాల
మధురమౌ భగవానుమందహాసాలు ! !
నేడె వచ్చునటమ్మ నేడేనటమ్మ ! !

అడుగడుగు వందారుకోటిశీర్షాలు
అగరుధూపాల చందనసౌరభాల
అఖిలహృదయాల ఉచ్ఛలసాగరాలు ! !

నేడె వచ్చునటమ్మ నేడేనటమ్మ ! !

మాంచాలా బాలచంద్రులు

౧. ఎన్నాళ్లకు! ఎన్నాళ్లకు !
ఇన్నాళ్లుగ తలవాకిలి యిల్లై తపియించుట
ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు ఈప్సితము ఫలించుట
ఇన్నాళ్లకు నాస్వామిని కన్నారగ కాంచుట
సన్నజాజి విరిసరముల స్వాగత మర్పించుట !
హృదయేశ్వరు ప్రణయఖేలనాల తేల నిత్తునా
కదనమునకు పద మని పదనుక త్తి నందిత్తునా ?
పలనాటికి కాపుసేయ వలపు త్రుంపనేని
వెలయాలికి తులయని నిందలుపడు తలపైని
పతిదేవుని రణదీక్షామతి నొనరించెదనుగాక
క్షితిని వీరపత్ని నన్న నుతి వెలయించెదనుగాక
ఇన్నాళ్లకు నా స్వామిని కన్నారగ కాంచుట !
ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు ఈప్సితము ఫలించుట !

౨. ఎదలో కదలు వ్యథ లేవో కథ లేవో ఇన్నాళ్లు !
ఎరిగింపనా ప్రాణేశా! ప్రాణేశా !

నీ భవ్యరూపమె తలచు
నా భర్మపాంచాలికలూ
నీ శ్రావ్యనామమె పిలుచు
నా శారికాకీరములూ
నీ రాకకోసమె నిలుచు
ఆ రామసుమవల్లికలు
నాయెదలో కదలు వ్యథలేవో కథ లేవో ఇన్నాళ్లు !
ఎరిగింపనా ప్రాణేశా ! ప్రాణేశా !
కాల మ్మొక్కరికోసము ఆకటా
కాచి యుండునది కాదు
రాకరాక వచ్చిన నా విభుడవు
పోక తీరదాయె పాలికలనికి
క్షణక్షణ నిరీక్షణలో నే నిక
మనవలసినదేనా వేదనతో !

* * *

వాలు తాల్చి పోరు సల్ప నేగరే, లీల
వైరి వీరవరుల డీలు పరప నేరరే ! !

ఈ రెండును 'గోపీచంద్' మాంచాలనాటికకోసం వ్రాసినవి.

రుచీదేవి

కృష్ణనృపతి యశోగాథ
రుచీదేవి ప్రణయగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ !

యాదవనాథునికే సరి కృష్ణరాయనృపకేసరి
వైదర్భీదేవి కెనయగును గజపతిరాజతనయ !

పితృపరాభవంపుబాధ
పతిప్రణయమధురగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ !

ప్రేమదూత శాంతిదూత ప్రియుకంఠరవమ్మో,
పితృపరాభవముచేసిన శత్రుకర్కశస్వరమో!
తన హృదిలో తీరెడుకోర్కెల ఆశలపరుగులు,
తన దేశములోన అపజయపు నిరాశమూల్గులు !

పిత్రుపరాభవంపుబాధ
పతిప్రణయమధురగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ !

తన హృదయేశ్వరుని చేరి తా నొకతె సుఖించుటో !
తనవారి పరాభవమ్మునకు ప్రతీకరించుటో !
కలల డోలికల నాథునికౌగిలిని సుఖించుటో !
కల్యాణగృహమ్ము రక్తకలుషిత మొనరించుటో !

పిత్రుపరాభవంపుబాధ
పతిప్రణయమధురగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ !

ధరిత్రీమాత .....

ఓరి తాలుల పెడినావ!
ఓ ధారుణీ! మాతృదేవి!

సంజేకెంజాయ వీవనలు,
క్రొంజివురుగుబురు జోలరులు,
తల్లి, నీ యడుగుదామరలు!

సడిలేని చదలపెన్నిరులు,
కడలేని ముదిమి నిద్దురలు,
తల్లి, నీదారి తెరతెరలు

ఓరితాల్పుల.....
కొన లెగసిపెనగుచీలికలు,
అనలమాలికలనాలుకలు,
అమ్మ, నీహృది వికావికలు!

శివునితలపై కొండచిలువ,
చలువసోనల తెల్లగలువ,
అమ్మ, నీపయి మంచువలువ!

ఓర్మి తాల్పుల.....

చెలగు మృదుమధురస్వరాలు,

పలుకు యువమత్తహృదయాలు,

జనని, నీదు మధూత్సవాలు !

చెడిన కోరికల పాపాలు,

విడిన గుండియల తాపాలు,

జనని, నీగర్భశోకాలు!

ఓర్మి తాల్పుల.....

ధనముగా తూగు ప్రణయమ్ము,

ఘనముగా మ్రోగు వినయమ్ము,

అమ్మ, నీమ్రోల ననయమ్ము !

మేడలే కూల్చు ద్వేషాలు,

వాడలే కాల్చు రోషాలు,

అమ్మ, నీ ప్రకృతిదోషాలు !

ఓర్మి తాల్పుల.....

ఎదకలచు వికలదృశ్యాలు,
మదిచెరచు వికృతలాస్యాలు,
అమ్మ, నీ విచలితాస్యాలు !

ఓర్మి తాల్పుల.....
కొలలేని సౌందర్యపాత్ర,
తులలేని యానందమాత్ర,
జనని, నీ తుదిలేనియాత్ర !

ఓర్మి తాల్పులపైడినావ !
ఓ ధారుణీ ! మాతృదేవి !

రావమ్మా !

రావమ్మా మా తెనుగుతల్లీ ! (అమ్మా తల్లి !)
అమ్మా, రావమ్మా ! తల్లీ, రావమ్మా !
తరలిరావమ్మా మా తెనుగుతల్లీ ! !

ఇరుగుపొరుగూవారి పొరపొచ్చెములు లేక
గతుకుబితుకూ లేని గౌరవపుదారిలో !! రావమ్మ !!

పచ్చపచ్చనిచేల పైటనీడల్లోన
పైడిరవ్వలు కురిసి భాగ్యాలతో మెరిసీ !! రావమ్మ !!

తుంగభద్రా పెన్నా, కృష్ణా గోదావరుల్
నీ తీరమై పొంగి నీ ప్రజల పాలింప !! రావమ్మ !!

తిరుమలేశునికొలువు, సింహాద్రిపతి చలువ
(శ్రీ)శైలవిభుకరుణ, కనకమ్మ దయకలిగి !! రావమ్మ !!

శిశిరపత్రావళి

277

৬৯৩৫৬১৪

278

తృష్ణ

కొండవాలులో కొల నొక్కటి
తళతళ మురిపిస్తోంది !
ఎండ పడినప్పు డల్లా ధగధగ
ఎంతో మెరుస్తోంది !!

అడుగులు తడబడ ఎంతగ పరుగిడి
తరలిపోయినప్పటికీ,
కడుదూరమ్మున కదలదు మెదలదు
కాలి కంద దెన్నటికి !!

దూరము వదలక దారిని మ్రింగే
కొండచిలువ తళుకులో!
చంద్రుని మ్రింగి నెమరువేసుకొను
తమోగ్రహపు బెళుకులో !!

కడపల బారులుతీరిన వెలుగులు
కరిగి సురిగి పోతాయి !

కడల, పైని, లోన, కాఱుచీకటి
కురులు క్రమ్ముకుంటాయి !!
ఎందు కెందు కీ పరుగులు - అందగ
నలవికాని వెలుగులు !
ఎంత గడచినా ఏమి మిగులు, తుద
కంతులేని దిగులు !!

నా వి కా

ఏ తీరమని చేరెదో
నావికా
ఏ తీరుగా చేరెదో ?

తెరువరైనను లేదు
తెన్నైన గనరాదు
పాటిరేవును కాదు
నీటిజాడయు లేదు
ఏ తీరమని .....!

చలనమైనను లేదు
శ్రాంతియైనను లేదు
దరిదాపు గనరాదు
దాటు నావయు లేదు !
ఏ తీరమని .....!

తెఱచాప, చుక్కాని
తిప్పు మాలిమి గనవు !

మన్ను మిన్నును గాల
మానమేనియుఁ గనవు!
ఏ తీరమని.....!

అందమైనను లేదు
హాయియైనను లేదు
ఆత్మదాహము తీరు
ననువు లేనేలేదు !
ఏ తీరమని.....!

ఎగయు భావాలతో
తెగని చింతనముతో
ఎగిరిపోకోయి నీ
ఇలువీడి యెచటికో !
ఏ తీరమని చేరెదో
నాకికా
ఏ తిరునా చేరెదో ?

పోయిన స్వర్గము

పోయినది మన పుణ్యలోకము
పోయినది మన పూర్వనాకము !
హాయిభోగము లడగ మిగిలిన
దంతు దొరకని నరకజీవిక !

మునుల పలుకుల వెలుగు లడగెను !
కనుపొడుచు చీకటు లలముకొనె !
మన పురాతనవీరు లేరోయ్ !
మనదు నాకోద్ధారు లేరోయ్ !
తొలుత శాస్త్రము లెవరు చేసిరో !
తొలుత కావ్యము లెవరు పాడిరో !
తొలుత నాగరకు లెవ రోహో !
ఏడు దీవులు కలయ నేలుచు
నినుడు దిరిగే విశ్వమంతయు
సారగము లూర్ధ్వలోకమ్ములు
చక్క బెట్టిన సార్వభౌములు

వార లేరి? వార లేరి ?
వారిసంతతి వారికేవీ
వారి పూర్వుల జ్ఞానసంపద
వారి పితరుల శక్తిసంపద ?
మాయకలి వచ్చిపడె నెన్నడో
మనము శక్తివిహీను లైతిమి !
కులము లెన్నియొ కుదురుకొన్నవి !
కొలది గొప్పలు నెలవుగొన్నవి !
కత్తు లన్నియు నొరలపై బడె
కత్తులను దాకినవి యొరలును
రెంటి యైక్యమ్మందె యారెం
టింటి సౌఖ్యమ్ముంట తెలియరు !
కలిమి నిచ్చే పసిడిపంటలు
తెలికడుపులను నింపబోవగ
బలిమి గాల్చే కడుపుమంటలు
ప్రభుని కలిమికె యెసరు పెట్టవో ?
రత్నగర్భని పేరు గాంచియు
రాణివాసపు బ్రతుకు బ్రతికిన
అమ్మ యిప్పుడు కాలవశమున
అమ్ము డాయెను పరులపంచను !

వేయలే, దే సవతితో—ఏ
మాయపందెము నెప్పుడైనను
దాయలగు పరులకడ నమ్మకు
తప్పలేదోయ్ మాయదాస్యము !
వైనతేయుల బలము గూరిచి
శ్వేతవాహను జావనోరిచి
స్వేచ్ఛయను నమృతమ్ము కొనితే
సిద్ధమగు నవసరము కల్గెను !
అమ్మ బానిసతనము బాపగ
ననువు వేరే దొరకదండోయ్ !
కోలుపోయిన నాకమునుదో
కొనఁగవలయును గదలి రండోయ్!

(19/8 లో వ్రాసినది.)

రిక్క పాటు

విస్తృతాకాశ గభీరతనుండి
వినీలసాగర గర్భములోనికి
తారక యొక్కటి రాలినది;
బారులుగా జను తోడితారకలు
భారమయిన నిశ్వాసము లెన్నో
హృదయము లద్రవగ విడిచినవి;
రిక్కల పొదిలో కాంతిపుంజము
అగాధభూమిని నిద్రించుటకై
ఇప్పు డిప్పుడే క్షణమాత్రంలో
పోయినది;

తారక లన్నియు తాఱుమాఱయి
తలపుల కోసిన విపులదుఃఖమున
అయ్యయ్యో! అని దీనదీనముగ
ఆర్చినవి!

పడుచున్నది, పడుచున్నది, అదిగో పడుచున్నది!
వినీలవనధ్యగాధములోనికి,
దుష్కర నిశీథగర్భమున ఆ అనంతమగు నాకాశంలో!
ఎన్నడయిన నామృతనక్షత్ర మ్మిరవుకొనున నా హృద
[యమువైని
ప్రశాంతముగ
ఆ యనంతమగు నాకాశమున ఆ వినీలసాగరగర్భమున,
ఆ నిశీథమధ్యమున!!

కలకోసం - కలకోసం

నేనే ఆశాలేశంకోసం కలకన్నానో ఇన్నాళ్లూ,
అవి వట్టికలే ఇంతా చేసి !
ఆ కల కాస్తా కరిగిన వెంటనె
కళ్లు తెరిచి చూస్తాను గదా,
సుఖానికే మొఖం వాచి, ఒడల్ సడలి
ముసలినై కనిపిస్తాను !
ఒక కలకోసం విదంతా ఒక కలకోసం !
చెర్లో బారుమనే కెరటంలా
చెట్టున కట్టుంచా న్నా తంబుర !
మోగదు - మూగది - ఒక సంచీలో
ముడిచి మూట కట్టుంచా నక్కడ,
అంతా కలకోసం ! అబ్బ
ఇదంతా ఒక కలకోసం !
కదలక పరుండు మెదలక పడుండు
పగలబోవు నా హృదయమోయ్ !
బతుకూ లోకం మారిపోయినై,
నాకు నేనె మారా నిది అంతా
ఒక కలకోసం - అంతా ఒక కలకోసం

రతివిలాపం

హే ప్రాణపతీ సజీవివో ?
కనిపింపవె నీ రూపరేఖలే !
ప్రోవై యిల రాలి తూలు ఈశ్వర
కోపానల భస్మరాశిలో !!
రమణీయ శరీర, నీమనోహర
రూప మ్మిటు భస్మమై చనన్
కనుచుంటిని ప్రీలిపోదె నాయెద
కాంతల్ కఠినాత్మలో యనన్ !!
కమలమ్మును నేతు వొరసి పారెడు
కల్లోలినివోలె నొంటిమై
త్వదధీన ననున్ త్యజించితే
క్షణమందే గతసౌహృదుండనై

(కాళిదాసు ననుసరించి వ్రాసినది)

V. R. NARLA MEMORIAL LIBRARY
D. P. R. I.
Acc. No.

చెలిమికతలు

మరపు తెరల చెలిమికతలు
తిరిగి పాడకోయి వెతలు !
తనువు తనువు మెలసిపోయి
ఉనికి బరువే మరచిపోయి
మనికి వలపు లొలుకు కతలు !
తిరిగి పాడకోయి వెతలు !
హృదయవిదారక శరాలు !
మా ప్రేమ కివే వరాలు !
మధురస్మృతు లీ స్వరాలు
విధుర వ్యథ లింక చాలు !
మరపు తెరల చెలిమికతలు
తిరిగి పాడకోయి వెతలు !

(అనార్కలీనాటికలో సలీము విషాదగీతి)

MEMORIAL

ఎవరో హో !

ఎవ రోహో ! ఎవ రోహో !

ఇపుడా నను పిలిచేరు ?

హృది లోలో కలిచేరు ?

పగిలిన హృది శకలాలో

ఎగసిన జ్వాలాకీలో

ఎవరో రగిలించేరు !

ఎవ రోహో ! ఎవ రోహో !

ఇపుడా నను పిలిచేరు ?

బ్రదుకే హాలాహలమై

బరువై కర వయ్యెనే !

ఎవరూ నను మననీరో ?

విషమైనా తిననీరో ?

ఎవ రోహో ! ఎవ రోహో !

ఇపుడా నను పిలిచేరు ?

వచ్చే 9 పాటలు దేవదాస్ నాటికోసం వ్రాసినవి.

జానపదం:

నేతులార వొదులుకున్నావా,
నా యెట్టిబావా,

సిన్నిగుండెలు సెదిరివున్నావా !
నేతులోని సిన్నిపిల్ల సెన్నుమీరిన వన్నెలపిల్ల
నేతులార వొదులుకున్నావా,
నా యెట్టిబావా,

సిన్నిగుండెలు సెదరకున్నావా !
నిన్నే కోరి వొచ్చినపిల్ల కన్నేవలపు నీదో కాదో
కన్నుమూసీ యెరగ నన్నావా,
నా యెట్టిబావా,

మిన్నులె మీదా వొరగకున్నావా ?

నృత్య గీతి : దండోడెదడ - దండోడెదడ

సఖీ ! సఖీ ! మధుపాత్ర
సత్వరముగ కొనితేవే !
మనసున వలచిన ప్రియు డేతెంచెనే
మన గృహమ్ము మధువన మౌచు మించెనే !
మలయవాయువులు వీచె
కలగీతమ్ములు లేచె
రావో రావో సఖుడా !
మధువు క్రోలగ రావో
మధుర మధురమౌ వెన్నెలలో
మల్లెపొదలలే వన్నెలలో
ప్రేమగీతముల డోలికలో
మధువు క్రోలగరావే!!

పదవోయి - పదవోయి

పదవోయి ప్రయాణికుడా !
తలక్రింది మూట చేనిడి వడి పరుగిడి!!
కంటకవనులతో కడు నిండెనోయి దారి
వలలో పడేవు వలపించు పువుల కోరి !!
తలక్రిందిమూట చేనిడి వడి పరువిడి
పదవోయి !!

వలపు తగిలెనా వదలనే లేవు
హృదిలో రగిలే సొద నోర్వలేవు !!
తలక్రిందిమూట చేనిడి వడి పరువిడి
పదవోయి !!

దప్పి

నీటితో ఆరేది కాదే యీ దప్పి
నీటితో ఆరేది కాదే!

నీ ప్రేమజలధిలో ఈదులాడినగాని
తేటినై నీ వలపు తేనెలానినగాని!!
కోరికే తీరనీ తీరకే పూరనీ
గుండె లతికే వలపె మండి దహియించనీ!!
వంతలో సుఖములో వదలనే నీ ప్రేమ
కాటిలో నా యొడలు కాలునాడేకాని!!

నీటితో ఆరేది కాదే యీ దప్పి
నీటితో ఆరేది కాదే!!

మ రు ని ము స ము

మరునిముసము మనదో కాదో
మధు వానవో మధుపా మధుపా!
వడగాలిని వాడునో యేమో
జడివానను రాలునో యేమో
తొంగలి రెప్పల చెంగల్వపూవే
తొంగిచూచె నదిగో కన్నావో!
రేపని మాపని చూడకుమోయ్!
రెప్పపాటుమాత్రమె బ్రదుకోయ్!
మరునిముసమె మనదో కాదో
మధు వానవో మధుపా మధుపా!

జీవితము

జీవితము దుఃఖపూరితము - నేడు !
కడచిన దినాలు సుఖపూరితాలు !
మధురస్వప్నమో మలయమారుతమో !!
దుఃఖపూరితము జీవితము నేడు ! !
నా యనువారే లేనిలోకమున
ఏ యాసయు హాసము లేదాయె
కంటకయుతమై ప్రేమమార్గమే
కల్లోలమై ప్రళయమయ్యెడు
జీవితము దుఃఖపూరితము నేడు !!

పిలరాడు?

నీలమేఘశ్యాము డేల రాడాయె!
తేలిపోయే మేఘమాలికలు నవ్వితే
నీలయమునాహృదయ మేల దిగులొందునో!! నీల!!

తన వేణుగీతిలో ఏల యీ జీర!
అమృతహృదినే ఏరు వంచించి రౌర!! నీల!!

నాదు నెదలో భయములే దిశల ఇరులాయె
లోని ప్రణయము నింగిపైని శశి కాదాయె!! నీల!!

చరమగీతి

మృత్యు వెల్లెత్తి నిను పిల్చుచుండంగ
ఆశతో దేనికై ఆరాటపడెదు ?
ప్రేమతో వెలుగొందు జాలిచూ పొకటి,
పగిలిన హృదయమ్ముపై అశ్రు వొకటి !

బృందగానము

శంకరపదసేవారతుడౌ చంద్రదాసుఁడు
మానసదేవిని దేవతగా మదిని తలపడు !
మంత్రతంత్ర మహిమాన్విత దేవత క్రోధితయాయె!
చంద్రదాసు జీవితము విపత్పూరిత మాయె !
చంద్రదాసు తనయు నిరాశాసాగరమున ఆశానౌక
సుందరసుమకోమల బేహులు విడియచంద్రరేఖ !

వచ్చే ఐదూ బేహులానాటికలోని పాటలు.

యుగళగీతి

అతను : ఇటు తిరుగవో...చెలి పలుకవో
చిరునగవుతో నను దరియవో...
నీలినీలి మేలిముసుగు తొలగనీ తొలగనీ !
బాలచంద్రముఖకాంతి వెలుగనీ వెలుగనీ !

ఆమె : మోము కదిపి కనులారగ కనలే
నే మిమ్ముల అలమునె సిగ్గెలో !

అతను : సిగ్గుతెరలు చీలనీ వ్రాలనీ
చిర్నగవుల వెన్నెలలు తేలనీ !

ఆమె : మనమున తీయనితలపులు రేగునే
మనసుదీర పలుకుదమన పలుకేయాగు నదేలో !
యీసిగ్గేలో !

కాలనాగినీ

రావే కాలనాగినీ, దిగిరావే నీలభోగినీ !

బుస్సూ బుస్సు బుస్సూ బుస్సు మనుచు

నభస్సూ నందుకోవే అందుకోవే !! రావే !!

రెండూనాలుకలు, చండానలశిఖలు

మండీపడగ, పడగచాచవె చేచవే-రావే...

వియోగగీతి

వినోచనా యిక నా సఖా
నీ యమృతవాణి !
కనుతెరచి కాంచలేవో సఖా
కళలేని అభాగిని నీ సఖిని !...వినోచనా !
పలుకాడ నైతినే సిగ్గున నిను
తిలకింప నైతినే !

తొలికలయిక ముగిసెనో ఒక క్షణములో
కంకణ నూపురగానము నీవే !
కుంకుమశోభయు నీవే !
మ్రాను కూలదాలిన తీవనుగద
తునియలుగా వ్రీ లదేల నాయెద !
వినోచనా యిక నాసఖా
నీ యమృతవాణి !

నృత్యగీతి

వినర్తింతునే! వినర్తింతునే
విలోకించునా!
మనోనాథు మంగళమూర్తి
విలోకించునా!
పునర్జీవనోల్లాసముతో!
విలోకించునా!
మనోహరముగ నర్తింప
కాంతునో కాంతుని!
వినర్తింతునే! వినర్తింతునే!
జన్మజన్మములు తానే
మన్మనోనాథు డౌనో!
శాశ్వతప్రణయడోల
జీవితమె మధురమౌనో!

నిశ్చలప్రేమ

కఠినమోయీ కఠినమోయీ
కంటకోపేతము గదోయీ!
ప్రేమికుల మార్గ మీ యిలలోన!
ప్రేమికుల సౌఖ్యాలు కలలోన!!
లోకంపు క్రౌర్యంపు మంటల
లో తపించి నశించు నేది? ... ఏది?
ప్రేమికుల దేహమ్ము మాత్రమ్మె!!
లోకంపు క్రౌర్యంపు మంటల
క్రాగి ఉన్నతి జెందు నేది? ... ఏది?
నిశ్చలప్రేమమ్మె - ప్రేమమ్మె!!

వచ్చే 19 గీతాలు 'సత్య' రచించిన లైలామజ్నూ నాటకంకోసం వ్రాసినవి.

మహల్

మా మహల్ !
మా మనస్సులో మహల్ !
ప్రేమనిర్మితము విశాలమా మహల్ !!
చిన్ననాడె మాదు చిట్టిచేతులు నిల్పిన మహల్ !
మా మధురాశయముల యుద్యానవనమ్మున లేచిన
మా మహల్ !
జన్మజన్మలకు మా సుస్నేహమె జ్యోతులై వెల్గు
మా మహల్ !!
చంద్రవంక సౌందర్యము మబ్బుకన్నె మాధుర్యము
సంజవెల్గు సౌభాగ్యము నర్వకుసుమ సౌరభ్యము
కలిపి తొరిపి నిర్మించిన మా మహల్ !!
మా మనస్సులో మహల్ !
ప్రేమనిర్మితము విశాలమా మహల్ !!

చిచ్చం

మంచు తెరలో కనుల
నించే గులాబివై
నీ గృహద్వారాన
నిలిచావు రాణీ !
నీ హస్త మిడు భిక్ష
స్వీకరిస్తున్నారు
ఎంద రెందరో నీదు
ఇంటి ముందర నేడు !
అందరూ వెళ్లాక
ఆఖరున నే వొస్తె
నే నంచు తెలియకే
పూవు లిస్తావు !
ఈ పూలకోసమా
నా రాక రాణీ !

మేలిముసు గింత తొల
గించి చూపిస్తావో
చంద్రుణ్ణి గేల్సేయు
చక్కనౌ నీ మోము !!
మంచు తెరలో కనుల
నించే గులాబివై !!

ప్రేమ తప్పా ?

ప్రేమయే అపరాధమా ?
ప్రేమ లేకున్న లోకాన ఏ మున్నదో !!
అల్లదే మింటిపై సాగు బుల్బులు జంట
వాటి ప్రేమను కంటగించువా రెవరో?
ప్రేమయే అపరాధమా ?

ప్రేమ నాలో పెరిగి పెద్ద దౌతుంటేను
నేను భగవంతునికి చేరు వౌతుంటాను
ప్రేమయే అపరాధమా ?
ప్రేమ లేకున్న లోకాన ఏ మున్నదో !!

లైలా వీడ్కోలు

అన్నీ మరవ వలెనా ?
అన్నీ కల్ల లేనా ?
కలలేనా యికపైని ?

నా సుఖమ్మై తన సుఖముగ
నా బాధయె తన బాధగ
ఒకరి నొకర మెంత వలచి
యెన్ని నాళ్లు గడపినామె అన్నీ !

తల్లి మరిచి, తండ్రి మరచి,
ఇల్లు, లోక మెల్ల మరచి
లేగులాబి కుటీరాల
లో గడపితి మెన్ని నాళ్లు అన్నీ !

లైలా వీడ్కోలు

సెల వింక సెల వింక సెలవూ!!
ఓ సర స్తీరమ్ములార,
ఓ గులాబిపూ పుటీరమ్ములారా,
సెల వింక సెల వింక సెలవూ!!
గడె వియోగ మె సైపలేడు
కడు బేలహృదయమ్మువాడు
వీడిపోవలె ప్రేమమయుని
ఓదార్పరమ్మ నా ప్రియుని!
ఖర్జూరపవనమ్ములారా,
ఓ గులాబీతావులారా,
సెల వింక సెల వింక సెలవూ!!

మజ్నూన్ విలాపము

గుడారమెత్తివేశారు
కడ కొంటరిగ మిగిలాను
ఎడారిలో నా బ్రదుకే యెడారి కాగ!
నా వలపుల రాకుమారి
తో కలయిక లింకపైని
కలలందేనా? ఆహా కలలందేనా?
చిన్ననాట పాఠశాల
చెట్లనడుమ ఆటలలో
నాటి యిన్ని యేళ్లు పెంచి
నాము మాదు ప్రేమలతను,
పెరికివేయగలదా యీ యిసుకతుపాను
లోకపు యిసుకతుపాను!!

బృందగీతం

పదిల మోహో, పదిల మోహో
హృదయమా, హృదయమా !!
దూరదేశములోని ప్రియతము
చేరబోయే హృదయమా
చెరనిడేవారెవరు ని న్నిక
స్వేచ్ఛ కలిగెను నీదు ప్రేమకు !!

సాగు మోహో, సాగు మోహో
సాగు మోహో, ప్రణయహృదయమ !!
నిన్ను చేరగ నీదు ప్రియతము
దెన్ని కడగండ్లు పడుచుండునో
సాగు మోహో ! సాగు మోహో
సాగు మోహో ! ప్రణయహృదయమ !!

లైలావిశ్వరూపం

ఎందుచూచినగాని నీవు, లైలా
మృతిలేదు ప్రేమ కంటావు!!
వెండియిసుకలలోన తళుకులో నీవు,
పండబారిన సంజ పసిమిలో నీవు,
సన్ననౌ నెలవంక మిసిమిలో నీవు,
మంచులో కనువిచ్చు
మధురమధురమైన
లేగులాబీపూవు నవ్వులో నీవు,

ఇంచు కించుకలుగా
హృదయమ్ము నలరించు
ఖర్జూరమారుతము నీవు, లైలా
ఎందుచూచినగాని, నీవు లైలా
మృతిలేదు ప్రేమ కంటావు!!

తుదిపాట

ఎవని కలియగోరుదువో
ఏడీ అత డేడీ, అత డేడీ !
ఎదుట ఉసురులేని తనువు
ఎవరిది, తనదేనా తనదేనా!
నీ ప్రియునిదే, నీ ప్రియునిదే !

కఠినలోక మేలో మిమ్ము
కలియనీయనైనా లేదు !
బ్రదుకనీయనైనా లేదు ! !

ఈ లోకములో కలయిక లింక లేవు ఇది నిజమ్ము !
పైలోకములో నీకయి ప్రాణసఖుడు వేచియుండు !!

సతీపరాభవం

రుద్రదేవా! మేలుకోవా!
భద్రకాళి అపర్ణ భస్మమాయెను!
నిద్రయా అది తపోముద్రయా
లే! రుద్రదేవా! మేలుకోవా!

సర్వమంగళ నీదు సతి పరాభవ మెట్టు
లోర్తువో! ప్రమథాళి ఆర్తి నెటు తీర్తువో
హే రుద్రదేవా! మేలుకోవా!

ఘోరపాపతమస్సు హోరు మని నాట్యమ్ము
చేయు నీభువి చీమ చిటుకు మన్నటులేని
లేదా హే రుద్రదేవా! మేలుకోవా!

విప్పవా! నీ నొసటికన్ను!
కప్పుదువుగాని కాలానలజ్వాలలో
కలుషపూరిత వసుంధరను!!
ఎత్తవా! నీ విలయపదము!

చిత్తుగా చిందుత్రొక్కుదుగాని ఈ యహం
కార మత్తనిరంకుశాశయుల దుర్జనుల!!
లేవా! హే రుద్రదేవా! మేలుకోవా!

అన్నపూర్ణ!

అన్నపూర్ణా! విశాలాక్షీ! దేవి!
కన్నతల్లీ! అహో! రత్నగర్భ!!

ఆకలను కేక లాకసము తాకె!
చీకటులమూక నల్దెసలు ప్రాకె!
చేరదా! నీ శ్రవోయుగళిదాక!
పారదా! నీ కృపాకాంతిరేఖ!!

అన్నపూర్ణా! విశాలాక్షీ! దేవీ!
కన్నతల్లీ! అహో! రత్నగర్భ!!
చిచ్చులనిశమ్ము పచ్చమొగసాల!
మ్రుచ్చుల వశమ్ము పైడిధనశాల!
వాకిట శిరాలు రాలు పొలికలని!

ఏ కెలన నీ కృపాపాంగకలన!!

అన్నపూర్ణా! విశాలాక్షీ! దేవి!
కన్నతల్లీ! అహో! రత్నగర్భ!!

మూగకంఠాల పిలుపు విన్నావో!

సాగనికరాల సంజ్ఞ కన్నావో!

మరణమో జడతయో లేవలేము!

కరుణ హస్తానికై వేచినాము!!

అన్నపూర్ణా! విశాలాక్షి! దేవి!

కన్నతల్లీ! అహో! రత్నగర్భా!!

హింసామత్త

హింసామత్త పృథివీ !
ధ్వంసలీలాతాండవమున
తనివితీరుటే లేదో !!
సస్యశ్యామల మా మృదు
లాస్యము రుధిరమయమాయె !
సాంధ్య గగన మందవీచి
ఝంఝానిలభయదమాయె ! హింసా ॥

భగ్నాశయవా ! హృదిలో
అగ్ను లేల ? ఆర్తులేల ?
కఠిన శిలలె ద్రవియింపగ
కలుగు కంపనమ్ము లేల ! హింసా ॥

లేవు మధువనస్వనాలు !
ఘోరశతఘ్నీరవాలె !

క్రుంగుదువిట కూలుదువట
నింగి కెగసి రాలుదు వెట ! హింసా ॥

ఇంకనైన వెలువడవొ భ
యంకరతమసాపథాలు
శాంతికాంతు లొలయు నమల
సౌఖ్యవియత్తలి చేరవొ !
హింసామత్తపృథివీ !!

ధర్మచక్రావేదన

ఆర్త యయ్యెనే - పవిత్ర
ధాత్రి భరత భూమి నేడు !
ఆప్త మిత్రు లొండొరులను
హత మొనర్చు కదనస్థలి
రక్తసిక్త మయ్యె నయ్యె
రత్నగర్భహృదయతలి !!
ఆర్త యయ్యెనే !!

కర్మభూమి నే డెవ్వరు
ధర్మచక్ర మేగింతురో
బుద్ధదేవు బోధామృత
మర్థ మెవరు తలపింతురో ! !
ఆర్త యయ్యెనే ! !

ఆ యజాతశత్రు తపన
ఆ యశోకు దయాపరత

ఆ కనిష్ఠ ధర్మపరత
అవని నెవరు మరపింతురో !!

ఆర్త యయ్యెనే! !

స్వార్థపరులు కుటిలమతులు
స్పర్థాన్వితు లజ్ఞానులు
శిష్టహాని సేయగా, అ
రిష్టముల కాటకాల ! !

ఆర్త యయ్యెనే ! !

హతభాగినియై, అనాథ
యై, అరణ్యసీమయందు
పతిని గలియ గోరి పేర్చు
సతి చితాగ్నికీలలందు !!

ఆర్త యయ్యెనే ! !

తండ్రిని చెరసాలనుంచి
తాను గద్దె యెక్కె నొకడు
తనకు సుతుడు జన్మింపగ
తనగుండెలె ఝల్లు మనియె ! !

ఆర్త యయ్యెనే ! !

పేరజాత శత్రుండే
పోరు సల్పె బ్రతు కదెల్ల
కర్మపక్వ మై బుద్ధుని
ధర్మమె శర ణన్నదాక!! ఆర్త యయ్యెనే!!

యుద్ధానలకీలలలో
క్రుద్ధకాలసర్పవిష
జ్వాలలలో క్షతనారీ
బాలవృద్ధరోదనలో !!

ఆర్త యయ్యెనే!!

రాజ్యశ్రీ శోకగీతి

జ్వాలాకీలలలో రాలి, కాలి కాలి, ధూళి తూలి
చాలింతును నా జీవిత మిక !
ఈ చితాగ్నియే శరణ్య మిక !!
గాలిలోని పిచికగూడువోలె రాలె నా పెన్నిధి,
ఏలా బ్రతుకుదునో యింక యెవరికొరకు? నా కెవ రిక !!
నా సర్వస్వము నాశన మ్మాయె నయో అదేలో !
వాసంత విలాస మేది వ్యర్థజీవినౌ నా కిక !!
ఏ వధూవరుల నెడబాపిన పాపినో గతజన్మను ?
ఈ విధిని దురంతచింత జీవిత మెటు గడపుదు నిక ?
జ్వాలాకీలలలో రాలి, కాలి కాలి, ధూళి తూలి
చాలింతును నా జీవిత మిక !
ఈ చితాగ్నియే శరణ్య మిక !!

ప్రబోధగీతి

మూతవడిన కన్నులు తెరువవో
ప్రాతఃకాలప్రభలు విరియవో
దుఃఖతమోవృతధరాతలముపై
సౌఖ్యభానుసందేశము నీయవో !

కఠినశిలాహృది కరిగింపవో
శిశిరతరుశాఖ చిగురింపవో
హింసాకులధరణీతలమందు
అహింసాయుతశాంతికాంతు లొలుకవో !!

పాపీ!

పాపీ! ఓహో పాపీ!—నీ
పాప మ దెంతటిదైనా పశ్చా
త్తాప మందరా పాపీ!!

పశ్చాత్తప్తుని హృదయముపై పర
మేశు కరుణ వర్షించుర పాపీ!! పాపీ!!

కీటకమై తొలిజన్మలోన నా
నాటికి పుణ్యము నార్జన సేయుచు
కోటికోటి యుత్తమజన్మల గని
నేటికి మానవజన్మ నందితివి!! పాపీ!!

నరజన్మములో పుణ్యముచేసిన
మరి యే జన్మములేని ముక్తిరా!
పరమేశుని దయ పాపాత్ములకిల
దొరకదు కోటి కోటి జన్మలకును!! పాపీ!!

హింసారహితము కరుణామహితము
సంసారము భూలోకస్వర్గము

చేజేతులనే సంసారమ్మును
చేసికొనెదు స్వర్గనరకములుగా!

పాపీ! ఓహో పాపీ!—నీ
పాప మ దెంతటిదైనా పశ్చా
త్తాప మందరా పాపీ!
పాపీ! ఓహో పాపీ!!

ధర్మచక్రము

సాగునదే ! సాగునదే !

ధర్మచక్రము ! ధర్మచక్రము!

ఏగునదే ! ఏగునదే !

జగతి నలుదెసల నా చంద్రార్కము!! సాగునదే !!

పిలుచునదే ! వినబడదో !

శిలలు ద్రవించు కరుణతో

పిలుచునదే ! యెద యెద

హత్తించు ప్రేమగళమ్ముతో !! సాగునదే !!

రాజు, రౌతు, ప్రభువు, బంటు

యతి, గృహస్థు చనుమార్గము

సర్వసమము, శాంతికాంతి

పథ మువక్రము ! ధర్మచక్రము !!

సాగునదే ! సాగునదే !

ధర్మచక్రము ! ధర్మచక్రము !

ఏగునదే ! ఏగునదే !

జగతి నలుదెసల నా చంద్రార్కము ! !

గీతాంజలి

ఓయి మహాత్యాగీ ! ఓహో భవ్యయోగీ !
అహో తపస్వి! హే మహాత్మ! జోహారు! జోహారు !

భరతప్రజ శాంతిసమర
భద్రవీరవరులజేసి
గురుతపమున భరతమాత
పరతంత్రత బాపినావు ! !

అన్నదమ్ము లన్యోన్యము
హత మొనర్చుకొనుట మాన్ప
భార మనక ధీరత మెయి
ప్రాణము లర్పించినావు ! !

కరమున వరచక్ర మెత్తి
హరిజనాళి రక్షించితి !
రామచరణ పారాయణ !
శ్రీ దరిద్రనారాయణ ! !

శిష్టగతుల చెలగింపగ !
దుష్టమతుల తొలగింపగ
జగతీధర్మము నిలుపగ
యుగయుగముల నవతరింతు ! !

ఓయి మహాత్యాగీ ! ఓహో భవ్యయోగీ !
అహో తపస్వీ ! హే మహాత్మ ! జోహారు ! జోహారు !

జోత!

ఇదె జోతా నీ కిదె జోతా!
ఓ స్వతంత్ర భారతపితా!

పరిపాలనలో దాస్యాంబుధిలో
తెరువు నెఱుంగని దీర్ఘనిద్రలో
మరగిన నరులకు సత్యాగ్రహ మను
వరాయుధమ్ము నొసంగిన నేతా!

నీ కిదె జోతా! ఇదె జోతా
ఓ స్వతంత్ర భారతపితా!

మన్నిక గలిగిన నరజాతులలో
ఎన్నిక గలదోయ్ మన జాతియునని
మా కొకదేశము మా కొకజెండా
మాకొక ఉన్నతి నిచ్చిన నేతా!

నీ కిదె జోతా! ఇదె జోతా
ఓ స్వతంత్ర భారతపితా!

కరుణా శేషువు కవ్వపుత్రాడుగ
మఱీగెడుపగలే మంథానాద్రిగ
నరుల హృదంబుధి తరచి తరచి శాం
తిరూప సుధ నందించిన నేతా !

నీ కిదె జోతా ! ఇదె జోతా !
ఓ స్వతంత్ర భారతపితా !

ఇదె జోతా ! నీ కిదె జోతా !
ఓ స్వతంత్ర భారతపితా !

పూజాశిరీషములు

పూజాశిరీషము లివిగో—మా
పూజాశిరీషము లివిగో !!
ఓ జీవదయాపర ! బాపూ ! మా
పూజాశిరీషము లివిగో !!

భరతావని జన్మించితివా
అవతారమూర్తివై మించితివా !
చరఖా చక్రాయుధధారీ ! హే
దరిద్రనారాయణశౌరీ !! ఓ జీవదయాపర!!

నిరుపమాన జనతానేతా ! హే
భరతస్వాతంత్ర్యవిధాతా !
సత్యాగ్రహమంత్రోద్గాతా ! హే
ప్రణయహృదయలోకవిజేతా !! ఓ జీవదయాపర !!

మానవతా ప్రపూర్ణమూర్తి! హే
అమరమధురజీవనశక్తి!
అసమానస్వార్థత్యాగీ! హే
అద్వితీయసమతాయోగీ!!
ఓ జీవదయాపర! బాపూ! మా
పూజాశిరీషము లివిగో!!

పృథ్వీప్రశంస

పృథుల క్షమాశాలినీ! పృథ్వీమాతా!
గగనపథస్వేచ్ఛాగామినీ! కాంతిప్రపూతా!!
శశ్వన్నవరాగ నవోష్ణతేజస్వినీ!
అనశ్వర విశ్వరాంధ ఘన సంతమస్వినీ!!
ప్రచలదాంతరోజ్జ్వల జ్జ్వల జ్జ్వాలామాలినీ!
అచలశాంతిమయ తుహినాంబరధారిణీ! ధారుణి!!
నందిత శతసహస్ర హృన్నందన మధుకలస్వనీ!
క్రందిత శతకోటిక్లాంత బృందశోక వికిరధ్వనీ!!
వినయ ముగ్ధప్రణయస్నిగ్ధ విస్మృత సుహృన్మణీ,

విద్వేషవిభేదవాద వికల ప్రకృతిఖనీ,
నిరవధికవికారిణీ! నిస్తుల
నిత్యసత్యసౌందర్యప్రస్తారిణీ!!

దిక్కాలాతీత దివ్యశరీరిణీ! ధరణీ!
పృథులక్షమాశాలినీ! పృథ్వీమాతా!!

లలితాస్తుతి

మాహేశ్వరీ, మహాకాళీ
పాహి సృష్టి లయంకరీ !
ఆదిశక్తీ కాళరాత్రీ
అళికనేత్రీ శాంకరీ !! మహేశ్వరీ !!

మహారూపా, మహామాయా
మహాశక్తి, మహారతీ !
మహాబుద్ధీ, మహాసిద్ధీ,
మహాతంత్ర, మహామతీ !! మహేశ్వరీ !!

పంచప్రేతాసనాసీనా
మహాభైరవపూజితా !
ముక్తదంష్ట్రానలోర్ధ్వికా ! హే
రక్తనేత్రజ్వాలికా !! మహేశ్వరీ !!

రుధిరసక్తా మాంసనిష్ఠా
వారుణీమదవిహ్వలా !

కాలకంఠీ పరాశక్తీ
కపాలమాలాన్వితా !! మాహేశ్వరీ !!

హే శూలధారిణీ హే శ్యామగాత్రా!
హే రుద్రరూపిణీ హే శోణవక్త్రా !
భగవతీ భైరవీ విశ్వాధికా !
రుద్రమూర్తీ శ్యామ నాదరూపా !
ఈశ్వరీ క్షోభిణీ విశ్వసంక్షోభిణీ !
లోకకల్లోలినీ హాకినీ రూపిణీ !
నిర్భవా భవనాశినీ వజ్రధారిణీ !
మూలశక్తీ జగన్మాతా భవానీ !
నమశ్శక్తిదాయినీ హే ముక్తిదాయినీ !
హే క్షణక్షణసంకలితపాలితప్రలయి
తానేకవిశ్వాత్మికా !
ప్రకృతిపూరుషకళాకృద్ద్వయైకాత్మికా !
అద్వయానందసచ్చిదనంతదీపికా !
పాహి లలితాంబికా !
పాహి మాం పాహి మాం పాహి !!

నవవసంతపత్రావళి

339

340

మహోదయం

మహోదయ మాయె నహో ! అహో !
శుభోదయ మాయె నహో !

దెసదెస కెంజాయల కొస లలమగ
మసలుచు ప్రాకే తొలుసంజే !
ఎసగే కాంతి శలాకల మాటున
పస లుడుగు నిరుల వెనుకంజే !

మహోదయ మాయె నహో ! అహో !
శుభోదయ మాయె నహో !

తోటల బాటల చీకటి చాటుల
చలిమంటల వెలవెలలోన !
తూరుపు వాకిలి బంగరు తలుపుల
జయగంటల గణగణలోన !

మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!

తెల తెలపోయెడి చుక్కలదారుల
కలకలపులుగుల పిలుపులలో!
కొక్కొరొకో యని గొంతుల నిండుగ
కుక్కుటముల మేల్కొలుపులలో!

మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!

చెంగున గెంతే లేగల సాకుచు
చెలగే అంభారవములలో!!
లేవడి కరవులు లేవని చాటే
ముంగిటి ధాన్యపురాశులలో!!

మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!!

స్వాతంత్ర్యస్వప్నం

విధుర హేమంత మరిగినదోయి !
ఘన కింక
మధుర వాసంతమై కలదోయి !
ముసరు చీకటితోట
మసలు నాకటి బాట
ఎసగు వెన్నెలతోట
పసిమి వన్నెలబాట !
మనసు మసకలరేయి చనెనోయి !
మన కింక
తెలివి వెల్గొరయు పవలేనోయి !
ఒరగు పీన్గులవాడ
మఱుగు మూల్గులమేడ
కెరలు నాటులవాడ
వరలు పాటలమేడ !

నాల్గువీథుల జాటి రమ్మోయి !

వాసంత

నవశుభోదయము సమయమ్మోయి !

వాడవాడల దిరిగి

మేడ లన్నిటి కరిగి

తోడి సోదరుల నీ

కూడ గొనిరమ్మోయి !

ఊడిగపు బ్రతుకు గడచినదోయి !

మన తల్లి

వాడవాడల స్వేచ్ఛ గనెనోయి !

కలిమి గల్గిన తల్లి

కడుపు చల్లని తల్లి

పసిడివలువల తల్లి

పంటవలతే తల్లి

వలపు విరిదండ గొనితెమ్మోయి !

మన తల్లి

గళమందు వేయ రా రమ్మోయి !

ఒత్తని యకరులతో

మెత్తని దళాలతో

క్రొత్త యామని పూలు
కొమ రొప్పు కమలాలు !

దేవికి నివేదన మ్మిమ్మోయి !
మధురమా

దివ్యామృతము స్వేచ్ఛసుమ్మోయి !
తల్లి బానిసతనము
నెల్ల బాసిన మనము
వైనతేయుల మమృత
మానుదము రా రమ్ము !
విధుర హేమంత మరిగినదోయి !
మన కింక
మధుర వాసంతమ్మె కలదోయి !!

స్వతంత్ర భేరి

మ్రోయింపు జయభేరి !
వాయింపుము నగారా !
తేలింపుము నభోవీథిని త్రివర్ణాంచితపతాకా !
భారతదేశ స్వేచ్ఛాసూర్య నాచ్ఛాదించు రాహుచ్ఛాయ
అంతర్ధానమాయె !...అంతర్ధానమాయె !
మ్రోయింపు జయభేరి !

స్వార్థ మ్మనక సౌఖ్య మ్మనక
సంగ్రామమున పోరి
వీరస్వర్గ మేలగ చనిన
ధీరులకెల్ల జోహార్ !

జోహార్ వివిధరాష్ట్రవీరయోధులకు జోహార్ !
జోహార్ వీరమాతలకును పత్నులకు జోహార్ !
ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారత
ముదయమ్మాయె నహో !

తూరపుఖండపువారల తపములు
కోరిక లీడేరెనహో!!

దెసలల్లిన భారత స్వేచ్ఛాసూర్యుని
ప్రాభాతోజ్జ్వలకాంతి!
ప్రసరించుత తూరుపువాకిలి తెరచుక
ప్రేమపూరితప్రశాంతి!!

దేశదేశముల దీనజనానికి దాస్యబంధన విముక్తి
ద్వేషరోషములు తెగలు పగలు
వశియింప జగమెల్ల శాంతి!!

బౌద్ధభారతవసంతము

నవవసంతము నే డహో
ఎన్నవ వసంతము నే డహో!
దిక్కుదిక్కుల బోధివృక్షపు
దివ్యశాఖలు చివురు లెత్తెను!
బోధిసత్త్వుని బోధనామృత
దీధితులు లోకాన వెలిసెను!! నవ!!

ఆరామవీథికల
ఊరూరబోధకులు!
ఇంటింట సాధకులు
బాధాపనోదకులు!! నవ!!

ఆ మేరువును దాటె
అంభోధులను దాటె
ఆ అహింసాపథము
త్రిజగదాశాపథము!! నవ!!

బుద్ధదేవునిసూక్తి
ఇద్ధ మని యసురక్తి
గళము విప్పి పాడు
నవవసంతము నేడు!! నవ!!

నవవసంతము నే డహో
ఎన్నవ వసంతము నే డహో!!

వాగమృతద

అగణిత శుభదాయినీ! వాణీ! హే జననీ!
వేదవినుతా! రాగమహితా! వాగమృతదా శారదా!
వికలపాపా! విహృతతాపా! సకలసుగతీసాధనీ!
దేవమానీవందితపదా! దివ్యలోకావాసినీ! అగణిత!!
వరకమల మనోహారిణీ! కమలముఖీ! కమలాకరవిహారిణీ!
సితశాంత శశికళాహాసనీ! సుకవితాకళావిలాసినీ!
నిరుపమ కరుణాకలితా! అకలుషనవరసభరితా! అగణిత!!
లోకలీలారచనశీలా! అతివిశాలా భారతీ!
ఆదిప్రకృతీ! అంబికా! ఆర్తజనతా సురలతా!
గానలోలా! కలవిపంచీస్వరఝరీ మదభరీ! అగణిత!!
శాంతియుతా! చారుమతీ! చతురకథాసారమతీ!
హేమాతా! ప్రపూతా!
శాంతియుతా! లలిత కళాకోమలమేఖలాశోభితా!
నవయుగజీవనభావనధాత్రీ!
కవిజనహృదయరతా సావిత్రీ! అగణిత!!

'ద్వారం' వారికి ఆశీః సుమగీతి

నీ యాశీ! సుమరాశి చల్లుమా!
ఓ సరస్వతీ! కళాధిదేవతా!

ప్రతిభావంతుడు వినయవినమితుడు
నేతుశీత నగవిఖ్యాతుండు
శిల్పకల్పనాపారావారము
మా అమూల్యవరమా ద్వారముపై!

తన సాధనచే తన తపస్సుచే
తన గానకళావైశద్యముచే
తన రాష్ట్రమునకు తన దేశమునకు
ఘనతను కూర్చిన మా ద్వారముపై!

తానాలాపములందు స్వరములకు
ప్రాణము పోసిన ఘననయఫణితుల
మానవహృదయపుతంత్రుల తాకే
మధురగాయకుడు మా ద్వారముపై!

హృది పులకించు ధనుష్టంకారము
బ్రీదుకులు చివురించే ఓంకారము
రాగరసానందపదద్వారము
తనకు వరములౌ మా ద్వారముపై !

నీ యాశీః సుమరాశి చల్లుమా!
ఓ సరస్వతీ! కళాధిదేవతా !

యుగకర్తా! అభివాదాలు!!

కందుకూరి వీరేశలింగం
నీ వొక మహోన్నతశృంగం!
ఎందుకు జన్మించాడో
ఈత డని ప్రశ్నిస్తే—
ఇందు కని జవాబు వచ్చే
వందనీయు లందరిలో
కందుకూరి వీరేశలింగం
నీ వొక మహోన్నతశృంగం!
నీవు జీవించినప్పుడు
నేను జన్మింపనే లేదు
అప్పుడు నీతో జన్మించడం
అదొక అదృష్టమే అయినా
ఇప్పుడు జన్మించడమే
ఇదే వొ కదృష్ట మనుకుంటా!

నీ జీవించినరోజుల్లో
నీ వొక్కడవే ఒక వెలుగు !
నీ చుట్టూ మహాంధకారం
నే నందులో బ్రతికుందునా ?
నీ తరవా తొక నూరేళ్ళ కి
నీ కిరణాలే మే మంతా !
నీ జీవించిన ఆ దినాల్లో
నిద్రిస్తోం దీ జాతంతా !
నిద్రితజాతిని లే లెమ్మని
విప్లవశంఖం పూరించావ్ !
నీ తరవా తొక నూరేళ్లకి మే
మంతా నీ జయశంఖాలం !

ఈ యుగాన తొలిరోజుల్లో
నీవే జన్మించకపోతే
ఆంధ్రజాతి అనేకయుగాలు
అష్టదరిద్ర మైపోయేది !
పీడితజనులకు ఊరటగా
బాసట ఐ నిలిచిన దెవరు ?

అన్నపూర్ణవంటి గృహిణితో
ఆర్తజనకుటుంబివి నీవే !

నిరంకుశులకాఠిన్యం
ఎదిరించ సాహసించిన దెవరు ?
మేరుధీర హృదయేశ్వరితో
వీరయోధవరుడవు నీవే !

మూఢాచారపుసంకెళ్లను
ముక్కలుగా త్రెంచిన దెవరు ?
జ్ఞానశీల ప్రాణేశ్వరితో
సత్యధర్మపరుడవు నీవే

తన సౌఖ్యాన్నే మరిపించే
త్యాగబుద్ధి చూపిన దెవరు ?
సహనశీల రాజ్యలక్ష్మితో
మహామహితాత్ముడ వీవే ?

తెలుగుతోట కొత్తదారుల
కొత్తపైర్లు చల్లిన దెవరు ?

అమలవాణి భాషాసతితో
అమరగురుసమానుడ వీవే !

చరిత్రలో సాహిత్యంలో
పరిచిన నీ తొలిదారుల్లో
ఉన్నతభావాలు స్మరిస్తూ
నీ అడుగుల వెనుకనె వస్తాం !

నూరేడుల ప్రతిజయంతికీ
నీ విజయం ప్రతిధ్వనిస్తాం !

ధన్యభరతమాతృపుత్రా !
అభినవాంధ్రచరిత్రకర్తా !
నీ పవిత్రపాదాల కివే
మా నిరంతరాభివాదాలు !!

మాతృభూమి

హే భువనమనోమోహినీ
నిర్మలసూర్యకరోజ్జ్వలధారుణీ-జననీ!! హే!!
నీలసింధు నిర్మల జల
ధౌతచరణ కమలతల
అనిల విచంచల కోమల
శ్యామల నవ సస్యాంచల
అంబర చుంబిత విశాల
ఫాల హిమాచల!
ధవళ తుషార కిరీట సుశోభినీ-జననీ!! హే!!
తొలి ప్రభాతమున నీ గగనమున
తొలి తపోవనుల సామరవమున
ఎన్నో జ్ఞానధర్మకాంతు లొలసె
ఎన్నో మహాకావ్యతతులు వెలసె
చిరకళ్యాణమయీ అతిధన్యశీలవన్మా
అవిరళవితరణశీలివి అన్నపూర్ణవన్మా
యమునాజాహ్నవీగలితకరుణాకలితా
పుణ్యమధురపీయూష స్తన్యవాహినీ జననీ!! హే!!

సరోజిని

అందుకొనుమ ఈ సుమాంజలి !
అమరగాయనీ ! సరోజిని !

వీరనారివై స్వాతంత్ర్యతా
ఘోరరణంబున పోరితివి!
విదేశీయులకు భారతవిదుషీ
వికాసమును ప్రకటించితివి !! అందు!!

అజ్ఞానపు టంధకారము
హాత మొనర్చు నిశితదృష్టితో
వక్త వౌచు సూక్తి మురళిని
పలికించితి సుధావృష్టితో !! అందు!!

జీవమురళి మూగవోయినా
భావసరళి మధురగీతమై
దేశదేశముల యుగాలుగా
ఆశాశల మ్రోగుచుండులే !! అందు!!

సరోజిని

భారత స్వాతంత్ర్య భవనసంధాత్రి!
మాన్య మకుటోపేత మహిత జనయిత్రి!
మా జోతలివె ఓ సరోజినీదేవి!

వంగదేశీయవిద్వద్వంశమందు
ఆ హరీంద్రుని యక్క వౌచు జన్మించి
కమనీయభావాల కవయిత్రి వౌచు
పాశ్చాత్యభాషల ప్రౌఢ వనిపించి
ముత్యాలనాయని మురిపెంపు సతివై
తెలుగుకోడలి వౌచు తేజరిల్లితివి?
మా జోతలివె ఓ సరోజినీదేవి!

నీ కంఠమాధురీ నిభృతగీతికల
రాజదండంబైన రమణీయమురళి
నీ రాష్ట్రపాలనా నిర్వహణమున
సర్వప్రియత మ్రోగి సార్థక మ్మాయె!
అతిరథ వగుదు, మహారథ వగుదు
ఆత్మవేసుమి భారతాంబకు నీవు!!
మా జోతలివె ఓ సరోజినీదేవి!!

అంజలి

అంజలిదే మానవోత్తమా !
అఖిలలోకపితా! మహాత్మా! అంజలిదే!!

మకుట మేల బిరుద మేల
మహిత సార్వభౌమా ! నీ
అకలంకప్రేమ నేలినావు
సకల భూమండలి!! అంజలిదే!!

తనలోపల జీవాళిని
తన్ను సకల జీవులలో
కనుగొను కరుణామూర్తీ !
ఖేదమోద సమవర్తీ!! అంజలిదే!!

ఆ తథాగతుండు క్రీస్తు
అవని బ్రోవ నీవె యాచు
ఆ యహింస పరమధర్మ
మను సత్యము నెలకొల్పిరో!! అంజలిదే!!

లోకప్రజ హృదయమ్ముల
ఏకత్వము నీకు శాంతి !
దశదిశలను నీ యాశీః
ప్రసవవృష్టి మాకు కాంతి !!

అంజలిదే మానవోత్తమా !
అఖిలలోకపితా ! మహాత్మా !!

శాంతిదూత

జయ జయ భారత భాగ్యవిధాతా!
జగత్ శాంతిదూతా !
జగతికెల్ల శుభదినమ్ము నీదగు
జన్మదినము సత్యమార్గనేతా !

ధన్య నిన్ను గన్న యీధరిత్రి !
ధన్య మా భరతధాత్రి !
పరమధన్యులము భారతీయులము !
బాపు మా గురుడ వీవె ! !

పగలు తెగలు మఱచి నిఖిలప్రజ నీ
పథమున నెద యెద గదియ జేయునో !
రగులు లోభమోహములు నశింపగ
రామరాజ్య మీభువి నిక వెలయునో ! !

జయ జయ భారత భాగ్యవిధాతా !
జగత్ శాంతిదూతా !!

సర్వోదయము

ఓ బాపూ ఓహో బాపూ మా బాపూ మా ప్రియ బాపూ!
నీ జీవన మధురస్వప్నంలో
మా జీవితమార్గం దీప్తంగా మము
దీవిస్తున్నావా చిరునగవున
పరికిస్తున్నావా! ఓ బాపూ !!

మనిషి మనిషీ తకిలీపట్టి
నిమిష నిమిషం నూలువడుకుతే
తనకు తానే వస్త్రదాతయై
జగం సర్వం సుభిక్ష మౌను !

ఇదే మంత్ర మాదేశించావ్
విదేశాల చూ పే లన్నావ్
స్వదేశీపరిశ్రమ లెడల
ఉదాసీనతను మాన్పించావ్ !! బాపూ!!

ఆచరణములను ఆకులచుట్టూ
ఆదర్శమ్మను సూత్రము కట్టీ
సూత్రపు కొస శ్రద్ధను కదు రుంచీ
ధర్మచక్రం ప్రవర్తించితే
సర్వజీవితాధారం దారం
లాగగ లాగగ సాగుతు వస్త్రే!!

అనురాగమె కండెలుగా చుట్టి
పడుగూ పేకా అడ్డం నిలువూ
పరచుకు పేర్చుకు అల్లుకుపోతే
జీవితములు వస్త్రావృత మౌను!!
బాపూ ఓహోహో బాపూ!!

ఉగాది

స్వతంత్ర భారతజననీ, నీ కిదె
నితాంత నవనీరాజనము
అశేష పూజాశిరీషములతో
అగణిత నరనారీజనము !!

స్వతంత్ర భారతజననీ !!

వదలెను చిరదాస్యపుశృంఖలములు
చెదరెను దైన్యతమఃపటలమ్ములు
ఆసేతుహిమనగ మ్మొకపొంగై
అలముకొన్న ఆనందతరంగము ! !

స్వతంత్ర భారతజననీ ! !

బలిమికి జేగురు, తాల్మికి తెల్లన
కలిమికి పచ్చన, కర్మచక్రము,
వాడ వాడ నీ హృదిలో మేడల
నేడు త్రివర్ణపతాకములే !!

స్వతంత్ర భారతజననీ !!

పచ్చనితోటల నే యెడ విని నా
స్వేచ్ఛాపికములు నిండుగళమ్ముల
హాయి హాయిగా రెక్కల విప్పిచే
తీయని గీతీహారతులే!!

స్వతంత్ర భారతజననీ!!

త్యాగమూర్తియా మహాత్ము డొసగిన
శాంత్యహింసలే సదాశయములుగ
సకల వసుంధర నేకము చేయగ
అకలంకులమై ప్రతినలు సేతుము!!

స్వతంత్ర భారతజననీ!!

స్వాతంత్ర్యఘంట

స్వాతంత్ర్య శుభోదయ ఘంటా
నాదం బదె మ్రోగెను మింట!
టంఠం టఠం టఠటం!
టంఠం టఠంఠం!

వీతెంచె నవాశామారుత
మోతల్లీ! మా నవభారతి!
టంఠం టఠం టఠటం!
టంఠం టఠంఠం!

నీ పదాల కెరగెడు శిరాలు
నీకు జోత లిడు మాకరాలు!
నీ కిడు నవగీతీహారతి!
మా తల్లీ! ఓ నవభారతి!
టంఠం టఠం టఠటం!
టంఠం టఠంఠం!

V. R. NARLA MEMORIAL LIBRARY
V. R. NARLA
V. R. I.
Acc. No.

పగలు తెగలు తగవులు మరచి
నగుమొగాల హృదులను తెరచి
కనబడు నీ చల్లని మూరితి
జననీ! ఓహో నవభారతి!

టంతం టతం టతటం!
టంతం టతంతం!

భర్మసస్యకాంతుల నడుమ
కర్మచిహ్న ధర్మచక్రమై
కూర్మి పేర్మి చాటెడు కీరితి
నీ పతాక! మా నవభారతి!

టంతం టతం టతటం!
టంతం టతంతం

సత్యాగ్రహమంత్రగురుండు
శాంతిదూత యోగివరుండు
స్వాతంత్ర్యమహారథసారథిం
గన్నతల్లి! మా నవభారతి!

టంతం టతం టతటం!
టంతం టతంతం

స్వాతంత్ర్యశుభోదయఘంటా
నాదం బదె మ్రోగెను వింట !

టంఠం టఠం టఠటం !

టంఠం టఠంఠం !!

నవభారతసందేశం

అహో నవప్రభాతము !
శుభాశాపరిపూతము ! !

స్వాతంత్ర్యోజ్జ్వలయువాశయోత్సాహోపేతము ! !
అదె స్వతంత్ర భారతదేవాలయ ఘంటారావము !
అదె అశోకచక్రాన్విత త్రివర్ణకేతనహాసము !
అదె స్వరాజ్య ప్రజాభోజ్య సువర్ణభవనవికాస
మహోనవప్రభాతము !
శుభాశాపరిపూతము !

ఆసియా నివాసులార ! స్వాతంత్ర్యపిపాసులార !
స్వాతంత్ర్యమ్మున కర్హులు సకలమానవు లని చాట
బర్మా చైనా జావా ప్రజలు మనకు తోడు నే
డహో నవప్రభాతము !
శుభాశాపరిపూతము !

శాంతి కాంతిపరిపోషము ధర్మచక్రపరివేషము
సత్యసస్మితావేషము మహాత్మమహోపదేశము
జగత్కుటుంబాదర్శము నవభారతసందేశ
మహోనవప్రభాతము !
శుభాశా పరిపూతము ! !

స్వాతంత్ర్యోత్సవ పుష్పాంజలి

మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్రజాతి !
భరతదేశమే మా దేశం !
భారతీయులం మా ప్రజలం !!

వింధ్య హిమవత్ శ్రీ నీలాద్రుల
సంధ్యారుణిత నవాశలు మావి !
గంగా గోదావరీ సహ్యజా
తుంగతరంగితహృదయాల్ మావి !!

ఆలయమ్ముల శిల్పవిలాసం !
ఆరామమ్ముల కళాప్రకాశం !
మొగల్ సమాధుల రసదరహాసం !
మాకు నిత్యనూతనేతిహాసం !!

అహింసాపరమోధర్మః
సత్యం వద ధర్మం చర

ఆదిఋషుల వేదవాక్కులు
మా గాంధిగౌతముల సువాక్కులు!!

స్వతంత్రతా భ్రాతృత్వాలు
సమతా మా సదాశయాలు !
జననీ ! ఓ స్వతంత్రదేవీ !
కొనుమా ! నీవాళులు మావి !!

ప్రబోధము

జైహిం దని జైహిం దని
నడు ముందుకు ! నడు ముందుకు !
మువ్వన్నె పతాక నెత్తి
ముందుకు నడు, నడు ముందుకు !!

ముం దేమిటి గమ్య మ్మని
ఎందుకు ప్రస్థాన మ్మని
అద రెందుకు, బెద రెందుకు
ఎదురే లేదని ముందుకు
ప్రణయయోగి గాంధిబోధ
ప్రపంచైక్యతకు మందని !!

జైహిం దని !!

కలకత్తా అమృతసరూ
కాకినాడ కథేవరూ
కాశ్మీరం డార్జిలింగ్
కన్యాకుమారి పూరీ

ఆసేతుహిమాచలమూ
అంతా మందే హిందని ! !

జై హిం దని !

లేదు లేశమును మాకే
దేశ మాక్రమించు నాశ !
మా పురాణభూమిపైని
సైప బో మొకరి దురాశ !
లేదిక పరతంత్ర దేశ
మీ ధరిత్రి నికముందని ! !

జై హిం దని ! !

భేదవాదసంకులమై
భీకరసమరాకులమై
పరస్పరవిమారకమా
బహుళజాతిపుంజమందు
సత్యాహింసాత్మకమా
నిత్యధర్మమార్గదర్శి
ప్రాచ్యగగనపరంజ్యోతి
భవ్యభారతియె మందని !!

జై హిందని ! !

అభినందనము

* (విజయవాడకు)

అభినందన చందనపవనసుగంధము లివిగో!
ఆనందితహృదయసుమ నవమరందము లివిగో!
విజయవాటికా !
ప్రాచీనభరతబౌద్ధార్షజ్ఞానపేటికా !
ఇంద్రకీలదుర్గాచలవరకిరీటికా !
కృష్ణాతరంగచుంబితమృదుపాదపీఠికా !
అభినందన చందనపవనసుగంధము లివిగో !
నభోవాణి నవోన్మేష శుభసంధ్యారుణిమ
సకలకళాసాహితీ కలితనాదమధురిమ
వికసితకోటిత్రయాంధ్ర నయనయుగళితరళిమ !
అభినందన చందన పవనసుగంధము లివిగో !
ఆనందితహృదయసుమ నవమరందము లివిగో !!

---

* (విజయవాడ ఆకాశవాణి ప్రారంభోత్సవము.)

తెలుగుతల్లి

తెలుగుతల్లీ ! యశఃకల్పవల్లీ !
ఎసగు పైడిపైరుల పాలవెల్లి ! !

కాలవాహినీ బహుతరంగాల
కదలని ధరాపరాగవేదికల
నిభృతమౌ మహోన్నతచరిత్ర లివే !

ప్రసవమాలగా నీ గళమ్మునకు ! !

తెలుగుతల్లీ ! యశఃకల్పవల్లీ !

రాల రాగిరేకుల మలయుగీతలు
తాళపత్రాలపై వెలయు కైతలు,
వీరజనపదమ్ముల కథలు, గాథలు,
నీదు చరితాల సారంపుబోధలు ! !

తెలుగుతల్లీ ! యశఃకల్పవల్లీ !

ఎసగు పైడిపైరుల పాలవెల్లి ! !

మంగళం

మంగళమ్మమ్మ ఆంధ్రావనీ!
మహితస్వర్లోకగోరూపిణీ!
మంగళమ్మమ్మ ఆంధ్రావనీ!! మంగళ!!

గౌతమీ తుంగభద్రా కృష్ణవేణీ త
రంగ మధుర స్తన్యవాహినీ!!
తిరుమల శ్రీ సింహవరశైలశృంగినీ
స్నిగ్ధరత్నవిభూషితాంగినీ!! మంగళ!!

విహరింపవమ్మ స్వేచ్ఛావిహంగపథాల
కటిగతస్వర్ణ మేఖలవై
నికటవర్తి కోటిత్రయాత్మజార్పిత
విశృంఖలసుమాంజలివై విలోలసస్యావలీ
శ్యామలాంబరవై విహరింపవమ్మ!! మంగళ!!

మార్త్యోగనీ అనారతము నానాజాతి
జనసభాంగణములన్

విజ్ఞపండితత్వోత్సుతావళిగళమ్ములన్
ధర్మసద్గుణములన్ మార్తోగనిమ్మా !! మంగళ !!

నర్తింపనీ సగర్వముగా దేశదే
శాల సువిశాలకేతనములన్
నీదు కేతనములన్
మా గొప్పతనములన్ నర్తింపనిమ్మా !! మంగళ !!

విజయప్రభాతము

విందు రే మే మనే మే మని?
కందు రే మే మనే మే మని?
అంద రిటు రండి చూడం డని!
సుందరము విజయప్రభాత మని!
అందరికి కొత్త ఆమని యని!!

విశాలావకాశాంతరాలందు వ్యాపించి
లోకాన శంకాకులానేక విద్వేషవిద్రోహముల పెంచు
మాయావృతాశేషభీతిప్రదచ్ఛాయ లవె వెల్వెలఁ
[జారె!

దిశలఁ నిశారాజ్ఞికేశాంధకారప్రభల్ తీరె!
ఎదలఁ నిరాశావృతోద్రిక్త సందేహభావాల్ తిరోగా
[ముల్లై పారె!!
దిక్కామినీఫాలభాగాన, నున్నంచు సోనల్ చెలంగంగ
సుస్నాతసౌందర్య మొల్కంగ

గిరులందు తరులందు గుహలందు
తమగూడులను నిద్దురలు తీరిన శకుంతముల చిన్నిచిని
[నోళులందు
తీయ నగు ఎర్రావలింతలన్, తల్లిపొత్తిళ్ల త్రుళ్లింతలన్
ఎరకకట్టుచు అప్పుడప్పుడే చాచు పక్షముల విదిలింతలన్
లేతకోరికల కదిలింతలన్— విందు రే మే మని!!

చెల్లచెదరై సన్నగిల్లు నీహారమున,
ఏరులై పారు బంగారమున,
సూర్యవిభుతేరు గోపురపు కోటీరమున,
మిలమిలలలో తళత్తళతళలలో ధగద్ధగధగలలో,
రాశులై పోసిరో కుంకుమ మ్మనిపించు
రమ్యసంధ్యావర్ణ రాజిలో
నీలసుశ్యామలారుణముఖ్యసప్తవర్ణాశ్వదీధితులవెల్గే న
[భోరేఖలన్,
పుణ్యభూముల పవిత్ర నదీనదమ్ములన్,
ఓంకారపూర్వమ్ముగా గీయమానమ్ములౌ
వేదగాయత్రినాదమ్ములందు— విందు రే మే మని?

దగ్గరాయెను విజయ మనుచు,
దిగ్గు మని లేచి తల లూచుచు,
ఒక్కరొక్కరు తూర్పుదిశగా
చక్కగా రండి చూడం డని,
కొక్కొరో కొరొ కొక్రొకో అని
కుక్కుటోద్బోధగీతమ్ములన్-విందురే మే మని?

గతము చెడ్డది, నిశాంధ మని, ఆ
గతమె మంచిది, సుప్రభాత మని!
సుందరము విజయప్రభాత మని,
అందరికి కొత్త ఆమని యని!

విందురే మే మనే మే మని?
కందురే మే మనే మే మని?

382

అచ్చు పొరపాటులు

పుట.	పంక్తి.	ఉన్నది.	ఉండవలసినది.
25	1	లెవు	లేవు
32	3	సస్న	సస్య
40	4	స్వప్ప పారావారము	స్వప్న పారావారము
54	7	కవితగాన	కలితగాన
66	6	కమ్మతాల	కమ్మతావు
66	7	]ఎండకారు	[ఎండకారు
66	8	వీనేందిర	వనేందిర
88	8	అమ్రతవాహినుల	అమృతవాహినుల
167	8	వపలురేలు	పపలురేలు
192	15	—	(కాళిదాసునకు కృతజ్ఞత)
264	6	గుండెబరువుతీర్చినపాట	పాటలో 4-వ పంక్తిగా చదువుకొనుడు.
282	15	ఏతిరునా	ఏతీరుగా
282	16	—	(రవీంద్రునకు కృతజ్ఞత)
283	14	సారగము	సాగరము
285	13	19 8 లో	1938 లో
287	9	—	(రవీంద్రునకు కృతజ్ఞత)
288	20	—	(రోజెటీ ఆంగ్లరచనకు కృతజ్ఞత)
291	Foot note	దేవదాసునాటికోసం	దేవదాసునాటికకోసం
297	9	కంటకయుత్మై	కంటకయుంతమై
336	5	మహేశ్వరీ	మాహేశ్వరీ
”	9	”	”
”	13	”	”
357	19	—	(రవీంద్రునకు కృతజ్ఞత)

ముద్రణము
వావిళ్ల ప్రెస్
మద్రాస్ 21.

384

మనము ఫౌండేషన్ పుస్తకాల పంపిణీపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA103B103
పుస్తకం పేరు	శతపత్రసుందరి
తారీఖు	31 December 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	425
పెద్ద సైజు పేజీలు	NO
కాలి పేజీలు	NO
రేపు పేజీలు	NO
తయారు చేసినది	Sudhiya
పేజీలు బదిలీచేసినది	Sudhiya
స్కాన్ చేసినది	CL Naga Sudha
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
స్కానింగు చేసినది	
పరిస్థితి	good

সাঃ ৫, 2, 58

80, 144, 146, 224

276 338, 340

382 18 388

16

67